అనుదినం... జనస్వరం
www.navatelangana.com
సంపుటి : 10 సంచిక : 289
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శుక్రవారం18-10-2024
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50



దుర్భర దారిద్ర్యంలో 110 కోట్ల మంది

యుద్ధాలు, దాడులు, ఘర్షణలు నెలకొన్న దేశాల్లోనే సగం మంది

భారత్‌లో అత్యధికం

శాంతితోనే పేదరిక నిర్మూలన : ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి

న్యూయార్క్ : వంద కోట్ల మందికి పైగా ప్రజలు దుర్భర దారిద్ర్యంలో బతుకుతున్నారని ఐక్యరాజ్య సమితి ఒక నివేదికలో పేర్కొంది. వీరిలో దాదాపు సగం మంది యుద్ధాలు, దాడులు, ఘర్షణలతో సతమతమవుతున్న దేశాల్లోనే వున్నారని వెల్లడించింది. యుద్ధాలను ఎదుర్కొంటున్న దేశాలు బహుముఖ దారిద్ర్యానికి సంబంధించిన అన్ని సూచికల్లోనూ అధిక స్థాయిల్లో లేమిని ఎదుర్కొంటున్నాయని గురువారం ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) ప్రచురించిన సూచీ పేర్కొంది. పోషకాహారం, అందుబాటులో విద్యుత్, నీరు, పారిశుధ్యం వంటి విషయాల్లో మరింత తీవ్రమైన అసమానతలు నెలకొన్నాయని పేర్కొంది.

112 దేశాల వ్యాప్తంగా, 630కోట్ల మంది ప్రజలపై జరిగిన పరిశోధనల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 110కోట్ల మంది ప్రజలు అత్యంత దారుణమైన రీతిలో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని పేర్కొంది. వీరిలో 45.5కోట్ల మంది ప్రజలు ఘర్షణల నీడల్లో జీవిస్తున్నారని మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ పేర్కొంది. ఇటీవలి సంవత్సరాల్లో ఘర్షణలు ఉధృతమయ్యాయి. ఎక్కడికక్కడ అనేక రెట్లు పెరిగిపోయాయి. దీంతో మరణాలు కూడా అధికంగా నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిల్లో లక్షలాదిమంది నిర్వాసితులవుతున్నారు. ఫలితంగా వారి జీవితాలకు, జీవనోపాధులకు తీవ్ర స్థాయిల్లో ఆటంకాలు ఎదురవుతున్నాయని యుఎన్‌డిపి నేత ఆచిమ్ స్టెయినర్ పేర్కొన్నారు. 18ఏండ్లలోపు దాదాపు 58.4కోట్ల మంది ప్రజలు తీవ్రమైన పేదరికంలో మగ్గుతున్నారని సూచీ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా గల పిల్లల్లో వీరి సంఖ్య 27.9శాతంగా వుంది. యువత సంఖ్య 13.5శాతంగా ...3లో

OXFAM 3లో..

ఆకలి యుద్ధాలు !

పట్టెడన్నం కరువై ఏటా 21 వేల మంది మృతి : ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక



మూసీ సుందరీకరణ కాదు..

పునరుజ్జీవం

హైదరాబాద్‌ను రక్షించేందుకే ఈ ప్రాజెక్ట్

పునరావాసం తర్వాతే ఖాళీ చేయిస్తాం

- ఎలా ముందుకెళ్లాలో సలహాలివ్వండి : ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- శనివారంలోగా యాక్షన్ ప్లాన్ తెలపాలంటూ సూచన
- మూసీపై క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు
- ప్రాజెక్ట్‌పై చర్చించేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం : మీడియాతో ముఖ్యమంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ పునరుజ్జీవమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీ అభివృద్ధి ప్రాజెక్టు వివరాలను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం వెల్లడించారు. "చిన్న చినుకు పడితే నగరం అస్తవ్యస్తంగా మారుతోంది. లోతట్టు ప్రాంతాలు మునిగి పోతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. వీటన్నింటి పరిష్కారమే మూసీ ప్రాజెక్ట్. తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే మూసీ కార్యాచరణను మా ప్రభుత్వం తీసుకుంది. ఫలితంగా ప్రపంచంతో పోటీ పడే నగరంగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. "నది పరివాహక ప్రాంతాల్లోనే నాగరికత విలసిల్లింది. ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లో ప్రతి పదింటిలో ఎనిమిది నగరాలు నది తీర ప్రాంతాల్లోనే వెలిశాయి. నగరం మధ్యగుండా నది వెళ్తున్న రాజధాని ఒక్క హైదరాబాద్ మినహా ఈ దేశంలో మరొకటి లేదు. అనంతగిరి కొండల నుంచి కృష్ణాలో కలిసే వరకు దాదాపు 300 కిలోమీటర్లు ప్రవహించే మూసీ, కాలక్రమంలో విషతుల్యంగా మారడంతో హైదరాబాద్‌తో పాటు నల్లగొండ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతం నివాసయోగ్యం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. మూసీని పాత నదిలా మార్చేందుకు చేపట్టిన ప్రాజెక్ట్‌ను కూడా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. విషం నింపుకుని ఈ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారు" అని సీఎం విమర్శించారు. మూసీపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామనీ, ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు సలహాలిస్తే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీలు సైతం తమ సూచనలు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి సలహాలివ్వాలని సూచించారు. శనివారంలోగా విపక్షాలు తమ యాక్షన్ ప్లాన్ ...3లో

మూసీ ఒడ్డున మూడు నెలలు ఉండగలరా? కేటీఆర్, హరీశ్, ఈటలకు సీఎం సవాల్

23న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, హైడ్రా.. మూసీ ప్రక్షాళన కీలకాంశాలు

చర్చించి పలు నిర్ణయాలు

వివరాలు 5లో

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

కేంద్రానికి సీజేఐ డీవై చంద్రచూడ్ సిఫారసు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ సర్వోన్నత న్యాయస్థానం తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. ఈ మేరకు గురువారం ప్రస్తుత ప్రధాన ...3లో

హర్యానా సీఎంగా సైనీ ప్రమాణస్వీకారం

ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు హాజరు



చండీగఢ్: హర్యానాలో గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ ...13లో

పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6ఎ రాజ్యాంగబద్ధమే

4:1 మెజారిటీతో సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ : పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాజ్యాంగ బద్ధతను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో తీర్పు ...13లో

ప్రయాణికులకు ఇండియన్ రైల్వే షాక్

రైల్వే అడ్వాన్స్ రిజర్వేషన్ల వ్యవధి 120 నుంచి 60 రోజులకు కుదింపు

నవంబర్ 1నుంచి నూతన ఏఆర్పీ రూల్ అమల్లోకి



వివరాలు 13లో..



ఈ సీఎం.. ఇండ్లను కూల్చే

గుంపు మేస్త్రీ

ఉద్ధండులైన చంద్రబాబు, వైఎస్‌నే ఎదుర్కొన్నాం

రేవంత్ మనకో లెక్కా...?

గురుకులాల అద్దెలకు డబ్బుల్లేవుగానీ.. మూసీ ప్రక్షాళనకు రూ.లక్షన్నర కోట్లా? : కేటీఆర్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'గుంపు మేస్త్రీ అంటే కొత్త ఇండ్లను కట్టేవాడు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ ఉన్న ఇండ్లను కూల్చే దుర్మార్గపు మేస్త్రీ...' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం గతంలో ఉద్ధండులైన చంద్రబాబు, వైఎస్‌నే రాజకీయంగా ఎదుర్కొన్నామనీ, ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు రేవంత్ ఓ లెక్కకాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ప్రతినిధుల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఆటోవాలాలు, మూసీ, హైడ్రా బాధితులు... ఇలా అనేక తరగతుల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతోందని వాపోయారు. వారందరూ తమ సమస్యలను చెప్పుకోవటానికి తెలంగాణ భవన్‌కు క్యూ కడుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్... ఆశాలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను రీ-షెడ్యూల్ చేయాలంటూ కోరితే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా బాధితులందరూ తమ వద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ...13లో

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం

- కాలేజీలు నడపలేక తాళాలు వేసుకునే స్థితిలో యాజమాన్యాలు
- సమస్యలు పరిష్కరించకుంటే సెక్రెటేరియట్, ప్రగతిభవన్ ముట్టడిస్తాం : ఎస్ఎఫ్ఐ
- నారాయణగూడ నుంచి భారీ నిరసన ర్యాలీ
- జిల్లాల్లోనూ నిరసన కార్యక్రమాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో, హిమాయత్‌నగర్

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ, తెలంగాణ ప్రయివేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ నారాయణగూడ నుంచి వైఎంసీఏ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, మాట్లాడుతూ.. రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ...5లో



కాలకృత్యాలకూ కష్టమే

సగటున 600 మంది విద్యార్థులకు 20మరుగుదొడ్లు

ఏడుగురికొకటి ఉండాల్సి ఉండగా 30 మందికొకటి

ఉదయం నాలుగున్నర నుంచే క్యూ

ఐదు గంటల నుంచి స్నానాల కోసం లైన్

అయినా టైంకి స్కూల్‌కు వెళ్లడం కష్టమే

మిగతా టైం టేబుల్‌పైనా ప్రభావం 3లో..

యోగా క్లాసులు, వ్యాయామాలకు వెళ్లలేని దుస్థితి

మానసిక ఒత్తిడిలో పిల్లలు

ఇదీ మన గురుకులాల పరిస్థితి



పకడ్బందీగా గ్రూప్-1మెయిన్స్

21 నుంచి 27 వరకు పరీక్షల నిర్వహణ

పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి

46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

కలెక్టర్లు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి 13లో.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం : టీజీపీఎస్సీ చైర్మెన్

85 శాతం మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ : కార్యదర్శి

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

ప్రభుత్వమే సరుకులు సరఫరా చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థలకు సొంత భవనాలను నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే సరుకులను సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల అద్దె భవనాలకు అద్దెలు చెల్లించకపోవడంతో యజమానులు హాస్టళ్లకు తాళాలువేసి మూసివేశారని తెలిపారు. ఇది విద్యార్థుల భవిష్యత్‌కు తీవ్ర నష్టమని పేర్కొన్నారు. ఆ భవనాలను తక్షణమే తెరిపించి విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా నడిపించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ...13లో

అగర్తలా- లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం

పట్టాలు తప్పిన ఎనిమిది బోగీలు

అసోం దిబలోంగ్ స్టేషన్ వద్ద ఘటన




గువాహటి: అసోంలోని దిమా హసావో జిల్లాలో రైలు ప్రమాదం జరిగింది. అగర్తలా నుంచి ముంబయికి బయల్దేరిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌తో పాటు ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటన దిబలోంగ్ స్టేషన్ వద్ద గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే ...13లో

చీకటి ప్రపంచంలో ఎమోజీలు !

రహస్యాలు చేరవేసే సాధనాలు | నేరస్థుల సమాచార మార్పిడికి సోపానాలు

ఎమోజీ మన రోజువారీ జీవితంలో అంతర్భాగమై పోయింది. అది మన భావాన్ని వ్యక్తీకరించడానికి వాడే డిజిటల్ ప్రపంచ భాషగా మారింది. ఓ చిన్న సంకేతంలో ఎంతో అర్థాన్ని అందించేదే ఎమోజీ. అయితే ఈ ఎమోజీలు ఎప్పుడూ నిరపాయమైనవేనని చెప్పలేము. ఇంటర్నెట్‌కు చెందిన చీకటి దారులలో ఈ చిన్న చిన్న చిహ్నాలను కొందరు దురుద్దేశ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుంటారు. సైబర్ దాడుల వంటి నేరాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఇచ్చిపుచ్చుకునేందుకు దుండగులు నవ్వు, ఏడుపు ముఖాల నుండి గుండె చిహ్నాల వరకూ ఎమోజీలను కోడ్ సంకేతాలుగా వాడుతున్నారు. అసలు ఎమోజీలు క్రిమినల్స్‌కు ఎలా ఉపయోగపడుతున్నాయి? వారు వచన రూపంలో కాకుండా సందేశాన్ని పంచుకునేందుకు చిహ్నాలను ఉపయోగించడం మొదలు పెట్టారు.





న్యూఢిల్లీ : బాలీవుడ్ చిత్రాలలో మాస్కులు ధరించిన నేరస్థులు కోడ్ మాటలతో తమకు కావాల్సిన వ్యక్తులను గుర్తించి వారితో సంభాషిస్తారు. దీనివల్ల ఎవరికీ అనుమానం కలగదు. ఎమోజీలు కూడా డిజిటల్ యుగంలో కోడ్ మాటల వంటివే. వీటి ద్వారా నేరగాళ్లు అత్యాధునిక ప్రభుత్వ వ్యవస్థల కన్నుగప్పి తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు. మాదక ద్రవ్యాల పేర్లు ఎవరికీ తెలియకుండా చేసేందుకు చీకటి వెబ్ మార్కెట్లు ఎమోజీలను వాడుతున్నాయి. ఊరూ పేరూ లేని అనేక ఛాట్ వేదికలు మాదక ద్రవ్యాల విక్రయానికి ఎమోజీలను వినియోగిస్తున్నాయి. వీటి ద్వారా ఆ మాదక ద్రవ్యాల తయారీకి అనుసరించే పద్ధతులను ఒకరితో ఒకరు పంచుకుంటున్నారు.

లింక్‌పై క్లిక్ చేస్తే అంతే

పూనే పోలీసులు ఇటీవల ఓ మాదక ద్రవ్యాల ముఠా గుట్టును రట్టు చేశారు. ఏయే మాదక ద్రవ్యాలు ఎంత పరిమాణంలో కావాలో తెలుసుకునేందుకు, వాటి ధరలు ఎంతో చెప్పేందుకు ఈ ముఠా ఎమోజీలను వాడుకుంటోంది. ఎవరికీ అనుమానం కలగకుండా సమాచారాన్ని చేరవేస్తోంది. అస్పష్టమైన, హానికరమైన విషయాల కోసం, ఎవరూ పసిగట్టకుండా ఉండడం కోసం ఎమోజీల వినియోగం పెరిగిపోతోందని అమెరికాకు చెందిన డార్క్‌నెట్ మానిటరింగ్ సంస్థ డార్క్ ఔల్ తెలిపింది. మోసపూరిత కుంభకోణాలకు ...13లో

వలపు వల విసిరేందుకు...

ఎమోజీలను దుర్వినియోగం చేయడం అంతటితో ఆగడం లేదు. యువతులు, మహిళలకు వలపు వల విసరడానికి కూడా ఎమోజీలను వాడుకోవడం జరుగుతోంది. వారు ఓ హృదయపు చిహ్నాన్నో లేదా ముద్దు పెట్టుకుంటున్న ముఖాన్నో ఎమోజీగా వాడతారు. యువతులలో విశ్వాసాన్ని కలిగించి తమది నిజమైన ప్రేమేనన్న భ్రమను కలిగిస్తారు. అయితే ఆప్యాయతను ప్రతిబింబించే ఈ చిహ్నాలను బాధితులను మోసం చేసేందుకు, వారి నుండి డబ్బు గుంజేందుకు ఉపయోగిస్తుంటారు.

వివాహ వ్యవస్థే దెబ్బతింటుంది

'భార్యపై భర్త లైంగికదాడి' అంశంపై విచారణలో సుప్రీం



న్యూఢిల్లీ: భార్యపై భర్త బలవంతంగా లైంగికదాడికి పాల్పడితే నేరం అవుతుందా? అనే అంశంపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మేజర్ అయిన భార్యపై భర్త ...13లో

ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ జాతర కనపడలేదా?

కేటీఆర్ ఎన్ని చెప్పినా నిరుద్యోగులు నమ్మరు : టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలన పడకేసినట్టు మాట్లాడుతున్న కేటీఆర్...ఎల్బీస్టేడియంలో ఉద్యోగ నియామకాల జాతర కనపడలేదా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. ఎంత రెచ్చగొట్టినా, ఎన్ని అబద్ధాలు చెప్పినా నిరుద్యోగులు కేటీఆర్‌ను, బీఆర్ఎస్ నాయకులను నమ్మరని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలల్లో 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీలకు అనుమతిచ్చినా అందులో కనీసం ఈసీజీ సౌకర్యం కూడా కల్పించలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్



పాలనలో ఏ ఒక్క యూనివర్సిటీ లోనైనా ఉద్యోగులను నియమించారా? అని ప్రశ్నించారు. చేసిన కష్టానికి వేతనాలు పెంచాలంటూ అడిగిన ఆశాలపై లాఠీచార్జీ చేయలేదా? అని ప్రశ్నించారు. పదేండ్ల అధికార మదం దిగిన తర్వాత నిరుద్యోగ యువత గుర్తుకొచ్చారా? అని నిలదీశారు. గ్రూప్-1 లీకేజీలో కేటీఆర్ పాత్ర ఉందంటూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పదేండ్లు అధికారాన్ని ఇష్టానుసారంగా అనుభవించి, ఏమీ చేయలేక చేతులెత్తేసి ఇప్పుడు ప్రజాపాలన అందిస్తున్న సీఎంపై విమర్శలు చేస్తారా? సిగ్గుందా? అని ప్రశ్నించారు. అత్యంత నిరుపేద విద్యార్థులు చదువుకునే గురుకుల విద్యను బీఆర్ఎస్ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విష జ్వరాలతో, దుప్పట్లు లేని దుస్థితి నెలకొన్నదని చెప్పారు. కేటీఆర్ ఎన్ని పెడబొబ్బలు పెట్టినా తెలంగాణ సమాజం నమ్మబోదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ భవన్‌ను తెలంగాణ అక్రమార్కుల భవన్‌గా మార్చుకోవాలని కేటీఆర్‌కు ఆయన సూచించారు.

సీఎం కార్యాలయ అనుమతితోనే హెలికాప్టర్ సేవలు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలయ్యేలా పర్యవేక్షించడంతోపాటు సమయాన్ని ఆదా చేసేందుకు సీఎం కార్యాలయం అనుమతితోనే హెలికాప్టర్ సేవలను ఉపయోగిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అందులో భాగంగానే, తానూ కూడా పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, సమీక్షా సమావేశాలకు హెలికాప్టర్‌లో వెళ్లానని తెలిపారు. వరదల సందర్భంగా కేంద్ర మంత్రుల పర్యటనలు, సహాయ పునరావాస చర్యలు, గణేష్ నిమజ్జనం సాఫీగా జరగడానికి కూడా వాటిని సేవలను ఉపయోగించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. గత నాలుగు నెలల్లో ఇతర మంత్రులతో కలిసి ఏడు సార్లు హెలికాప్టర్ సేవలను ఉపయోగించుకున్నట్టు తెలిపారు.

దమ్ముంటే ఎంజీఎం, పేట్లబుర్జులో ఐవీఎఫ్ సెంటర్లు చూపించండి

- గాంధీలో ఒక్కరికైనా ఐవీఎఫ్ చేసినట్టు నిరూపించండి : బీఆర్ఎస్ నేతలకు మంత్రి దామోదర రాజనర్సింహ సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ సేవలను ప్రారంభించడంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు 2018లో జీవోలు ఇచ్చి, ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలకు దమ్ముంటే ఎంజీఎం, పేట్లబుర్జు దవాఖానల్లో ఐవీఎఫ్ సెంటర్లు ఎక్కడున్నాయో చూపించాలని మంత్రి సవాల్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో గాంధీ హాస్పిటల్‌లో ఒక్కరికైనా ఐవీఎఫ్ చేసినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. ఐవీఎఫ్ సేవలు ప్రారంభించకుండా మోసం చేసినందుకు మహిళలకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి గురువారం ఓ ట్వీట్ చేశారు.

"హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్, పేట్లబుర్జు హాస్పిటల్, వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్‌లో ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు 06/09/2018న జీవో 520 విడుదల చేశారు. కానీ, ఒక్క హాస్పిటల్‌లో కూడా ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తీసుకురాలేదు. పేట్లబుర్జు, ఎంజీఎంలో పైసా పని చేయలేదు. ఒక్క పరికరం కూడా కొనుగోలు చేయలేదు. 2023లో ఎన్నికలకు ముందు గాంధీకి కొన్ని ఎక్విప్‌మెంట్స్ తీసుకొచ్చి, ఐవీఎఫ్ సేవలను ప్రారంభిస్తున్నట్టు హడావుడి చేశారు. కానీ, అక్కడ ఎంబ్రియాలజిస్ట్‌ను, స్టాఫ్‌ను నియమించలేదు. అవసరమైన అనుమతులు తీసుకోలేదు. ఐవీఎఫ్ చేయడానికి అవసరమైన కెమికల్స్, మెడిసిన్ కొనడానికి నిధులు మంజూరు చేయలేదు. ఇవన్నీ మా ప్రభుత్వం వచ్చాక అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎంబ్రియాలజిస్ట్‌ను నియమించాం. ట్రెన్డ్ స్టాఫ్‌ను అలాట్ చేశాం. నిధులు కేటాయించాం. అవసరమైన అనుమతులు తీసుకొచ్చి, ఐవీఎఫ్ సేవలను ప్రారంభించాం. మేము చిత్తశుద్ధితో ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తే, దాన్ని మీ ఖాతాలో వేసుకునేందుకు చవకబారు విమర్శలు చేస్తున్నారు. సిగ్గు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మీకు దమ్ముంటే మీ హయాంలో గాంధీలో ఒక్కరికి ఐవీఎఫ్ చేసినట్టు నిరూపించండి. పేట్లబుర్జు, ఎంజీఎంలో ఐవీఎఫ్ సెంటర్లు ఎక్కడున్నాయో చూపించండి. లేదా, ఇకనైనా ఇలాంటి చవకబారు ఆరోపణలు మానుకోండి. ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తీసుకురాకుండా, మాతృత్వం కోసం తపిస్తున్న మహిళలను మోసం చేసినందుకు వారికి బహిరంగ క్షమాపణలు చెప్పండి."అని మంత్రి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పేట్లబుర్జు, ఎంజీఎం సహా జిల్లాల్లోనూ ఐవీఎఫ్ సేవలను విస్తరిస్తామని మంత్రి తెలిపారు.

దళిత క్రైస్తవుల కులమేంటో చెప్పాలి

- బీసీ కమిషన్ చైర్మెన్‌కు వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత క్రైస్తవులకు జారీ చేస్తున్న బీసీ-సీ సర్టిఫికెట్‌లో కులంపై స్పష్టతనివ్వడం లేదని అణగారిన క్రైస్తవ జన సమాఖ్య (ఉద్యమ పార్టీ) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సమాఖ్య జాతీయ కన్వీనర్ నగాళ్ల పోచయ్య ఇశ్రాయేల్, కో కన్వీనర్లు ఎం.వి.జాన్సన్, ఆండ్రూ జేవియర్, నాయకులు బిషప్ ఎం.సామ్యూల్ బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయా కులాల నుంచి క్రైస్తవులైన వారికి వారి కులాలను పేర్కొంటున్నారనీ, కేవలం దళిత క్రైస్తవులను మాత్రమే విస్మరిస్తున్నారని తెలిపారు. ఎస్సీ జాబితాలోని కులాల నుంచి క్రైస్తవులైన వారికి మాత్రం కులం పేర్కొనకపోవడం వివక్షే అవుతుందని చెప్పారు.

దీనిపై స్పష్టతనివ్వకుండా కులగణన చేపడితే దళిత క్రైస్తవులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్పష్టతనిచ్చాకే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల కులం సమస్యను పరిష్కరించేంత వరకు కులగణనను ఆపాలని కోరారు.

ఫిషరీస్ శాఖపై పడి కోట్లు దోచుకున్నారు

తలసాని, హరీశ్‌రావుపై మెట్టుసాయికుమార్ ఆరోపణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, తన్నీరు హరీశ్‌రావు పదేండ్లపాటు ఫిషరీస్ శాఖపై పడి కోట్లు దోచుకున్నారని ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్ ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు.హరీశ్‌రావు మోస గాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్ని చేపలు పంపిణీ చేసారో ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ముదిరాజ్‌లకు, బెస్తలకు పంచాయతీ పెట్టి ఆయన పబ్బం గడిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరాత్రుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. ప్రతీ చెరువు వాతావరణ పరిస్థితులను బట్టి ఒక్కో రకమైన నాణ్యమైన చేపపిల్లలు వేస్తున్నట్టు తెలిపారు. చనిపోయిన 571 మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని సీఎం చెప్పారన్నారు. తమ ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేసిన మాజీ మంత్రులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిషరీస్ శాఖలో జరిగిన దోపిడీపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నదని తెలిపారు. మల్లన్న సాగర్‌లో ఎన్ని చేపలు వేశారో సిద్దిపేట కాలేజీలో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. నకిలీ చేపల కాంట్రాక్టర్లను హరీశ్‌రావు పెంచి పోషించారని ఆరోపించారు. రొయ్య పిల్లల పంపిణీలోనూ వారు చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. వారు జైలుకెళ్లడం ఖాయమని హెచ్చరించారు.

పరిశుభ్రతపై ముగిసిన "స్వచ్ఛతా పఖ్వాడా" అవగాహన ప్రచార కార్యక్రమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్ ఈ నెల ఒకటి నుంచి 15 వరకు రైల్వే ప్రాంగణాలు, రైళ్లలో 'స్వచ్ఛత పఖ్వాడా-2024' పరిశుభ్రతపై సామూహిక అవగాహన ప్రచారాన్ని నిర్వహించింది. రోజు వారీ కార్యక్రమాల్లో భాగంగా ఒకటిన సామూహిక స్వచ్ఛతా ప్రతిజ్ఞ, స్వచ్ఛతా పట్ల అవగాహన తదితర కార్యక్రమాలను చేపట్టింది. కార్యక్రమాల్లో సామాజిక సేవా సంస్థలు, రైల్వే ప్రయాణికులు, రైల్వే అధికారులు తదితరులకు భాగస్వామ్యం కల్పించింది. డివిజన్ పరిధిలో 'స్వచ్ఛత పఖ్వాడా సమయం' లో రైల్వే ప్రాంగణాల్లో శుభ్రతలో కనిపించే స్పష్టమైన, నిశ్చితమైన మెరు గుదలని నిర్ధారించడానికి ప్రయత్నాలు జరిగాయి. రైల్వే ప్రాంగ ణంలోని 'యాంటీ లిటరింగ్ పెనాల్టీస్' రైల్వే ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అవిశ్రాంత ప్రయత్నాలపై రైలు వినియోగదారులలో అవగాహనను మెరుగు పరచడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ ఈ కార్యక్రమం విజయవంతం చేసిన వారిని అభినందించారు.

తెలుగు వర్సిటీలో ప్రవేశాలకు 23 నుంచి కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో యూజీ, పీజీ ప్రవేశాలకు ఈనెల 23 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు వర్సిటీ సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ బి రాధ గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల మూడు, నాలుగు తేదీల్లో ప్రవేశ పరీక్షలను నిర్వహించామని తెలిపారు. వాటి ఫలితాలు pstucet.org, www.teluguniversity.ac.in వెబ్‌సైట్లలో పొందుపర్చామని పేర్కొన్నారు. కనీస ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అర్హులని స్పష్టం చేశారు. వారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. రిజర్వేషన్ పొందే విద్యార్థులు కులధ్రువీకరణ, ప్రస్తుత సంవత్సరం ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు రావాలని కోరారు. ఈనెల 23 నుంచి 25 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు. ఈనెల 26లోపు సంబంధిత శాఖల్లో నిబంధనల మేరకు ఫీజులను చెల్లించి ప్రవేశం పొందాలని సూచించారు.

'ఆకలి' యుద్ధాలు !

పట్టెడన్నం కరువై ఏటా 21 వేల మంది మృతి

ప్రపంచంలోని అనేక దేశాల్లో ఘర్షణలు, యుద్ధాలు జరుగుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా అక్కడ నివసిస్తున్న ప్రజానీకానికి తినడానికి సరైన తిండి లభించడం లేదు. వారి ఆకలి కేకలను పట్టించుకునే నాథుడే కన్పించడం లేదు. అంతర్జాతీయ సంస్థలు మానవతా సాయాన్ని పంపుతున్నప్పటికీ అవి బాధితులకు చేరడంలో ఎన్నో అవరోధాలు ఏర్పడుతున్నాయి. కయ్యానికి కాలు దువ్వుతున్న పక్షాలు బయటి నుంచి వస్తున్న సాయాన్ని అడ్డుకుంటున్నాయని ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక తెలిపింది. ఘర్షణలు చెలరేగిన దేశాల్లో ఆకలికి తాళలేక ప్రతి రోజూ ఏడు వేల నుంచి ఇరవై ఒక్క వేల మంది వరకూ ప్రాణాలు కోల్పోతున్నారంటూ ఆ నివేదిక ఓ చేదునిజాన్ని బయటపెట్టింది. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా బుధవారం నాడు బ్రిటన్‌కు చెందిన ఓ ధార్మిక సంస్థ ఈ నివేదికను ప్రచురించింది.

> యుద్ధ భూమి నుంచి లక్షలాదిగా వలసలు
> ఆహార సాయాన్ని అడ్డుకుంటున్న వైరి పక్షాలు
> ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక

న్యూఢిల్లీ : 'ఆహార యుద్ధాలు' పేరిట విడుదలైన ఈ నివేదిక ఘర్షణలు జరుగుతున్న 54 దేశాల్లో పరిస్థితులను పరిశీలించింది. ఆయా దేశాల్లో సుమారు 281.6 మిలియన్ల మంది ఆకలిలో విలవిల్లాడుతున్నారని తెలిపింది. ఘర్షణలు తలెత్తిన దేశాల నుంచి ప్రజలు పెద్దఎత్తున వలసబాట పడుతున్నారని, ఇలా వేరే చోటికి తరలి వెళ్లిన వారి సంఖ్య ప్రస్తుతం 117 మిలియన్లకు చేరిందని వివరించింది.

ఆహారాన్నే ఆయుధంగా...

ఘర్షణలు ఆకలిని పెంచడంతో పాటు వైరి పక్షాలు ఆహార పదార్థాలను ఓ ఆయుధంగా వాడుకుంటున్నాయని నివేదిక ఎత్తిచూపింది. అవి ఆహారాన్ని, తాగునీటిని, ఇంధనాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అన్నార్తులకు ఆహారం అందకుండా అడ్డుకుంటున్నాయి. సూడాన్‌లో అంతర్యుద్ధం కారణంగా ఆకలి చావుల సంక్షోభం తలెత్తే అవకాశం ఉన్నదని గత నెలలో మూడు మానవతావాద సంస్థలు హెచ్చరించాయి. గాజాలో చోటుచేసుకుంటున్న ఘర్షణల కారణంగా అక్కడి కుటుంబాలు తీవ్ర ఆహార అభద్రతకు లోనవుతున్నాయి. గతేడాది చివరి నుంచి ఇప్పటి వరకూ ప్రపంచంలో అత్యధికంగా ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొన్న ప్రాంతం గాజాయే.

గాజా, సూడాన్‌లో దారుణం

'ప్రపంచంలో ఘర్షణలు పెరగడంతో ఆకలి చావులు సంభవిస్తున్నాయి. ప్రత్యర్థి పక్షాలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఆహారాన్ని ప్రాణంతక ఆయుధంగా వాడుకుంటున్నాయి' అని ఆక్స్‌ఫామ్‌కు చెందిన ఎమిలీ ఫార్ తెలిపారు. నేడు ఏర్పడుతున్న ఆహార సంక్షోభాలు మానవులు సృష్టించినవే. ఘర్షణలతో అట్టుడికిపోతున్న గాజాలో ఐదు లక్షల మందికి ఆహారం అందడం లేదు. వారికి అవసరమైన ఆహారాన్ని అంతర్జాతీయ, మానవతావాద సంస్థలు పంపుతున్నప్పటికీ అందులో 83 శాతం బాధితులకు చేరడం లేదు. సూడాన్‌లో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. అక్కడ సుమారు ఏడున్నర లక్షల మంది ఆహారం కోసం అలమటిస్తున్నారు. యుద్ధం కారణంగా తలెత్తిన ఈ ఆహార సంక్షోభం రాబోయే తరాలను కూడా పట్టిపీడించే ప్రమాదం ఉంది.

ఈ సంక్షోభాలు కూడా...

దేశీయంగా, విదేశాల నుంచి పెద్దఎత్తున ప్రయివేటు పెట్టుబడులు వచ్చి పడితే తరచుగా రాజకీయ, ఆర్థిక అస్థిరత ఏర్పడుతుందని ఫార్ తెలిపారు. పెట్టుబడిదారులు భూమి, నీరుపై పెత్తనం చెలాయిస్తారని, ఫలితంగా స్థానిక ప్రజలు నిరాశ్రయులవుతారని ఆయన చెప్పారు. ఘర్షణల కారణంగా ప్రజలు ఆకలి బారిన పడడమే కాకుండా అనేక ఇతర సంక్షోభాలు కూడా తీవ్రమవుతాయి. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటాయి. ఆర్థిక అస్థిరత ఏర్పడుతుంది. అసమానతలు పెరుగుతాయి. వాతావరణ సంబంధమైన విపత్తులు... అంటే కరువు కాటకాలు, వరదలు వంటి సంక్షోభాలు కూడా తలెత్తుతాయి. కోవిడ్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు పెరిగాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఆహార సరఫరాలకు ఆటంకం ఏర్పడింది. ఈ పరిణామాలు తూర్పు, దక్షిణ ఆఫ్రికాలో ఆకలి సంక్షోభాన్ని మరింత పెంచాయి.

ఏం చేయాలంటే...

2030 నాటికి ప్రపంచంలో ఆకలి అనేదే లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని సాధించడం అసంభవమవుతోందని ఆక్స్‌ఫామ్ హెచ్చరించింది. అంతర్జాతీయ చట్టం ప్రకారం ఆకలి నేరాలకు కారకులైన వారిని గుర్తించి, బాధ్యులను చేయాలని ఐరాస భద్రతా మండలి సహా అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఆహార అభద్రత, ఘర్షణలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రపంచ నేతలు ఘర్షణలకు మూల కారణాలైన వలసవాద వారసత్వాలు, అసమానతలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, అన్యాయాలతో పోరాడాలని ఫార్ సూచించారు.



సరళీకరణ ఆర్థిక విధానాలతో చేటు

ప్రాథమిక ఉత్పత్తుల ఎగుమతులపై అధికంగా ఆధారపడే దేశాల్లో యుద్ధం, వలసలు, ఆకలి చావుల సంక్షోభాలు ఎక్కువగా కన్పిస్తున్నాయని నివేదిక తెలిపింది. ఉదాహరణకు ఎగుమతుల ద్వారా సూడాన్‌కు లభిస్తున్న ఆదాయంలో 95 శాతం బంగారం, పశువుల నుంచే వస్తోంది. అక్కడ జరుగుతున్న మైనింగ్ కార్యకలపాలు హింసాత్మక ఘర్షణలకు దారితీశాయి. వాతావరణం కాలుష్యంతో నిండిపోవడంతో నివసించేందుకు వీలులేక ప్రజలు వేరే ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఘర్షణలు తలెత్తిన ప్రాంతాల్లో శాంతిని స్థాపించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఎందుకంటే ఆయా దేశాలు సరళీకరణ ఆర్థిక విధానాలపై ఆధారపడ్డాయి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ఎగుమతులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంపై అవి దృష్టి సారించాయి. ఫలితంగా శాంతి స్థాపన మాట అటుంచి అసమానతలు పెరిగిపోయాయి.



దుర్భర దారిద్ర్యంలో 110కోట్ల మంది

(మొదటి పేజీ తరువాయి)

వుంది. యుద్ధాలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలో పిల్లల మరణాలు 8 శాతంగా వున్నాయి. అదే సమయంలో శాంతి నెలకొన్న దేశాల్లో పిల్లల మరణాలు 1.1శాతంగా వుంది.

ప్రపంచంలోని నిరుపేదల్లో 83.2శాతం మంది సబ్ సహారా ఆఫ్రికా దేశాల్లో, దక్షిణాసియా దేశాల్లో జీవిస్తున్నారని పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ (ఓపీహెచ్‌ఐ) యుఎన్‌డిపి సంయుక్తంగా ఈ నివేదిక రూపొందించాయి. సరైన ఇళ్ళు లేకపోవడం, పారిశుధ్యం, విద్యుత్, వంట ఇంధనం, పోషకాహారం కొరత, స్కూళ్ళకు పిల్లలు హాజరయ్యే తీరును వివిధ స్థాయిల్లో అంచనా వేసి బహుముఖ దారిద్ర్యాన్ని అంచనా వేశారు.

ఆఫ్ఘనిస్తాన్‌పై వీరు కూలంకషంగా అధ్యయనం జరిపారు. దేశంలో దాదాపు మూడింట రెండు వంతుల మంది ప్రజలు గతేడాది నిరుపేదలుగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. 2016-16 నుండి 2022-23 మధ్య కాలంలో అదనంగా 53లక్షల మంది పేదరికం బారిన పడ్డారు. ఘర్షణలతో నిత్యం సతమతమయ్యే దేశాల్లో పేదలు కనీస అవసరాల కోసం జరిపే పోరాటం మరింత కఠినంగా వుంటోందని యూఎన్‌డీపీ ముఖ్య గణాంక అధికారి యాంచున్ ఝాంగ్ వ్యాఖ్యానించారు.

దుర్భర దారిద్ర్యంతో జీవించే వారు భారత్‌లో అత్యధికంగా వున్నారు. 140కోట్ల మంది జనాభాలో 23.4 కోట్ల మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. ఆ తర్వాత స్థానాల్లో పాకిస్తాన్, ఇథియోపియా, నైజీరియా, కాంగోలు వున్నాయి. 110కోట్ల మంది పేదల్లో దాదాపు సగం మంది ఈ ఐదు దేశాల్లోనే వున్నారు.

దాడులు, ఘర్షణలు నెలకొన్న దేశాల్లో దారిద్ర్య నిర్మూలన చాలా మండకొడిగా వుందని ఒపిహెచ్‌ఐ డెరెక్టర్ సబీనా అల్కిరే తెలిపారు. అందువల్ల శాశ్వత శాంతిని నెలకొల్పనిదే దారిద్ర్య నిర్మూలన సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ డీవై. చంద్రచూడ్ కేంద్రానికి జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును సిఫారసు చేశారు. సుప్రీంకోర్టులో సీజేఐ తర్వాత అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఉన్నారు. అయితే ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి డీవై. చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10 వరకు ఉంది. అంతలోపు నూతన సీజేఐ ప్రక్రియ ముగించాల్సి ఉంటుంది. సంప్రదాయం ప్రకారం, ప్రస్తుత సీజేఐ తన తదుపరి ఆ పదవిని చేపట్టేందుకు సుప్రీంకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫారసు చేస్తూ కేంద్రానికి లేఖ రాస్తారు. ఈ లేఖను కేంద్ర న్యాయశాఖ, ప్రధానమంత్రి పరిశీలనకు పంపుతుంది. ప్రధానమంత్రి ఆమోదం తరువాత రాష్ట్రపతికి ఈ సిఫారసు పంపిస్తారు. రాష్ట్రపతి ఆమోదంతో నూతన సీజేఐ నియామకం జరుగుతుంది.

51వ ప్రధాన న్యాయమూర్తిగా

ప్రస్తుత సిఫారసులను కేంద్రం ఆమోదిస్తే... దేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు చేపట్టనున్నారు. 2019 జనవరి 18న ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి ఎన్నో కీలక కేసులను విచారించి తీర్పులు ఇచ్చారు. అయితే సీజేఐ పదవిలో కేవలం ఏడు నెలలు మాత్రమే ఉండనున్నారు. 2025 మే 13 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

1960 మే 14న జస్టిస్ సంజీవ్ ఖన్నా జన్మించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు, ట్రిబ్యునళ్లలో ప్రాక్టీస్ చేశారు. ఆదాయపు పన్ను శాఖకు సంబంధించి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా జస్టిస్ సంజీవ్ ఖన్నా పనిచేశారు. జస్టిస్ ఖన్నా 2004లో ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ టెరిటరీలో చేరారు. ఢిల్లీ హైకోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా అనేక క్రిమినల్ కేసులకు హాజరై వాదించారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టులోని తన పదవీకాలంలో జస్టిస్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్, డిస్ట్రిక్ట్ కోర్ట్ మధ్యవర్తిత్వ కేంద్రాలకు ఛైర్మెన్, ఇన్‌చార్జ్ జడ్జిగా కూడా పనిచేశారు.

ఏదేమైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాకముందే సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఎదిగిన కొద్దిమందిలో జస్టిస్ ఖన్నా ఒకరు. ఆయన ప్రస్తుతం భోపాల్‌లోని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగానూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మెన్‌గానూ ఉన్నారు. 2023 జూన్ 17 నుంచి 2023 డిసెంబర్ 25 వరకు సుప్రీం కోర్టు లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ముఖ్యమైన తీర్పులు

వివాదాస్పద సెంట్రల్ విస్టా ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా కూడా ఉన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. ఎలక్టోరల్ బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా ఒకరు. ఆయన పలు కీలక కేసుల్లో కూడా ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని చెప్పారు. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కేసులో కీలక తీర్పును వెలువరించారు. 2023లో ఒక టీవీ షోలో జర్నలిస్టు వ్యాఖ్యలపై కేసును విచారిస్తున్నప్పుడు, ఆర్టికల్ 21 హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కును అధిగమించడానికి, ఆర్టికల్ 19(1)(ఎ)ని ఉపయోగించలేమని జస్టిస్ ఖన్నా నేతత్వంలోని బెంచ్ నొక్కి చెప్పింది. "ఎవరైనా మాట్లాడే హక్కును నొక్కిచెప్పినట్లయితే, ఇతరులకు వినడానికి లేదా వినకుండా ఉండటానికి హక్కు ఉంటుంది" అని బెంచ్ పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది.



మూసీ సుందరీకరణ కాదు..
పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలని కోరారు. వారికి ఎలాంటి సందేహాలున్నా అసెంబ్లీ సమావేశాల్లో నివృత్తి చేస్తామని పేర్కొన్నారు. అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకుని ఎంపీల అభిప్రాయాలను కూడా అసెంబ్లీ రికార్డుల్లోకి తీసుకుంటామని చెప్పారు. ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం ఆపాలని విజ్ఞప్తి చేశారు. దామగుండం నేవీ ప్రాజెక్ట్ వల్ల మూసీకి ఎలాంటి ప్రమాదం లేదని ఈ సందర్భంగా సీఎం అన్నారు. అన్ని అనుమతులు బీఆర్ఎస్ హయాంలోనే ఇచ్చారనీ, అయినా దేశ భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టును తమ ప్రభుత్వం సమర్థిస్తుందని స్పష్టం చేశారు.

పునరావాసం తర్వాతే ఖాళీ చేయిస్తాం

మూసీ ప్రాంతంలో నివసించే పేదల్లో ఏ ఒక్కరినీ ఇప్పటి వరకు నిర్దయగా ఖాళీ చేయించలేదని సీఎం తెలిపారు. "మూసీ నది గర్భంలో 1,690, బఫర్‌జోన్ పరిధిలో మరో 10వేల మంది నివసిస్తున్నారు. 1,600 కుటుంబాలు దసరా ముందు తమ ఇష్ట పూర్వకంగా ఖాళీ చేసి డబుల్‌బెడ్ రూం ఇండ్లల్లోకి వెళ్లారు. బఫర్ జోన్లో నివసించే వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. వారికి ఆమోదయోగ్యమైన పునరావాసం కల్పించిన తర్వాతే తరలిస్తాం" అని సీఎం స్పష్టం చేశారు. గత సర్కార్ లాగా ప్రజలను దౌర్జన్యంగా వెళ్లగొట్టబోమని అన్నారు.

"మల్లన్న సాగర్, వేములఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించారు. కాని మేం అలా ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో అందరికీ తెలుసు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇండ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇండ్లను కూల్చలేదు" అని సీఎం పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామంటూ బీఆర్ఎస్ హయాంలో కేటీఆరే చెప్పారని గుర్తు చేశారు. ప్రాజెక్టును అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలని కేటీఆర్, హరీశ్‌రావు, ఈటలకు సీఎం సవాల్ విసిరారు.

ఖర్చు చేసింది రూ.141 కోట్లే

"మూసీ ప్రాజెక్ట్ వ్యయం రూ. లక్షా 50వేల కోట్లని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. మీలా దోచుకోవడానికి ఇదేమైనా కాళేశ్వరం అనుకున్నారా? ఇప్పటి వరకు మూసీ నదికి సంబంధించి జరిగిన ఒప్పందం రూ.141 కోట్లు మాత్రమే" అని సీఎం స్పష్టం చేశారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఐదు కంపెనీలకు కాంట్రాక్ట్ ఇచ్చామని అన్నారు. నది పునరుజ్జీవంతో పాటు అవసరమయ్యే నిధుల అంచనా, సేకరణ లాంటి ప్రణాళికలతో 18 నెలల్లో రిపోర్టు తయారు చేస్తాయనీ, ఆ తర్వాత ఐదున్నర ఏండ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. ఇలాంటి వాస్తవాలు పక్కన పెట్టి ప్రభుత్వంపై బురదజల్లేందుకు రూ. లక్షా 50 వేల కోట్లని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఏయే సంస్థల గురించి ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయో అవే సంస్థలకు వారు గతంలో కాంట్రాక్టులు ఇచ్చారని గుర్తు చేశారు. అప్పుడు లేని అభ్యంతరం మూసీ అభివృద్ధి విషయంలోనే ఎందుకని ప్రశ్నించారు. వాళ్లు చేస్తే గొప్ప, మేం చేస్తే తప్పా అంటూ నిలదీశారు.

మూసీపై క్యాబినెట్ సబ్ కమిటీ

మూసీ ప్రాజెక్ట్ పునరావాసం, ఇతర సమస్యలపై క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. నది పరివాహక ప్రాంత ప్రజలతో పాటు అన్ని వర్గాలతో విస్తృత సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. త్వరలో పత్రికా సంపాదకులతో పాటు పర్యావరణ వేత్తలతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే పాత్రికేయులు సైతం తమ అభిప్రాయాలను ప్రభుత్వంతో పంచుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని సీఎం పేర్కొన్నారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ, పీవీల వరకు తీసుకొచ్చిన ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెవల్యూషన్, పెట్టుబడుల సంస్కరణలు, సాంకేతిక విప్లవం తదితర పథకాలే దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయని అన్నారు. గుడ్డిగా వ్యతిరేకించడం మానుకుని అభివృద్ధిలో కలిసి రావాలని విపక్షాలకు సీఎం సూచించారు.

కాలకృత్యాలకూ కష్టమే

సగటున 600 మంది విద్యార్థులకు 20 మరుగుదొడ్లు

- ఏడుగురికొకటి ఉండాల్సి ఉండగా 30 మందికొకటి
- ఉదయం నాలుగున్నర నుంచే క్యూ
- ఐదు గంటల నుంచి స్నానాల కోసం లైన్
- అయినా సమయానికి స్కూల్‌కు వెళ్లడం కష్టమే
- మిగతా టైం టేబుల్‌పైనా ప్రభావం
- యోగా క్లాసులు, వ్యాయామాలకు వెళ్లలేని దుస్థితి
- మానసిక ఒత్తిడిలో పిల్లలు
- ఇదీ మన గురుకులాల పరిస్థితి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుటుంబంలో నలుగురు సభ్యులుంటేనే స్కూళ్లు, ఆఫీసులకు వెళ్లే సమయంలో ఇంట్లో బాత్‌రూమ్ దగ్గర కోపగించుకోవడాలు, అరుచుకోవడాలు సాధారణంగా కనిపిస్తుంది. మరి 30 మంది విద్యార్థులకు సగటున ఒక్క మరుగుదొడ్డి ఉంటే పరిస్థితేంటి? వారి అరిగోస చెప్పలేనిది. ఈ క్షోభను గురుకుల పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అనుభవిస్తున్నారు. అందరూ ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవాల్సిందే. స్నానాలు చేయాల్సిందే. రెడీ కావాల్సిందే. ఆదరాబాదరగా బడికి పోవాల్సిందే. ఒక్కో విద్యార్థి కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానం చేయడానికి కనీసం పది నిమిషాల టైమ్ వేసుకున్నా 30 మందివి పూర్తి కావాలంటే ఐదు గంటలు పడుతుంది. స్కూల్‌కు వెళ్లడానికి ఎక్కడ లేట్ అవుతుందో.. ఉపాధ్యాయులు ఎక్కడ మందలిస్తారో అన్న భయంతో చిన్నారులు ఉదయం నాలుగు గంటలకే లేచి మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల ముందు క్యూకడుతున్నారు. అయినా, స్కూల్‌కు టైమ్‌కు చేరుకోలేక టీచర్ల నుంచి తిట్లు పడుతూ మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. కొందరు స్నానాలు చేయకుండా క్లాసులకు పరుగెడుతున్నారు. మరికొందరు టిఫిన్లు చేయకుండానే నేరుగా క్లాసుకెళ్లిపోతున్నారు. అర్ధాకలితో కడుపులో పేగులు పరుగెడుతుంటే ఆకలి బాధతో టీచర్లు చెప్పే క్లాసులపై దృష్టి సారించలేక గోస దీస్తున్నారు. చూడటానికి ఇది మామూలుగా సమస్యగానే కనిపిస్తున్నప్పటికీ చిన్నారుల్లో రుగ్మతలకు దారితీసే ప్రమాదముందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

టైం టేబుల్ కష్టాలు..

రాష్ట్రంలో ఐదు గురుకుల విద్యా సంస్థల్లో కామన్ టైంటేబుల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థులకు కష్టాలొచ్చిపడ్డాయి. 33 జిల్లాల్లో 1022 గురుకుల విద్యా సంస్థల్లో ఐదున్నర లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. సరాసరి 600 మంది విద్యార్థులున్న రెసిడెన్షియల్ పాఠశాలలో 20 మరుగుదొడ్లు, 20 స్నానపుగదులు మాత్రమే ఉన్నాయి. అరకొర వసతులతో కొనసాగుతున్న ఆ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన టైంటేబుల్ పాటించటం కష్టంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోకుండానే అన్ని గురుకులాలకు ఒకేరకమైన పని వేళలను సర్కారు నిర్ణయించింది. ఎడతెరిపి లేకుండా కొనసాగే ఈ టైంటేబుల్ వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. చాలీచాలని మరుగుదొడ్లు, బాత్‌రూంలలో కేవలం అరగంటలో స్కూల్, జూనియర్ కాలేజీకి చెందిన 640 మంది, డిగ్రీ కాలేజీలో చదివే 840 మంది విద్యార్థులు ఎలా కాలకృత్యాలను తీర్చుకోగలరు? ఎలా తయారవగలరు? అనేది టైంటేబుల్‌ను రూపొందించిన పెద్దలే చెప్పాలి. ఇక భవనాల అద్దెలను చెల్లించలేదనే సాకుతో యాజమాన్యాలు వసతులు కల్పించడం మానేశాయి.

బాలికల బాధ పట్టదా?

ఏకబిగిన ఉదయం ఐదు గంటలకు లేచిన విద్యార్థి, విద్యార్థినులు రాత్రి తొమ్మిది గంటల వరకు ఉరుకులు పరుగులతో చదువు సాగిస్తున్నారు. మానసిక ఒత్తిడితో అలిసిపోతున్నారు. గురుకులాల్లో బాలికలకు 75శాతం మందికి నెలసరి క్రమం ఉంటుంది. ఆ సమయంలో వారి వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం చాలా అవసరం. కానీ.. వసతుల లేమి, సమయం సరిపోక పోవటంతో చెప్పుకోలేని వేదనకు గురవుతున్నారని కొందరు విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మానసిక సమస్యలతో పాటు చర్మ సంబంధ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ అసంబద్ధ సమయ పాలన..

- ఉదయం 7.00నుంచి 7.45 వరకు అల్పాహారం
- మధ్యాహ్నం 12.45 నుంచి1.25 వరకు భోజన విరామం
- సాయంత్రం 4.30నుంచి 4.45 వరకు స్నాక్స్
- సాయంత్రం 5.45 నుంచి 6.00(15 నిముషాలు) విద్యార్థుల హాజరు.
- సాయంత్రం 6.00 నుంచి 6.15 వరకు విద్యార్థుల వ్యక్తిగత కార్యక్రమాలు

అంటే.. ఆటలు ఆడిన విద్యార్థులకు ఈ 15 నిముషాల్లో స్నానం, బట్టలు ఉతుక్కోవటం,తదితర పనులకు సమయం కేటాయించారన్న మాట. ఆ తర్వాత వెంటనే 6.15 నుంచి 7.00వరకు డిన్నర్ చేయాలి. దీంతో స్టడీ అవర్స్ తర్వాత ఆకలవుతున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు.





మానసిక రుగ్మతలు పెరిగితే ప్రమాదం

విద్యార్థుల్లో మానసిక రుగ్మతలు పెరిగితే సమాజానికి తీవ్ర నష్టం. వారి మానసిక వికాసానికి దోహద పడే విధంగా పరిసరాల ప్రభావం ఉండాలి. మానసిక ఒత్తిడి, పౌష్టికాహార లోపం, శారీరక వ్యాయామ లోపం వివిధ మానసిక రుగ్మతలకు దారితీస్తాయి. బాధ్యతగా విద్యార్థులకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి. సరిపోను నిద్ర, ఆకలిలేమి, యోగా, వ్యాయామ, మెడిటేషన్, తగిన విధంగా ఆటలు ఉన్నప్పుడే వారిలో మానసిక వికాసం పెంపొందుతుంది.



ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ ఆకుల, న్యూరో సైక్రియాట్రిస్ట్

గ్రూప్-1పై నేడు విచారణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రూప్-1 ప్రిలిమ్స్‌పై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలంటూ హైకోర్టులో అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిని శుక్రవారం డివిజన్ బెంచ్ విచారించనుంది. ప్రాథమిక పరీక్షలను రద్దు చేసి తాజాగా వాటిని నిర్వహించేలా ఆదేశాలివ్వాలంటూ దామోదర్‌రెడ్డి ఇతరులు వేసిన అప్పీలు పిటిషన్లను ద్విసభ్య డివిజన్ బెంచ్ విచారించనుంది. ప్రశ్నల్లో తప్పులున్నాయని నిరూపించినప్పటికీ సింగిల్ జడ్జి పట్టించుకోలేదనీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన తుది కీలో తప్పులు ఉన్నాయని పిటీషనర్లు పేర్కొన్నారు. గతంలో ప్రాథమిక పరీక్షల్లో తప్పులు వచ్చాయనీ, దీంతో అవి రెండు సార్లు రద్దు అయ్యాయనీ, ఇప్పుడు కూడా రద్దు చేసి తిరిగి నిర్వహించాలని వారు కోరారు.

నవతెలంగాణ

గెలుస్తానన్న నమ్మకం లేనివాడు, ఓడిపోతాననే అనుమానం ఉన్నవాడు కచ్చితంగా పరాజయం పాలవుతాడు - నెపోలియన్

సంపాదకీయం

అప్పులు-ప్రయివేటీకరణ

అప్పులు మరోసారి చర్చనీయాంశమవుతున్నాయి. రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. పాత అప్పులకు కిస్తీల కోసమే మళ్లీ రుణాలు తెస్తున్నామంటూ అధికార కాంగ్రెస్ అంటుండగా, రూ. వేల కోట్లు అప్పులు తెచ్చి ఒక్క పథకాన్ని సరిగ్గా అమలు చేయట్లేదని ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. కాంగ్రెస్ సర్కారు నిధులలేమీ పేరుతో పథకాలు, ప్రాజెక్టులను ప్రయివేటుకు అప్పగించే ప్రణాళికలు చేస్తున్నదా? అనే ప్రశ్న సహేతుకమే. 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్టు పైసల్లేవని చెప్పి ఇచ్చిన రాజకీయ హామీలను తుంగలో తొక్కిన చరిత్ర బీఆర్ఎస్‌ది. ప్రజల్ని విశ్వాసంలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహారాలు చేస్తే ఎవరూ ఊరుకోరు. బిల్లులు చెల్లించాలంటూ వర్కింగ్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు, సర్పంచులు రెండేండ్లుగా ఎదురు చూస్తున్న మాట పచ్చినిజమే కదా?

> **బీజేపీ సర్కారు ఈ నిధులివ్వడంలో చేస్తున్న అలవికాని ఆలస్యం మూలంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితుల్లో నెట్టబడుతున్నది. నాణానికి ఇదో పార్శ్వం.మరో పార్శ్వం ఏమిటంటే, కాసులు లేవనే పేరుతో ప్రాజెక్టులను, పథకాలను ప్రయివేటు, కార్పొరేట్ల ధారాదత్తం చేసే కుట్ర దాగున్నట్టు కనిపిస్తున్నది! మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును పూర్తిగా ప్రయివేటుకే ఇచ్చేందుకు సర్కారు సమాయత్తమవుతున్నది. మరో 18నెలల్లో డీపీఆర్ తయారు కానుంది. చివరకు పంచభూతాలకూ వెలకట్టే దారుణ దుస్థితి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.**

బీఆర్ఎస్ కాలం నుంచే పెండింగ్ బిల్లులు సమస్య ఉంది. అది నేటికీ కొనసాగుతోంది. చివరకు చోటామోటా కాంట్రాక్టర్లు, సర్పంచుల, ఎంపీటీసీలు చేసిన పనులకూ నిధుల కొరత తప్పడం లేదు. మూడేండ్ల కింద సర్పంచుల కుటుంబాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాయి. ఒక సర్పంచ్ అసువులు బాశాడు కూడా. బడా కాంట్రాక్టర్లకు వెండిపళ్లెంలో పెట్టి బిల్లులు విడుదల చేసే ప్రభుత్వాలు, గ్రామాభివృద్ధి కోసం ఇంట్లో భార్యల పుస్తెలు తాకట్టుపెట్టి, అప్పులుచేసి పనులు చేసినవారికి నిధుల లేమిని అడ్డంకిగా చూపడం అన్యాయం.



ఈ దుర్భర పరిస్థితిని కేంద్రం చోద్యం చూస్తున్నది. సమాఖ్యతత్వాన్ని మరిచి రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ బకాయిలు పూర్తిగా ఇవ్వకపోవడం, ఇచ్చినా అరకొరగానే విదల్చడం రొటీన్ అయి పోయింది. మోడీ సర్కార్ నుంచి రావాల్సిన సాధారణ నిధులూ తెలంగాణకు మృగ్యమవుతున్నాయి. హక్కుగా ఇవ్వాల్సిన పైసలను సైతం పెద్దన్న పట్టించుకోకపోవడం ప్రజల జీవన హక్కును కాల రాయ డమే. ప్రస్తుతం రాష్ట్రం అప్పుల ఊబిలో ఉంది. కొత్త సర్కారు బాధ్యతలు చేపట్టిన తర్వాత మరో రూ. 49,618 కోట్ల అప్పు తీసుకుంది. మూల ధనం కింద రూ.21,881 కోట్లు ఖర్చు చేసింది. రుణమాఫీ, రైతుభరోసా, చేయూత, విద్యుత్, బియ్యం, గ్యాస్ రాయితీలు, మహలక్ష్మి, గృహజ్యోతి స్కాలర్‌షిప్‌లు, ఆర్టీసీ, కళ్యాణలక్ష్మి పథకాల కోసం రూ.54,348 కోట్లు వ్యయమైనట్టు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రకటించింది. గత ప్రభుత్వం చేసిన అప్పుల కోసం కిస్తీలు కట్టేందుకు రూ.56,440 కోట్లు వినియోగించినట్టు పేర్కొంది. ఈనేపథ్యంలో కొత్తగా అప్పులు తీసుకుంటున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించే పరిస్థితి లేకుండా పోయిందని తెలియ జేసింది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తారీఖు జీతాలు ఇస్తున్నామని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం రాష్ట్రం తాజా అప్పులు రూ.7 లక్షల కోట్లు. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు రూ.3 లక్షల కోట్లు.

బీజేపీ సర్కారు ఈ నిధులివ్వడంలో చేస్తున్న అలవికాని ఆలస్యం మూలంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితుల్లో నెట్టబడుతున్నది. నాణానికి ఇదో పార్శ్వం.మరో పార్శ్వం ఏమిటంటే, కాసులు లేవనే పేరుతో ప్రాజెక్టులను, పథకాలను ప్రయివేటు, కార్పొరేట్ల ధారాదత్తం చేసే కుట్ర దాగున్నట్టు కనిపిస్తున్నది! మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును పూర్తిగా ప్రయివేటుకే ఇచ్చేందుకు సర్కారు సమాయత్తమవుతున్నది. మరో 18నెలల్లో డీపీఆర్ తయారు కానుంది. చివరకు పంచభూతాలకూ వెలకట్టే దారుణ దుస్థితి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రపంచ దేశాల్లో సాగుతున్న ప్రత్యేక అధ్యయనాలే నిదర్శనం. నీటికి ఖరీదు కట్టే ప్రయత్నాలూ చోటుచేసుకుంటున్నాయి. 'నీటి సంక్షోభం-ఆర్థిక పరిస్థితిపై ప్రభావం' అనే అంశంపై గ్లోబల్ కమిషన్ ఆన్ ఎకనామిక్స్ ఆఫ్ వాటర్ అనే సంస్థ చేసిన అధ్యయనమే ఈ సంగతిని తేటతెల్లం చేసింది. ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉండటం, భూ వినియోగంలో లోపాలు, నీటి యాజమాన్యం సమర్థంగా లేకపోవడంతోపాటు వాతావరణ మార్పులు సమస్యల ను మరింత జటిలం చేస్తున్నట్టుగా అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో 50 శాతానికి పైగా ఆహారోత్పత్తి ప్రమాదంలో పడనుందని తేల్చింది. నీటి వనరుల విస్తీర్ణం తగ్గిన కారణంగా అనేక నగరాల్లో సంక్షోభస్థితి నెలకొన్నదని విశ్లేషించింది. నీటి వినియోగం మరింత సమర్థవంతంగా చేయడానికి వీలుగా తగిన ధర నిర్ణయించాలనే ప్రమాదకరమైన ప్రతిపాదనలు ముందుకొస్తున్నాయి. రేటును నిర్ణయిస్తే నీటి వినియోగంలో అనేక మార్పులు వస్తాయని డబ్ల్యూటీవో డైరెక్టర్ అభిప్రాయం. ఆర్థికవ్యవస్థలు కుదేలవుతున్న తరుణంలో ప్రయివేటు, కార్పొరేట్ రంగానికి సమస్త ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టే కుయత్నాలు జరుగుతుండటం ఆందోళనాకరం. వీటిని ప్రజాప్రభుత్వాలు అడ్డుకోవాలి. పేదలను నిధులలేమి పేర కష్టాల్లోకి నెట్టకుండా, ఆర్థిక ఆసరాను ఇవ్వడం ప్రాథమిక కర్తవ్యంగా భావించి ఆదుకోవాలి.

నిరాధారమైన ఆరోపణలతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సెంట్రల్ జైలు "అండా సెల్"లో 3,588(తొమ్మిదేండ్లు)రోజుల పాటు నిర్బంధంలో దుర్భర జీవితం అనుభవించి చివరికి నిర్దోషిగా ప్రకటించబడిన ప్రొఫెసర్ సాయిబాబా విడుదలైన ఏడు నెలల వ్యవధిలోనే మరణించాడు ఇది అత్యంత విషాదకరమైన ఘటన. ఇది నిస్సందేహంగా ఈ దేశంలో అమలు చేసిన క్రూరచట్టాల ఫలితమే ఆయన మరణం. తొంభై శాతం అంగవైకల్యం కలిగిన సాయిబాబాపై రాజ్య వ్యవస్థ వ్యవహరించిన తీరు "ఉపా" దుర్వినియోగ మవుతున్న తీరును మరోసారి రుజువు చేసింది. కన్నతల్లిని కడసారి కూడా చూడటానికి అనుమతించకుండా ఈ దేశ మానవత్వానికి మచ్చతెచ్చింది. సహజ న్యాయసూత్రం ప్రకారం.. నేరగాళ్లను శిక్షించాలి, నిర్దోషులను రక్షించాలి. కానీ మనదేశంలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. మోడీ పాలనలో మాట్లాడినా, ప్రశ్నించినా, వ్యతిరేకించినా, ఆట,మాట, పాట, ఒక రకంగా స్వేచ్ఛ హక్కుల కోసం ఏమాత్రం పోరాడినా

చక్రాల కుర్చీలోంచి..చరిత్ర పుటల్లోకి...



సామాన్యులైనా, మేధావులైనా 'ఉపా'కి బలి కావాల్సిందే. ఇది ఈ దేశంలోని పౌర సమాజానికి పాలకులు ఇస్తున్న తిరోగమన భరోసా. వేల కోట్ల రూపాయలు దిగమింగేసిన ఇతర దేశాలకు చెక్కేసిన ప్రబుద్ధులకు ఎలాంటి శిక్షలూ లేవు. లైంగికదాడులు, పలు హత్య కేసుల్లో దోషిగా నిరూపించబడిన 'డేరా బాబా'కు ఆయన అనుకున్నప్పుడు పద్నాలుగు సార్లు పెరోల్‌పై బయటికి వచ్చే అవకాశం కల్పించారు. కానీ నేరం రుజువు కాకుండానే నిరాధారమైన ఆరోపణలతో సాయిబాబాను హింసించింది ఈ రాజ్యం.చీకటి గదిలో బంధించి "చావు"కు సిద్ధం చేసింది దేశం.ఇది ముమ్మాటికీ సర్కారు చేసిన 'హత్యే'!

జార్ఖండ్‌లో హక్కులు, ఆదివాసులు, సహజ వనరుల పరిరక్షణ కోసం మాట్లాడిన 84ఏళ్ల కురువృద్ధుడైన ఫాదర్ స్టాన్ స్వామి "ఉపా" కేసులో బంధించబడి విచారణ ఖైదీగా జైలులోనే ప్రాణాలు విడిచారు. ఇలా ఎంతోమంది దేశంలోని జైళ్లలో విచారణ ఖైదీలుగా శిక్షలు అనుభవిస్తున్నా రు. ఇప్పటివరకు అధికారిక సమాచారం ప్రకారం, 2014 -2022 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 8719 "ఉపా" కేసులు నమోదయ్యాయంటే అతిశయోక్తి కాదు. అయితే వాటిలో శిక్షలు పడినవి 222 మాత్రమే. ఆ ఎనిమిదేండ్లలో 14,809 మంది "ఉపా" కింద అరెస్టయితే, 356 మందిపైనే నేరాభి యోగాలు రుజువయ్యాయి. "ఉపా" కేసుల బనాయింపు పాలకుల కనుసన్నల్లోనే సాగుతోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. ఇలాంటి "ఉపా"ను ఈ దేశ పౌరసమాజం ముక్తకంఠంతో నిరసించాల్సిన అవసరం ఉంది.సాయిబాబా మరణం తోనైనా ప్రజలు, పౌర సంఘాలు మేల్కోవాలి. "ఉపా" చట్టం రద్దు కోసం దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

చివరిగా...ఒక మాట. సాయిబాబా మరణం తీవ్రంగా కలిచివేసే ఘటన. నమ్మశక్యం కాని అన్యాయానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలబడిన ఘటన. ఈ దేశ చరిత్రలోనే వీల్ చైర్‌కు పరిమితమైన ఒక మేధావిని చిత్రహింసలకు గురిచేసి చావు అంచుల్లోకి తీసుకెళ్లాక విడుదల చేసిన ఘటన. మన రాజ్యవ్యవస్థ వింతైన కథ. కష్టతరమైన చట్టాలతో, న్యాయవ్యవస్థతో సుదీర్ఘ కాలం పోరాటం చేసి మరణాన్ని నిరాకరించిన ఒక వీరుని కథ. తనకంటూ ఓ జీవితమే లేకుండా చేసిన ఈ దేశపు కథ. చక్రాల కుర్చీలోంచి..చరిత్ర పుటల్లో లిఖించబడిన "ప్రొఫెసర్ సాయిబాబా" కథ. ఆయన భౌతికంగా లేకపోయినా చరిత్ర ఎప్పటికప్పుడు ఆయన ఆనవాళ్లను గుర్తు చేస్తూనే ఉంటుంది. రాజ్యాన్ని నిలదిస్తూనే వుంటుంది.

- రాజేందర్ దామెర

టర్కీలో బౌద్ధం ఎందుకుందీ? ఎలా ఉంది?



డాక్టర్ దేవరాజు మహారాజు

బాల్కన్, అనటోలియన్ టర్కీ జాతి ప్రజల మూలాలు ఆసియాలో ఉన్నాయి. ఇది చాలా మందికి తెలిసిన విషయమే. వీరు సుమారు రెండు వేల ఏండ్ల పాటు ఇక్కడ పరిపాలించారు. ఇక్కడి సాంస్కృతిక జీవనంలో భాగమై పోయారు.ఆ తర్వాత ఎప్పుడో టర్కీ, యూరప్‌లకు చేరుకున్నారు. ప్రస్తుత మంగోలియాలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాలు టర్కీ ప్రజలకు గొప్ప స్థావరాలు. బుర్ఖానిజం -గురించి తెలుసుకున్నవారికి, టర్కీ భాషలో బుర్ఖాన్ అంటే బుద్ధుడి పేరని తెలిసే ఉంటుంది. కొన్ని నాగరికతలు ఇలా తూర్పు నుండి పశ్చిమానికి వెళ్లాయి. చైనా, ఇండియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, గ్రీక్, రోమన్, ఈజిప్ట్ సంస్కృతుల మేళవింపుగా టర్కీ ప్రజల జీవన విధానం రూపుదిద్దుకుంది. ఇందులో భాగంగా జుడాయిజం, క్రిస్టియానిటీ, ఇస్లాం మాత్రమే కాక, హిందూయిజం, బుద్ధిజం, టావోయిజం, మనిచిజం మొదలైన వాటితో పరిచయమైంది.కొన్నిమతాలు, కొన్ని జీవన విధానాలు వారిమీద కొంచెం ఎక్కువగా కూడా ప్రభావం చూపాయి.టర్కీ ప్రజల్లో కొన్ని జాతులు, గ్రూపులు తూర్పు నుండి వచ్చిన బౌద్ధంతో చైతన్యవంతమయ్యాయి.

ఒకరకంగా టర్కీ ప్రజలు హుణుల కాలంలో బౌద్ధం గూర్చి తొలిసారి తెలుసుకున్నారు. సాధారణ శకం ఐదవ శతాబ్దం నుండి టర్కీ జాతులెన్నో బౌద్ధాన్ని స్వీకరించడం, ఆ జీవన సూత్రాల్ని పాటిం చడం చేస్తూ వచ్చాయి. టి ఓపా/ టాబ్గచ్ రాజ్యకాలంలో అది విస్తృతంగా కొనసాగింది. ఈరోజు టర్కీ భాష మాట్లాడేవారిలో కేవలం ముస్లింలే లేరు. షు ఐషు - చారిత్రక ఆధారాలను బట్టి తెలిసేదేమంటే ఆరవ శతాబ్దంలో టర్కీ మొదటి చక్రవరి (542-581C.E) టుర్క్ ముకన్ కగెన్, తర్వాత అతని సోదరుడు ట-జపా/ టాస్పర్ కగెన్‌లు బౌద్ధాన్ని స్వంతం చేసుకున్నారు. ఒక బౌద్ధారామాన్ని కూడా నిర్మిం చారు. ఉత్తర చైనాకు తమ ప్రతినిధిని (దూతను) పంపి తమకు బౌద్ధ ప్రమాణాలు/ సూత్రాలు (CANON) వగైరా పంపించవల్సిందిగా అర్థించారు. బౌద్ధ సన్యాసి హూవై-లిన్, టాస్పర్ కగన్‌కు కొంత సమాచారం అందించాడు. కొన్నిసూత్రాలు. నియమాలు, విధానాలు బోధించాడు. (నైపాన్, హుఅ- యెన్, చింగ్, మిన్, షై-టంగ్.. ఇవి వారి భాషా పదాలు గనక మనకు కొత్తగా ఉంటాయి) బౌద్ధంలోని కొన్ని ముఖ్యమైన అంశాలు బోధించి, ఇంకాలోతుగా తెలుసుకోవాల్సిన అవసరాన్ని వారికి అర్థం చేయించాడు.

> **ఒట్టమాన్ కాలపు 'సెబిలుర్రిసడ్' అనే జర్నల్‌లో బుద్ధుడి గురించి, బౌద్ధం గురించి ప్రత్యేకమైన వ్యాసాలు చాలా విపులంగా ప్రచురించబడేవి. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఒట్టమాన్! పాలకుల పాలన అంతమై, టర్కిష్ రిపబ్లిక్ ఏర్పడినప్పుడు నూతన దేశ నిర్మాణంలో భాగంగా అనేక మార్పులు జరుగుతూ వచ్చాయి. పరిశోధకులు, మేధావులు ప్రపంచ చరిత్రను నూతన దృక్కోణంలో పరిశీలించసాగారు. అవసరమైన వాటిని పునరుద్ధరించుకోవాలన్న స్పృహ పెరిగింది.అపుడే ఆలో చనాపరులందరి దృష్టి బౌద్ధం మీద బాగాపడింది. ఒక రకంగా చెప్పుకోవాలంటే టర్కీ-రిపబ్లిక్ అయిన తర్వాతే బౌద్ధంపై పరిశోధనలు విస్తృతమయ్యాయి.చారిత్రక సత్యాలు వెలికి తీయడం అధికమయ్యింది.**

ఉత్తర చి పరిపాలకుడు(535-577C.E) బౌద్ధం పట్ల కగన్ చూపుతున్న ఉత్సుకతను గమనించి తను కూడా స్ఫూర్తిపొందాడు. నిర్వాణ సూత్రాల్ని టర్కీ భాషలోకి అనువదించమని లి-షై-చింగ్ అనే బౌద్ధ భిక్కును కోరాడు.కారణం ఏమంటే అతను కగన్‌తో టర్కీ భాష ధారాళంగా మాట్లాడేవాడు. అందువల్ల, బౌద్ధానికి సంబంధించిన విషయాలు తనకు కూడా సులభంగా అర్థం చేయగలడన్న నమ్మకం కుదిరి- లి-షై-చింగ్ భిక్కుతో అనువాదాలు చేయించాడు. ఆ టర్కీ పాలకుల కాలంలోనే మహాయాన బౌద్ధం విస్తృతంగా వ్యాపించింది. ఇటు ఇండియా నుండి, అటు చైనా నుండి తీసుకున్న గ్రంథాల అను వాదాలు - జర్మనీ, కొరియా, జపాన్, అమెరికాలలోని అనేక గ్రంథాలయాలకు ఆ పుస్తకాలు చేరాయి - తొలిదశలో టర్కీ ప్రజల్లో బుద్ధిజం పట్ల విశ్వాసం నామమాత్రంగానే ఉండేది.



రెండో టర్కీ పాలకుడు (582-744) C.E రాజ్యానికి వచ్చేసరికి అక్కడ బౌద్ధుల సంఖ్య మరింత తగ్గింది. బౌద్ధాన్ని పునరుద్ధరి ద్దామన్న సంకల్పంతో రాజు బిల్గే కగన్ ఒక బౌద్ధాలయ నిర్మాణానికి సిద్ధపడ్డాడు. కానీ, ఆయన సలహా దారులు తీవ్రంగా వ్యతిరేకించారు. కారణమేమంటే, బౌద్ధం చెప్పే శాంతి మార్గం వల్ల సైనికులు నీరసపడి పోతారని, వారిలో మానసిక పరివర్తన కలిగి యుద్ధం పట్ల విముఖత చూపుతారని- వీరోచి తంగా పోరాడవల్సిన సైనికులకు దయ, కరుణ, జాలి గురించి బోధించడం ఏం బాగుంటుందనీ - బౌద్ధాలయ నిర్మాణంతో వాతావరణంలో మార్పు వస్తుందనీ చెప్పి- ఒప్పించారు. ఆలయ నిర్మాణ ప్రయత్నం మాన్పించారు-

కొంత కాలానికి టర్కీ పాలకుల పాలన ముగిసింది. ఉయగుర్స్ ఆక్రమించుకుని 9 నుండి 14వ శతాబ్దం (C.E) దాకా పరిపాలించారు. తర్వాత కాలంలో టర్కీ ప్రజల్లో ఇస్లాం బలం పుంజుకుంది. అది బౌద్ధంపై ప్రభావం చూపి దాన్ని దాదాపు క్షీణింపజేసింది. అయితే ఒకప్పుడు బౌద్ధాన్ని ఆచరించిన జాతులు, సమూహాలు వారసత్వంగా ఆ విధానాన్ని ఇంకా అక్కడ కొనసాగిస్తున్నాయి. రష్యాలోని తువీన్ టర్కీ ప్రజలు, చైనాలోని ఉయగుర్స్ లాంటి వారు ఇప్పటికీ బౌద్ధులే! ఒట్టమాన్‌ల కాలందాకా అంటే 19వ శతాబ్దం దాకా ప్రపంచంలోని మతచరిత్రల్లో భాగంగా బౌద్ధం కూడా అక్కడక్కడ కొంత చర్చించ బడుతూ ఉండేది. కాని కొద్దిమంది ఒట్టమాన్ మేధావులకు బౌద్ధ నైతిక జీవన విధానం బాగా నచ్చింది. ముఖ్యంగా సెమిసెట్టిన్ సమి అనే రచయిత 1878లో ఇసటిర్ (ESATIR) అనే తన గ్రంథంలో భారత దేశంలోని మతాల గూర్చి రాస్తూ బుద్ధుడి గూర్చి, బౌద్ధం గూర్చి విపులంగా చర్చించారు. ఆ తర్వాత 1910లో అహమెట్ మిథట్ ఎఫిండి అనే అతను తర్హి-ఐ-ఐడైన్ (THE HISTORY OF RELIGIONS) మతాల చరిత్ర నమోదు చేస్తూ చివరి అధ్యాయంలో మొత్తం బౌద్ధం గురించి రాశాడు. ముఖ్యంగా ఇందులో బౌద్ధంలోని నైతికత గురించి దృష్టి సారించాడు. ఇది మరికొందరికి మార్గదర్శకమైంది.మరి కొంతమంది పరిశోధక రచయితలు బౌద్ధం గూర్చి తమ విశ్లేషణలను గ్రంథస్థం చేస్తూ అక్కడి ప్రజలు ప్రభావితమైన అంశాల గూర్చి వివరించారు.వీరిలో ముఖ్యంగా చెప్పుకోవల్సినవారు మహ్మద్ ఇసద్ సైడి సెహరీ (1914) యం.సిమ్ సిద్దిన్ గునాల్తే (1922)లు. అహమెట్ మిథీట్ ఇఫెండి అనే పరిశోధకుడి గురించి మరొక ముఖ్యమైన విషయం చెప్పుకోవాలి. ఈయన 1890లోనే నేరుగా బౌద్ధంమీద ఒక పుస్తకం ప్రచురించారు.దాని పేరు "పారిస్‌లో ముప్పయి వేల బౌద్ధులు'

ఇవేకాక, ఒట్టమాన్ కాలపు 'సిబిలుర్రిసడ్' అనే జర్నల్‌లో బుద్ధుడి గురించి, బౌద్ధం గురించి ప్రత్యేకమైన వ్యాసాలు చాలా విపులంగా ప్రచురించబడేవి. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఒట్టమాన్! పాలకుల పాలన అంతమై, టర్కిష్ రిపబ్లిక్ ఏర్పడినప్పుడు నూతన దేశ నిర్మాణంలో భాగంగా అనేక మార్పులు జరుగుతూ వచ్చాయి. పరిశోధకులు, మేధావులు ప్రపంచ చరిత్రను నూతన దృక్కోణంలో పరిశీలించసాగారు. అవసరమైన వాటిని పునరుద్ధరించుకోవాలన్న స్పృహ పెరిగింది.అపుడే ఆలో చనాపరులందరి దృష్టి బౌద్ధం మీద బాగాపడింది. ఒక రకంగా చెప్పుకోవాలంటే టర్కీ- రిపబ్లిక్ అయిన తర్వాతే బౌద్ధంపై పరిశోధనలు విస్తృతమయ్యాయి. చారిత్రక సత్యాలు వెలికి తీయడం అధికమయ్యింది.

ముస్తాఫా కేమల్ అటా టుర్క్- ఒక దార్శనికుడు, విస్తృతంగా అధ్యయనం చేసిన మేధావి. టర్కీ రిపబ్లిక్ అయిన పదిహేను సంవత్సరాలలో భాష, సాహిత్యం, చరిత్ర, మతం వంటి ఎన్నో విభాగాలు ఏర్పాటు చేశాడు. అంకార యూనివర్సిటీలోని భాష, చరిత్ర, భూగోళ శాస్త్ర విభాగం ఆయన రూపకల్పన చేసిందే! 1936లో అది ప్రారంభమైనప్పుడు అందులో మొదటగా ఇండాలజీ విభాగం ప్రారంభ మైంది. అందులో ఎన్నో కోర్సులతో పాటు బౌద్ధంపై కూడా ఒక కోర్సును చేర్చారు. వాల్టర్ రూబెన్ అనే ఒక జర్మన్ ప్రొఫెసర్ దానికి తొలి డైరెక్టర్‌గా ఉండేవాడు. గోక్ టుర్క్ ఉయ్ఘర్ కాలాల పరిస్థితుల గూర్చి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిశోధనలు చేస్తే టర్కీ చరిత్ర కొంతవరకు సమగ్రమ వుతుందనీ, దానివల్ల ఆ కాలంలోని భాష మతాల గురించి క్షుణ్ణంగా తెలుస్తుందని ముస్తఫా కేమల్ అటా టుర్క్ భావిం చాడు. అదే విధంగా ఆ కాలపు బౌద్ధగ్రంథాల్ని, ఆదారాల్ని పరిశీలించడం కూడా అవసరమని భావించాడు. ఈ అటా టుర్క్‌కు బౌద్ధం మీద ప్రత్యేక శ్రద్ధా, ఆసక్తీ ఉన్నాయని తెలుస్తూ ఉంది. అందుకు ఆధారమేమంటే ఆయన ఇజ్మీర్ ఫెయిర్ 1934 గురించి ఇస్మెట్ ఇనోను-కు ఒక టెలిగ్రాం పంపుతూ చివరలో 'నమో ఇస్మెట్' అని రాశారు. నమో అంటే గౌరవంతో నమస్కరిస్తున్నాను అని అర్థం. ఇది బౌద్ధానికి సంబంధించిన పదం.టర్కీ భాషాపదం కాదు.అలాగే, టర్కీ భాషలో ఇస్మెట్ అంటే- స్వచ్ఛమైన - నిజాయితీ గల -అని అర్థం.

ఇక హిల్మి ఒమర్ బుద్ధ (1894-1952) అనే పరిశోధకుడి గురించి చెప్పుకోవాలి. టర్కీ రిపబ్లిక్ అయిన తర్వాత, వెలుగులోకి వచ్చిన పరిశోధకుల్లో ఈయన అగ్రగణ్యుడు.ఒక రకంగా టర్కీలోని మత విశ్వాసాల మీద పరిశోధన చేసిన తొలి చరిత్రకారుడు కూడా ఈయనే- ఆయన తన పేరులో బుద్ధ అని చేర్చుకోవడం గమనించాల్సిన విషయం. శాక్యగణానికి చెందిన బుద్ధుడి పూర్వీకుల మూలాలు బహుశా టర్కీలోనే ఉన్నాయేమోనని ఆయన అనుమానం కూడా వ్యక్తం చేశాడు. ఎన్నోఏండ్ల పరిశోధనల తర్వాత మతాల చరిత్ర- పేరుతో హిల్మి ఒమర్ బుద్ధ 1935లో ఒక ఉద్గంథం ప్రకటించాడు. ఆయన తన గ్రంథంలో ఇంకా భారతదేశంలోని ఇతర మతాల గూర్చి కూడా రాశాడు. టిబెట్‌లోని లామాయిజం గురించి, చైనాలోని టావోయిజం, కన్‌ఫ్యూసియనిజం గురించి, చైనీయ బుద్ధిజం, జపనీయ బుద్ధిజంల గురించి కూడా వివరిస్తూ తన గ్రంథరచన సాగించాడు.అసఫ్ హలెట్ సెలిబి అనే గ్రంథ రచయిత 1946లో "పాలి గ్రంథాల ఆధారంగా గౌతమ బుద్ధ" అనే ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. ప్రొ॥ కొర్కట్ కయ: ప్రొ॥ఎల్విన్ కయలి (ఆసియా పసిఫిక్ రీసెర్చ్ సెంటర్ వైస్ డైరెక్టర్) ప్రొ॥ డెర్యాకాన్ వంటివారు బుద్ధిజం మీద విరివిగా పరిశోధనలు చేస్తూ యువ పరిశోధకులకు మార్గదర్శకులవుతున్నారు. తెలుగులో నేను రాస్తున్న ఈ విషయాలు కూడా టర్కీ: అంకారా యూనివర్సిటీకి చెందిన ఏసియా పసిఫిక్ సెం టర్‌కు డైరెక్టరయిన ప్రొ॥డా॥ఎ.మెర్తాన్ ద్యూండర్ ప్రకటించిన పరిశోధనా పత్రంలోనివి-

మొత్తానికి మొత్తంగా అక్కడి APRC-ఆసియా దేశాల్లోని బుద్ధ చరిత్ర- సంస్కృతులపై దృష్టి పెట్టి పనిచేస్తోంది. టర్కీ జీవనంపై సాగుతున్న అధ్యయనాలలో భారత్, చైనా, జపాన్ బౌద్ధుల ప్రభావం ఎంతగా ఉందో కూడా పరిశీలిస్తున్నారు. గతకాలపు బౌద్ధపత్రాలు, గ్రంథాలు, శాసనాల ఆధారంగా వచ్చిన అనువాదాలు పరిశీలిస్తున్నారు. ప్రొ॥ సిమాబయట్లు ఒజోండర్, ప్రొ॥ మెహమిట్ ఓల్మేజ్‌లు ఈ విషయాల మీద కృషి చేస్తున్నారు. పలు విశ్వవిద్యాలయాల మధ్య అవగాహనా సదస్సులు పెరుగు తున్నాయి. అవి కలిసికట్టుగా పరిశోధనలు ఉధృతం చేయాలని కూడా నిర్ణయించుకున్నాయి. చివరగా అర్థం చేసుకోవాల్సింది ఏమంటే- టర్కీలో క్రమంగా బౌద్ధంపై, బౌద్ధసంస్కృతిపై, బౌద్ధ, నైతిక జీవనంపై అభిరుచి పెరుగుతూ ఉంది!

> **ఆరవ శతాబ్దంలో టర్కీ మొదటి చక్రవరి (542-581C.E) టుర్క్ ముకన్ కగెన్, తర్వాత అతని సోద రుడు ట-జపా/ టాస్పర్ కగెన్‌లు బౌద్ధాన్ని స్వంతం చేసుకున్నారు. ఒక బౌద్ధారామాన్ని కూడా నిర్మిం చారు. ఉత్తర చైనాకు తమ ప్రతినిధిని (దూతను) పంపి తమకు బౌద్ధ ప్రమాణాలు/ సూత్రాలు (CANON) వగైరా పంపించవల్సిందిగా అర్థించారు. బౌద్ధ సన్యాసి హూవై-లిన్, టాస్పర్ కగన్‌కు కొంత సమాచారం అందించాడు. కొన్నిసూత్రాలు. నియమాలు, విధానాలు బోధించాడు. (నైపాన్, హుఅ- యెన్, చింగ్, మిన్, షై-టంగ్.. ఇవి వారి భాషా పదాలు గనక మనకు కొత్తగా ఉంటాయి) బౌద్ధంలోని కొన్ని ముఖ్యమైన అంశాలు బోధించి, ఇంకాలోతుగా తెలుసుకోవాల్సిన అవసరాన్ని వారికి అర్థం చేయించాడు.**

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ (మెల్బోర్న్ నుంచి)

'అచ్చేదిన్' కాదు...ఆకలి భారత్!



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

ఆకలి రక్కసి కబంధ హస్తాల్లోంచి స్వేచ్ఛను సాధించడమే ఇప్పుడు మన ప్రధాన కర్తవ్యం' భారత తొలి ఆహార,వ్యవసాయ శాఖామంత్రి' బాబూ రాజేంద్రప్రసాద్ 1947 ఆగస్టు 15న జాతికి ఇచ్చిన పిలుపు.కానీ స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు జరుపు కొంటున్న దేశం ఆకలి దారిద్ర్యం నుంచి విముక్తి పొందలేకపోయింది.ఐర్లాండ్‌కు చెందిన కంసర్న్ వరల్డ్ వైడ్,జర్మనీకి చెందిన వెల్త్ హంగర్ లైఫ్ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా 127 దేశాల్లో చేసిన అధ్యయనం ఆధారంగా వెలువరించిన 19వ ప్రపంచ ఆకలి సూచీ-2024లో భారత్ 105వ స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా 36 దేశాలు మాత్రమే ఆందోళనకర విభాగంలో ఉండగా అందులో మన దేశం కూడా ఉన్నది.గత రెండు దశాబ్దాలుగా పరిస్థితిలో కొంత మెరుగుదల కనిపిస్తున్నప్పటికీ ఇంకా భారత్‌లో ఆకలికేకలు తగ్గడం లేదని ఈ సూచీలో స్పష్టమైంది.2030 నాటికి దుర్భర పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోతే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టసాధ్యమని నివేదిక వెల్లడించింది.ఈ పరిస్థితి ఇలాగే సాగితే మరికొన్ని శతాబ్దాలు పట్టే అవకాశం ఉందని తెలిపింది.దాదాపు ఎనిమిది దశాబ్దాల స్వపరిపాలన,అనేక పంచవర్ష ప్రణాళికలూ,వివిధ సంక్షేమ పథకాల తర్వాత మనం ఎక్కడున్నాం? ప్రపంచ దేశాలన్నింటిలో మనమే ప్రబలమైన ఆర్థికశక్తిగా ఎదగబోతున్నామనీ సగర్వంగా చాటుకుంటున్న పాలకులు మనల్ని ఆత్మవంచన గురిచేస్తున్నాయా? సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయమిది.

ఆధునిక ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవటంలో సగటుజీవికి ఆకలి, పేదరికం అడుగడుగునా అడు పడుతున్నాయి.ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలలో ఇవి ప్రధానమైనవి.ఇవి మానవాళి మనుగడకే పెను సవాళ్లు విసురుతున్నాయి.ఈ సమస్య కోట్లాది మంది ప్రజలను కనీస అవసరాలకు దూరం చేస్తోంది.పేదరికాన్ని 2030 నాటికి అంతం చేయాలని ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో పేర్కొన్నప్పటికీ నేడు అది నెరవేరే ఆనవాలు కనిపించడం లేదు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంక,అంతర్గత సంక్షోభాలను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్, మయన్మార్‌తో పాటు నేపాల్ లాంటి మన పొరుగు దేశాలు ఈ సూచీలో భారత్‌కంటే మెరుగైన స్థానంలో ఉన్నాయి.ఈ సూచీలో భారత్‌ను 29.3 స్కోర్‌తో ఆందోళనకర విభాగంలో చేర్చారు.ప్రపంచవ్యాప్తంగా 36 దేశాలు మాత్రమే ఆందోళనకర విభాగంలో ఉండగా ఇందులో భారత్ ఒకటి.అయితే అశాస్త్రీయ విధానాల్లో అధ్యయనం ద్వారా క్షేత్రస్థాయి వాస్తవాలకు ఆ నివేదిక అద్దం పట్టడం లేదని కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేస్తుంది.ప్రజల్లో పోషక విలువలను ఇనుమడింపజేస్తూ,వారి జీవన ప్రమాణాల వృద్ధికి బాటలు పరవడం పాలకుల విధి.ఆ మేరకు దిశానిర్దేశం చేస్తున్న 47వ రాజ్యాంగ అధికరణ స్ఫూర్తికి మన్నన దక్కితేనే అన్నమో రామచంద్రా అంటూ అలమటిస్తున్న అభాగ్యులకు సాంత్వన లభించి, ప్రజారోగ్యం మెరుగుపడుతుంది.జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఆసేతు హిమాచలం 80 కోట్ల మందికి పైగా క్రమం తప్పకుండా ఆహారధాన్యాలు చేరుతున్నట్లు సర్కారీ లెక్కలు సాక్ష్యమిస్తున్నాయి.అన్నార్తులకు అంతచక్కగా తోడ్పాటు, మానవీయ సహాయం లభిస్తుంటే దేశంలో ఇంకా ఆకలిచావులు ఎందుకు సంభవిస్తున్నాయి?



> **ప్రజాపంపిణీ వ్యవస్థలోని లోపాలతో లబ్ధిదారులకు చేరాల్సిన ఆహారధాన్యాలు పక్కదారి పడుతున్నాయని పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇటీవల ఆక్షేపించింది. ఎఫ్‌సిఐ గోదాముల్లో గడచిన మూడేళ్లలో 10వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యపురాశులు పాడైపోవడాన్నీ అది ఎత్తిచూపింది. పస్తులతో జనం అల్లాడుతున్న దేశంలో తిండిగింజల వృథాను అరికట్టడానికి ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదని విమర్శించింది.సామాజిక భద్రతా కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాలపై 2030 వరకు ఏడాదికి 5.5 లక్షల కోట్ల రూపాయల చొప్పున భారతదేశం వెచ్చిస్తేనే ఆకలి కోరల్లోంచి బయట పడగలుగుతుందని ఐరాస గతంలో సూచించింది.**

ప్రజాపంపిణీ వ్యవస్థలోని లోపాలతో లబ్ధిదారులకు చేరాల్సిన ఆహారధాన్యాలు పక్కదారి పడుతున్నాయని పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇటీవల ఆక్షేపించింది. ఎఫ్‌సిఐ గోదాముల్లో గడచిన మూడేళ్లలో 10వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యపురాశులు పాడైపోవడాన్నీ అది ఎత్తిచూపింది. పస్తులతో జనం అల్లాడుతున్న దేశంలో తిండిగింజల వృథాను అరికట్టడానికి ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదని విమర్శించింది.సామాజిక భద్రతా కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాలపై 2030 వరకు ఏడాదికి 5.5 లక్షల కోట్ల రూపాయల చొప్పున భారతదేశం వెచ్చిస్తేనే ఆకలి కోరల్లోంచి బయట పడగలుగుతుందని ఐరాస గతంలో సూచిం చింది.ఒక దేశంలో తక్కువ ఆదాయం, నిరుద్యోగం, అధిక జనాభా, వ్యవసాయం ప్రధానంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక అసమానతలు, వనరుల అల్ప వినియోగం,అల్ప వేతనాలు, పౌర భాగస్వామ్యం లోపం, సంక్షేమ పథకాల వైఫల్యం లాంటి అంశాలు ఇప్పటివరకు పేదరికానికి ప్రధాన కారణమని దారిద్ర్యరేఖను నిర్వచించిన ఆర్థికవేత్తలు పేర్కొన్నారు.భారత్‌లో మెజార్టీ మధ్య తరగతి కుటుంబాల్లో ఇంటి పెద్ద సంపాదనే కుటుంబ సభ్యులందరికీ ఆహార సముపార్జనకు సాధనం.ఆయనే ఉపాధి కోల్పోవడంతో పేదలతో పాటు మధ్య తరగతి కుటుంబాలు సైతం ప్రభుత్వ రేషన్ బియ్యంతో కాలం గడిపే పరిస్థితి వచ్చింది. చాలా కుటుంబాలు ఆకలి, అర్థాకలితో పోషకాహార లోపం,ఆరోగ్య సమస్యలతో రోడ్డున పడ్డారు. ఇది వారి ఆహార, ఆరోగ్య సంరక్షణపై తీవ్ర ప్రభావం చూపింది. భారత్‌లో ఆకలి కేకలకు ఆకలి సూచీ చెప్పిన కారణాలను చూస్తే భారత్‌లో ఆహార వినియోగంపై ఆధ్యాత్మిక ప్రభావం ఎక్కువగా ఉంది.కొన్ని ఆహార పదార్థాలపై నిషేధం ఉన్నది.బాలింతలు,గర్భిణులకు సరైన ఆహారం అందడం లేదు.పౌష్టికాహారం అందించడంలో కేరళ మినహా ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.ఆహార సముపార్జన మరింత ఖరీదైపోయింది.ప్రాణాధార ఆహారాలపై పన్నుల ప్రభావం పడుతోంది. షెడ్యూల్డ్ కులాలు తీసుకునే ఆహారంపై నియంత్రణ,కొన్ని ప్రాంతాల్లో నిషేధం కూడా కొనసాగుతున్నది.

మన దేశంలో వలస కార్మికుల సమస్యలు వర్ణనాతీతం అని చెప్పవచ్చు.ప్రపంచాన్ని అభివృద్ధిపథంలో నడిపించటం కోసం మొదట చేయాల్సిన పని దారిద్ర్యాన్ని నిర్మూలించటం.ప్రజారోగ్య వ్యవస్థను మెరుగుపర్చుకోవడం. అభివృద్ధిని పరుగులు పెట్టించటంతో పాటు అన్ని వర్గాలకు సమానంగా అందే విధంగా కృషి చేయాలి.సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు సాధికారిక కార్యక్రమాలకు నాంది పలకాలి.ముఖ్యంగా ప్రజల జీవన ప్రమాణాల పెంపుకై వ్యవసాయం,సామాజిక రంగం,ఉపాధి కల్పన వంటి రంగాలపై పెద్ద ఎత్తున ఖర్చు చేయాలి.అందరికీ సమానంగా విద్య,వైద్య సౌకర్యాలు అందరికీ అందుబాటులో ఉండే వాతావరణం సృష్టించాలి.లింగ భేదం లేకుండా మహిళలకు ఆర్థిక రక్షణ కల్పించే ప్రత్యేక విధానాలు తీసుకురావాలి.వారికి ఆర్థిక స్వావలంబన కల్పించాలి.భారత్ వంటి దేశాల్లో వ్యవసాయానికి తగిన ప్రాధాన్యమివ్వటం తప్పనిసరి. ఈ రంగంలో సాధించే అభివృద్ధి వల్ల రెండి ంతలు పేదరికం తగ్గుతుందనే ఆర్థికవేత్తల అంచనాలున్నాయి.ఇప్పటివరకు దేశంలో అమలు చేస్తున్న పేదరిక నిర్మూలన కార్యక్రమాలను పటిష్టంగా అమలు పరచాలి. నైపుణ్యాల కల్పన,యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించటంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి.దానికై సాంకేతిక పరిజ్ఞానాన్ని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి పెట్టాలి.పర్యావరణానికి హాని కలిగించని సుస్థిరాభివృద్ధి చర్యలకై ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలి.

ప్రపంచ దేశాలు ఆర్థికాభివృద్ధితో పాటు మానవాభివృద్ధి దిశగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలి.పౌర సేవల వినియోగానికై ప్రతి ఒక్కరినీ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించే వికేంద్రీకత ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయాలి.ఐరాసతో పాటు ప్రపంచ బ్యాంకు గ్రూపు,అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వంటివి పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు అయా దేశాలకు తోడ్పాటు అందించాలి.అప్పుడే నేటి సంక్షోభానికి చరమ గీతం పాడడంతో పాటు పేదరికం అంతం అవుతుంది. సాగుభూములు తరిగిపోతూ, అన్నదాతలు అంతకంతకూ సమస్యల ఊబిలో మునిగిపోతూ దేశీయంగా వ్యవసాయం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది.రైతుల కడగండ్లు తీర్చి ప్రభుత్వం వారికి అండగా నిలిస్తేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమ వుతుంది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను జోరెత్తిస్తూ,అర్హతలకు తగిన ఉపాధి అవకాశాలను కల్పిస్తూ జనావళి సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గొడుగుపట్టాలి. పార్లమెంటరీ స్థాయీసంఘం సూచించినట్లుగా ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టీకరించడమూ కీలకమే.సంక్షేమం,ఉపాధి కల్పనలను జోడు గుర్రాలుగా పరుగులీయిస్తేనే జాతి జవజీవాలను తోడేస్తున్న ఆకలి సమస్యకు పరిష్కారం.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట

నవంబరు 26న దేశవ్యాప్త ఆందోళనలు

- 500 జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు : కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ నేతృత్వ ఎన్డీఏ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శ్రామికలోకం ఉద్యమానికి సంసిద్ధమైంది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వచ్చే నవంబరు 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని, 500 జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాల వేదిక (సీటీయూ), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) నిర్ణయించాయి. ఈ మేరకు గురువారం సీటీయూ, ఎస్కేఎం సంయుక్త సమావేశం ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో జరిగింది. మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలకు, ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సమావేశం తీర్మానించింది. కోవిడ్ మహమ్మారి విజృంభణ నేపథ్యంలో 2020లో లాక్‌డౌన్ విధించిన సమయంలో కేంద్ర కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టాయి. అదే ఏడాది కర్షకలోకం చారిత్రాత్మక రైతు పోరాటాన్ని సాగించింది. ఈ రెండు పోరాటాల నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నవంబరు 26న దేశవ్యాప్తంగా భారీ ప్రజా సమీకరణతో ప్రదర్శనలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువకులు, విద్యార్థులు తదితర అన్ని సంఘాలు, ప్రజా వేదికలు ఈ పోరాటంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర కార్మిక సంఘాల నుండి తపన్ సేన్ (సీఐటీయూ), అమర్జీత్ కౌర్ (ఏఐటీయూసీ), అశోక్ సింగ్ (ఐఎన్‌టీయూసీ), హర్భజన్ సిద్ధూ (హెచ్ఎంఎస్), ఆర్‌కె శర్మ (ఏఐయూటీయూసీ), రాజీవ్ దిమ్రీ (ఏఐసీసీటీయూ), సోన్యా జార్జ్



(ఎస్ఈడబ్ల్యుఎ), రాకేష్ మిశ్రా (టీయూసీసీ), శత్రుజీత్ (యూటీయూసీ), అలాగే ఎస్కేఎం నాయకులు డాక్టర్ అశోక్ ధావలే, డాక్టర్ దర్శన్ పాల్, రాజన్ క్షీరసగర్, రాజారామ్ సింగ్, హన్నన్ మొల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ, పలు రాష్ట్రాల్లో జరుగనున్న ఉప ఎన్నికల్లోనూ బీజేపీని ఓడించేందుకు ప్రచారం నిర్వహించాలని ఎస్కేఎం రైతులకు, ప్రజలకు పిలుపునిచ్చింది. 'బీజేపీని సాగనంపుదాం..బీజేపీని వ్యతిరేకిద్దాం..శిక్షిద్దాం' పేరిట విస్తృత ప్రచార కార్యాక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.

ఈ మేరకు హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో జరిగిన ఎస్కేఎం జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించారు. రాష్ట్ర జాబితాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను అగ్రికల్చర్ మిషన్ పేరుతో లాక్కోవడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎస్కేఎం నేతలు విమర్శించారు. ఎరువులకు ఇస్తున్న రాయితీలోనూ ఎన్డీఏ ప్రభుత్వం భారీగా కోతలు విధించిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే నయవంచక విధానాలను మోడీ సర్కార్ అనుసరిస్తోందని, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు దానికి వత్తాసు పలుకుతున్నాయని తప్పుబట్టారు. ఈ సమావేశానికి అధ్యక్షవర్గంగా ఎస్కేఎం నేతలు జగ్‌మోహన్ సింగ్, హన్నన్ మొల్లా, రాజన్ క్షీరసాగర్, పద్మ పశ్యం, జోగిందర్ సింగ్ నైన్, సిదాగౌడ మోదగి, డాక్టర్ సునీలం ఉన్నారు.

డాక్టర్ దర్శన్ పాల్ నివేదికను ప్రవేశపెట్టారు. పి కృష్ణ ప్రసాద్ ముగింపు ఉపన్యాసం చేశారు. శ్రమజీవుల డిమాండ్లను నెరవేర్చడానికి ఎన్డీఏ-3 ప్రభుత్వానికి మూడు నెలల వ్యవధి ఇస్తున్నట్లు సీటీయూ, ఎస్కేఎం నేతలు తెలిపారు. ఈ గడువు లోగా తమ డిమాండ్లను నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీల బంద్ విరమణ

- నేటినుంచి తరగతులు ప్రారంభం
- ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- రూ.650 కోట్లు చెల్లిస్తామన్న ఉప ముఖ్యమంత్రి భట్టి
- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శితో టీపీడీఎంఏ నేతల చర్చలు సఫలం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీల బంద్ చేపట్టిన యాజమాన్యాలు విరమించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో తరగతులను ప్రారంభించడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. శుక్రవారం కాలేజీలు తెరుచుకోనున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలంటూ ఈనెల 14 నుంచి ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీల బంద్‌కు యాజమాన్యాలు పూనుకున్న విషయం తెలిసిందే. నాలుగోరోజు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. యాజమాన్యాలతో సంప్రదింపులు జరపాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని ఆదేశించారు. దీంతో భట్టి విక్రమార్కను టీపీడీఎంఏ నాయకులు కలిశారు. టోకెన్ తీసుకున్న రూ.650 కోట్లు విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం బుర్రా వెంకటేశంతో సచివాలయంలో టీపీడీఎంఏ నాయకులు సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలేజీల బంద్‌ను విరమించుకోవాలని కోరారు. రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శితో జరిపిన చర్చలు సఫలమయ్యాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కాలేజీల బంద్‌ను విరమించుకున్నట్టు టీపీడీఎంఏ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, టీపీడీఎంఏ రాష్ట్ర అధ్యక్షులు బి సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ, నాయకులు సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎ పరమేశ్వర్, రామారావు, భాస్కర్‌రావు, నరసింహయాదవ్, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, అశోక్, జైపాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, సతీష్, ఉపేందర్‌రెడ్డి, హరి, తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మెన్ గోరిగే మల్లేశ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

23న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి ముహూర్తం ఖరారైంది. దాదాపు 33 రోజుల తర్వాత రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 23న రాష్ట్ర సచివాలయంలో క్యాబినెట్ భేటీ కానుంది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. అయితే, ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం హైడ్రా, మూసీ ప్రక్షాళన అంశాలు చర్చనీయాంశంగా మారగా.. వీటితో పాటు ఎన్నికల్లో ఇచ్చిన పలు హామీల అమలుపై కూడా రాష్ట్రంలో చర్చ నడుస్తోంది. దీంతో ఈ మంత్రివర్గ సమావేశంలో కీలకాంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకోనున్నారని భావిస్తున్నారు. ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారిన హైడ్రా ఏర్పాటును హైకోర్టు సమర్థించటం, ఇప్పటికే హైడ్రాకు చట్టబద్ధత కల్పించటం లాంటి అంశాలతో పాటు మూసీ ప్రక్షాళన విషయంలో ఎలా ముందుకెళ్లాలి అనే అంశంపై ఈ భేటీలో చర్చించనున్నట్టు తెలుస్తోంది. మరోవైపు రానున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా క్యాబినెట్ చర్చించే అవకాశం ఉందని సమాచారం.

రైతు భరోసాపై..!

రాష్ట్రంలోని రైతులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసాపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి.. కీలక నిర్ణయం వెలువరించనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే రైతు భరోసా విధివిధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వివిధ వర్గాలతో చర్చలు జరిపిన క్యాబినెట్ సబ్ కమిటీ.. రైతు భరోసా విధివిధానాలు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి రైతు భరోసా మార్గదర్శకాలు విడుదల చేసి.. అన్నదాతలకు శుభవార్త అందించే అవకాశం ఉందని సమాచారం. త్వరలోనే రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. వీటితోపాటుగా ఇదే నెలలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కూడా చేస్తామంటూ మంత్రులు ప్రకటిస్తున్న నేపథ్యంలో.. దీనిపై కూడా తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కూడా సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్న నేపథ్యంలో.. నిర్వహిస్తున్న ఈ క్యాబినెట్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని, వాటిని సంవత్సరాలుగా విడుదల చేయడం లేదని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వాన్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తక్షణమే ఫీజులు విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక.. ప్రయివేట్ కళాశాల యాజమాన్యాలు కాలేజీలు నడపలేక వాటికి తాళాలు వేస్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేసి విద్యార్థులు, ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అవసరమైతే సెక్రటేరియట్, ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, నాగేందర్, ప్రశాంత్, చరణ్ శ్రీ, జిల్లా కమిటీ సభ్యులు సహన, భగత్ శివ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో..

కరీంనగర్ జిల్లా కేంద్రంలో డిగ్రీ, పీజీ కళాశాలల నిర్వాహకులు, సిబ్బంది సుమారుగా తెలంగాణ చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి, అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. శాతవాహన యూనివర్సిటీ ప్రయివేటు డిగ్రీ, పీజీ మెనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్ మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎండి సయ్యద్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థుల ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ ఫీజులు వెంటనే విడుదల చేయాలని జోగులాంబ గద్వాల కేంద్రంలోని కృష్ణవేణి చౌక్‌లో తెలంగాణ ప్రయివేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో మానవహారం, ధర్నా, ర్యాలీ నిర్వహించారు.

వాల్మీకి చిత్రపటానికి సీఎం నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లోగల తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులున్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గత ఆరేండ్ల నుంచి రూ.ఎనిమిది వేల కోట్లకుపైగా పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలున్నాయని తెలిపారు. ప్రభుత్వం వాటిని విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులు అప్పులు చేసి మరీ ధ్రువపత్రాలను తీసుకుంటున్నారని వివరించారు. విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారనీ, యాజమాన్యాలు అప్పులు తెచ్చి కాలేజీలను నడిపిస్తున్నామని తెలిపారు. జీతాలు చెల్లించలేమంటూ కళాశాలల బంద్‌కు పూనుకున్నాయని పేర్కొన్నారు. యాజమాన్యాలతో చర్చించి పేద విద్యార్థులకు నష్టం లేకుండా నిధులను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో డిగ్రీ, పీజీ కాలేజీల కంటే ప్రయివేట్ రంగంలోనే ఎక్కువ ఉన్నాయని పేర్కొన్నారు. వాటిలో ఎక్కువ మంది పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులే చదువుతున్నారని తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

'హెచ్‌సీఏ'లో స్కాంపై ఆరా

- మూడు స్పోర్ట్స్ దుకాణ యజమానులకు నోటీసులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటు చేసుకున్న రూ.3.8 కోట్ల స్కాంకు సంబంధించి నగరానికి చెందిన మూడు ప్రముఖ స్పోర్ట్స్ దుకాణదారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నోటీసులను జారీ చేశారు. ఆ దుకాణాల యజమానులు ఈనెల 22న తమ ఎదుట హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. హెచ్‌సీఏలో 2020 నుంచి 2023 మధ్య క్రీడా సామాగ్రి, యంత్రాల కొనుగోళ్లకు సంబంధించి రూ.3.8 కోట్ల మేరకు అవకతవకలు చోటు చేసుకున్నాయని వచ్చిన ఆరోపణలపై ఈడీ విచారణ చేపట్టిన విషయం విదితమే. ఈ స్కాంకు సంబంధించి ఇటీవలనే అప్పటి హెచ్‌సీఏ అధ్యక్షుడు, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజహరుద్దీన్‌ను ఈడీ అధికారులు విచారించారు. ఆ విచారణలో తేలిన అంశాల ఆధారంగా స్పోర్ట్స్ సామాగ్రి కొనుగోళ్లు జరిగిన మూడు ప్రముఖ దుకాణాలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఆ దుకాణాల యాజమాన్యాలను ఈడీ విచారించనున్నది.

104 ఉద్యోగుల కొనసాగింపు ఉత్తర్వులు విధాన నిర్ణయం

- డబ్బులిచ్చి మోసపోవద్దు : భూపాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

104 ఉద్యోగుల కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చే అంశం విధానపరమైన నిర్ణయమని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ-సీఐటీయూ అనుబంధం) గౌరవాధ్యక్షులు భూపాల్ తెలిపారు. గురువారం 104 ఉద్యోగుల నాయకులు శ్రీకాంత్‌తో కలిసి భూపాల్ హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఆర్థికశాఖ, వైద్యారోగ్యశాఖ లోని అధికారులు, సంబంధిత సెక్షన్ సిబ్బందితో కొనసాగింపు ఉత్తర్వుల గురించి ఆరా తీశారు. 104 సర్వీసులు ఆగిపోవడంతో సాంకేతికంగా అందులోని ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడం ఆర్థికశాఖకు సాధ్యం కాదని వారు చెప్పినట్టు తెలిపారు. ఆ సిబ్బందికి అక్టోబర్ నెల జీతాలిచ్చి ఇంటికి పంపించాలని ఆర్థికశాఖ సూచించినట్టు సమాచారం. అయితే ఆర్థికశాఖలో ఫైలు కదలాలంటే డబ్బులు ఇవ్వాలనీ కొంత మంది వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. ఇది ప్రభుత్వపరమైన విధానమనీ, ఆర్థికశాఖ నుంచి ఫైలును రిటర్న్ చేశారని తెలిపారు. డబ్బులు ఎవరైనా ఇచ్చి ఉంటే మోసపోయినట్టేనని తెలిపారు. గతంలో మాదిరిగా అందరూ ఐక్యంగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

మంత్రి దామోదరపై మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఫిర్యాదు



నవతెలంగాణ-జోగిపేట

గాంధీ ఆస్పత్రిలో మందుల కొరతపై ఇటీవల ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు మంత్రి దామోదర రాజ నర్సింహ దురుసుగా ప్రవర్తించారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ గురువారం సాయంత్రం జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పాండుకు ఫిర్యాదు చేశారు. మంత్రిగా ఉండి మా వాళ్ళు, మీ వాళ్ళు అంటూ సమాధానం ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు మంత్రిపై కేసు నమోదు చేశారు. కాగా, మునిపల్లి మండలంలో బీఆర్ఎస్ నాయకులు మృతి చెందితే అలాయ్-బలాయ్ కార్యక్రమం చేసుకుంటారా అని మునిపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెట్టిన పోస్ట్‌పై అందోల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. ఐదు రోజుల క్రితం వట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మెన్ నవీన్ రెడ్డిపై రెడ్డీలకే మూడు మార్కెట్ పదవులని సోషల్ మీడి యాలో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ నాయకులు జోగిపేటలో కేసు నమోదు చేశారని, ఇది అన్యాయమని అన్నారు. విచారణ జరపకుండా పోలీ సులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అందోల్ నియో జకవర్గంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం విచారకరమన్నారు. రెండు పార్టీ మధ్య ఘర్షణలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంద న్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు డీబీ నాగభూషణం, సార శ్రీధర్, గోపాల్, కృష్ణ గౌడ్, నాగరత్నం గౌడ్, నర్సింలు, సత్యం, శంకర్ తదితరులు ఉన్నారు.

ఇండ్లిస్తామని భూములు లాక్కుండ్రు

- డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చి న్యాయం చేయాలి : రోడ్డుపై బైటాయించి దళితుల ఆందోళన



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని ఆశ చూపి గత ప్రభుత్వం తమ భూములను లాక్కుందని, తీసుకున్న భూములకుగానూ డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించి న్యాయం చేయాలని దళితులు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం బైపాస్ రోడ్డుపై బైటాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 50ఏండ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం తమకు సుమారు పదెకరాల భూములు కేటాయించిందన్నారు. ఆ భూములను గత ప్రభుత్వంలో సిరిసిల్ల ఎమ్మెల్యే డబుల్ బెడ్రూం ఇండ్ల ఆశ చూపి లాక్కున్నారని ఆరోపించారు. తీరా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను తమకు కాకుండా ఇతరులకు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నష్టపోతున్నామని, నాడు కూడా అధికారుల అండదండతో కొందరు డబుల్ ఇండ్లను అమ్ముకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులతో మళ్లీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

- రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి : ప్రొ.హరగోపాల్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటొరెడ్డి
- ఇందిరాపార్క్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



నవతెలంగాణ - ముషీరాబాద్

ఉపా చట్టాన్ని రద్దు చేసి బేషరతుగా రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటొరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద 'ఉపా చట్టాన్ని రద్దు చేయాలి-రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి' అని నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఉపా చట్టానికి టైమ్ ఫ్రేమ్ లేదని, ట్రయల్, బెయిల్ ఉండదని, దుర్మార్గమైన చట్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపా చట్టంలో అరెస్టయిన వారిపై కేవలం మూడు శాతమే నేరాలు నిరూపించారని, 97 శాతం నిరూపణ కాలేదని అన్నారు. బీమా కోరేగామ్ కేసులో ట్రయల్ ప్రారంభం కాలేదన్నారు. వరవరావును జైలులో పెట్టారన్నారు. ఈ విషయంపై అప్పటి మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావును, అనేకమంది రాజకీయ నేతలను కలిశానని తెలిపారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా కూడా చాలా ప్రయత్నాలు చేశారని చెప్పారు. వైకల్యంతో తన పనులు తాను చేసుకోలేని ప్రొ.సాయిబాబాను నిర్బంధించి తీవ్రంగా హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా చనిపోయిన తరువాత సమాజం నుంచి స్పందన.. ఆయనను అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు వచ్చి ఉంటే బాగుండేదని అన్నారు. దేశంలో రూ.300 లక్షల సంపద ఉంటే, 20 కోట్ల మంది ఆకలితో ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. ఉపా చట్టం రద్దయ్యే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపా చట్టానికి మోడీ ప్రభుత్వం మరింత విషపు కోరలు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 90 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాను దుర్మార్గంగా పదేండ్లు జైల్లో పెట్టిందన్నారు.

పౌరస్మృతి చట్టాలను తెచ్చి, ప్రశ్నించే గొంతులను ఉపా చట్టంతో మోడీ ప్రభుత్వం అణచి వేస్తోందని విమర్శించారు. గౌరీ లంకేశ్ లాంటి వాళ్లను ఫాసిస్టు శక్తులు చంపేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరవరరావు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రజాస్వామిక వాదులందరూ ఒకే వేదిక మీదకు రావాలని, మోడీ మెడలు వంచి ఉపా చట్టం రద్దు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి.నరసింహ, విఎస్.బోస్ మాట్లాడుతూ.. అధికార పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఉపా చట్టాల కింద కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా తల్లి చనిపోతే కనీసం చూడటానికి ఆయనకు బెయిల్ ఇవ్వలేదన్నారు. కానీ డేరా బాబాకు బెయిల్ ఇచ్చారని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు దమ్ముంటే ఉపా చట్టం రద్దు కోసం ధర్నా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎ.రవీంద్రచారి, సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కె.యాదగిరి, బి.స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.ఆదిరెడ్డి, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల గొంతుక 'నర్సిరెడ్డి'

ఎమ్మెల్సీగా మళ్లీ గెలిపించుకుందాం : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి



నవతెలంగాణ - మరిపెడ

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో, విద్యారంగ అభివృద్ధిలో ప్రజల గొంతుకగా నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కృషి చేశారని, మళ్లీ నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి పిలుపునిచ్చారు. గురువారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గురుకులాలు, కళాశాలలు, పలు ఉన్నత పాఠశాలల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభలో ఉపాధ్యాయ ప్రతినిధిగా ఉంటూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్యపాత్ర వహించారని చెప్పారు. కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధులు మొత్తం పాఠశాలల అభివృద్ధికే కేటాయించారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఇస్తున్న వేతనాన్ని కూడా సంఘానికి కేటాయించి, ఉపాధ్యాయ పెన్షన్‌తో మాత్రమే జీవనం కొనసాగిస్తున్నారని కొనియాడారు. నేటి సమాజానికి నర్సిరెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ స్థానానికి ఓటర్ నమోదు ప్రక్రియ నవంబర్ 6 వరకు ఉంటుందని చెప్పారు. అదే నెల 23న తుదిజాబితా ప్రకటిస్తారని, అభ్యంతరాలను డిసెంబర్ 9వరకు తీసుకుంటారని, అనంతరం పూర్తి జాబితాను డిసెంబర్ 30న విడుదల చేయనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జనవరి చివరిలో గానీ, ఫిబ్రవరి మొదటి వారంలో గానీ జరిగే అవకాశం ఉందన్నారు. యూటీఎఫ్ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్సీ ఓటర్‌గా నమోదు చేయించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో నిర్వహించే పోరాటాలకు స్థానిక ఎమ్మెల్సీ స్థానం కీలకం కాబోతుందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి యాఖుబ్, కార్యదర్శి నందిగామ జనార్ధనచారి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ప్రభాకర్, సభ్యులు శ్రీనివాసరావు, యాకయ్య, నాగరాజు, మంగు, దేవ్లా తదితరులు పాల్గొన్నారు.

మీకు అండగా ఉంటాం

- గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులకు కేటీఆర్ భరోసా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. ఆ పరీక్షను రీషెడ్యూల్ చేయాలని కోరుతున్న అభ్యర్థుల డిమాండ్‌ను సానుకూలంగా పరిశీలించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో రేవంత్ సర్కారు ఎందుకు మొండి పట్టుదలకు పోతోందంటూ ఆయన ప్రశ్నించారు. ఇదే అంశంపై ఆందోళన చేపట్టిన అభ్యర్థులను అరెస్ట్ చేయటాన్ని ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలనీ, వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులు... కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ... ప్రధాన ప్రతిపక్షంగా గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థుల పోరాటానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. వారికి కావాల్సిన న్యాయసాయాన్ని అందిస్తామని తెలిపారు.

పైసా పని లేదు
రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ట్వీట్

రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు పైసా పని లేదనీ, ఆ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒక్క రూపాయి మందం కూడా లాభం లేకుండా పోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. పది నెలల రేవంత్ పాలనలో సీఎం 25 సార్లు ఢిల్లీకి వెళ్లారనీ, 50 రోజులపాటు అక్కడే గడిపారని తెలిపారు. అయినా తట్ట మట్టి తీసింది లేదనీ, కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. 'అయిననూ పోయిరావలెను హస్తినకంటూ మరోసారి ఆయన ఢిల్లీ విమానమెక్కబోతున్నారంటూ దుయ్యబట్టారు.

మార్కెట్‌లో పడిపోయిన పత్తి ధరలు

- తెరుచుకోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,050



నవతెలంగాణ-కాశిబుగ్గ/జమ్మికుంట

వరంగల్, కరీంనగర్ జిల్లాల వ్యవసాయ మార్కెట్‌ల్లో పత్తి ధరలు పడిపోయాయి. సీజన్ మొదట్లోనే మార్కెట్‌లోకి పత్తి రావడం మొదలవుతుండగానే రేటు తగ్గిపోతోంది. కేంద్ర ప్రభుత్వం పత్తికి ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521 అయితే గురువారం వరంగల్ ఏనుమాముల, కరీంనగర్ జమ్మికుంట మార్కెట్‌లో కనిష్టంగా సుమారు రూ.5000 నుంచి గరిష్టంగా సుమారు రూ.7050 వరకు ధర పలికింది. కాగా ఈ నెలాఖరు నుంచి మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున పత్తి రానుంది. కానీ, ఇప్పటివరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. పత్తి తేమ 8శాతం లోపు ఉంటేనే రైతుకు మద్దతు ధర లభిస్తుంది. 9శాతం నుంచి 12శాతం మధ్యలో ఉంటే శాతాన్ని బట్టి అదే తరహాలో ధర తగ్గుతూ వస్తుంది. ఎనుమాముల మార్కెట్‌లో రెండూ మూడు వారాల క్రితం క్వింటాల్ ధర రూ.8250 వరకు చెల్లించిన వ్యాపారులు ఇప్పుడు తగ్గించటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈనెల ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఎనుమాములకు 24,943 క్వింటాళ్ల పత్తి వచ్చినట్టు అధికారులు తెలుపుతున్నారు. ఎనుమాములలో మోడల్ ధర రూ.6300 పలికింది.

కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర గురువారం రూ.7050 పలికింది. మార్కెట్‌కు 791 క్వింటాళ్ల కాటన్ విడిపత్తిని రైతులు 120 వాహనాల్లో విక్రయానికి తీసుకువచ్చారు. గరిష్ట ధర 7,050, మోడల్ ధర 6,800, కనీస ధర రూ. 6వేలు పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లో 21క్వింటాళ్ల పత్తిని 17 వాహనాల్లో రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.6,600, మోడల్ ధర 6,400, కనిష్ట ధర 5,500 పలికిందని మార్కెట్ సెక్రెటరీ ఆర్ మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, కరీంనగర్ జిల్లాలో 7 జిన్నింగ్ మిల్లులకు పత్తి కొనుగోలు కేంద్రాలుగా జిల్లా కలెక్టర్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ చేసిన వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో వరంగల్ శాఖ ద్వారా భారతీయ పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లు ప్రారంభమైనట్టు మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్తిని సీసీఐకి అమ్ముకునే ముందు రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. సిద్దిపేట జిల్లాలో 16 మిల్లుల్లో కొనుగోళ్లకు సిద్ధం చేయగా.. క్వింటాలుకు రూ.6,500కు మించి ధర పలకడం లేదు. జహీరాబాద్, జోగిపేట తదితర ప్రాంతాలలో పత్తి కొనుగోలు ఇంకా ప్రారంభం కాలేదు.

పిడుగుపాటుతో రైతు మృతి



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

పొలం వద్ద ఉన్న గేదె పాలు పితికేందుకు వెళ్లిన రైతుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. బండలింగంపల్లి గ్రామానికి చెందిన రైతు కామిడి నర్సింలు(48)కు నాలుగెకరాల భూమి ఉంది. మరో 13 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలం వద్ద ఉన్న గేదె పాలు పితికేందుకు ఉదయం వెళ్లాడు. నీటి సంపు వద్ద కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా పిడుగు పడింది. దాంతో నర్సింలు అక్కడికక్కడే మృతిచెందాడు. రైతుకు భార్య, కుమారుడు ఉన్నారు.

వ్యవసాయంలో నష్టాలొచ్చి రూ.10లక్షలు అప్పులయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రూప్ 1 పరీక్షపై ఓ నిర్ణయం తీసుకుంటాం

- అభ్యర్థులకు మహేష్‌కుమార్‌గౌడ్ హామీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని ఓ నిర్ణయం తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గ్రూప్ 1 అభ్యర్థులు ఆయన్ను కలిశారు. విద్యార్థులు, అభ్యర్థుల సమస్యలపై అధికారులతో మాట్లాడి, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.గ్రూప్ 1 వాయిదా వేయమని వారగడం లేదన్నారు. ఆ పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. జీవో 29 వల్ల ఇబ్బందులు తలెత్తుతాయనీ, జీవో 55 అమలు చేయాలని కోరుతున్నారని వివరించారు. కోర్టు డైరెక్షన్ తర్వాత ఒక క్లారిటీ వచ్చాక గ్రూప్ 1 పరీక్ష నిర్వహిం చాలని కోరారని చెప్పారు. మొన్నటి గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో కొన్ని తప్పులు ఉన్నాయనే విషయాన్ని గుర్తు చేశారన్నారు.

నేడు జరగాల్సిన మంత్రుల ముఖాముఖి బుధవారానికి వాయిదా

కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మంత్రుల ముఖాముఖి కార్యక్రమానికి బుధవారానికి వాయిదా వేసింది. శుక్రవారం జరగాల్సిన ఆ కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు వారి సమస్యల పరిష్కా రానికి బుధవారం రోజు గాంధీ భవన్‌కు రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల హామీలు అమలు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు వెంటనే విడుదల చేయాలి
- 23న నిర్వహించే క్యాబినెట్‌లో చర్చించి, వెంటనే ప్రకటించాలి : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీపావళి కానుకగా కేంద్ర ప్రభుత్వం 3 శాతం కరువు భత్యం ప్రకటించిందని గుర్తుచేశారు. ప్రభుత్వం రాగానే బకాయి ఉన్న 3 బకాయిలను, ఆ తర్వాత డీఏలను సకాలంలో ప్రకటించి నేరుగా చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశమై మరుసటి రోజే క్యాబినెట్‌లో చర్చించి డీఏ విడుదల చేస్తామని మాట తప్పారని విమర్శించారు. డీఏలు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయయ, ఉద్యోగ, పింఛనర్లు ఒక్కొక్కరు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోతున్నారని చెప్పారు. ఐదు డీఏల మొత్తం 17.29 శాతంపై క్యాబినెట్‌లో చర్చించి దీపావళి కానుకగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి, సిఫారసులను ఆరు నెలల్లో అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు. 10 నెలలు గడిచినా ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. 15 పనిదినాల్లో సప్లిమెంటరీ బిల్లులు చెల్లిస్తామని చెప్పి నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని తెలిపారు. సీపీఎస్ విధానం రద్దుపై క్యాబినెట్‌లో చర్చించాలని కోరారు. మార్చి 31 తర్వాత రిటైర్ అయిన దాదాపు 5 వేల ఉద్యోగ, ఉపాధ్యాయుల రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ నెలల తరబడి పెండింగ్ లో ఉంటున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన నూతన ఈహెచ్ఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు

21 నుంచి నిరవధిక బంద్

- తెలంగాణ ఫార్మసీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపకార వేతనాల బకాయిలు రాకపోవడంతో నిర్వహణ సాధ్యంకాక ఈ నెల 20 నుంచి ఫార్మసీ కళాశాలలను మూసివేస్తున్నట్టు ఆ కళాశాలల యాజమాన్యాల సంఘం తెలిపింది. ఈ మేరకు గురువారం తెలంగాణ ఫార్మసీ కాలేజెస్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రమేశ్ బాబు తదితరులు హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. పలు కాలేజీల్లో బోధనా సిబ్బంది ఇప్పటికే పెన్ డౌన్ పాటిస్తున్నారనీ, ఈఎంఐలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. మూడేండ్లకు గానూ ప్రభుత్వం నుంచి రూ.500 కోట్ల వరకు రావాల్సి ఉందని వారు తెలిపారు. బ్యాంకులు, ప్రయి వేటులోనూ తమకు రుణాలు ఇవ్వడం లేదనీ, అనివార్య పరిస్థితిలో బంద్ పెట్టే స్థితిలోకి నెట్టబడ్డామని తెలిపారు. ఫార్మసీ విద్య ప్రాముఖ్యతను, విద్యార్థుల భవిష్యత్తు కోసం వెంటనే బకాయిలను చెల్లించాలని వారు కోరారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలి

- హైదరాబాద్ అశోక్ నగర్ చౌరస్తాలో అభ్యర్థుల ధర్నా
- భారీగా మోహరించిన పోలీసులు
- పలువురి అరెస్ట్



నవతెలంగాణ - ముషీరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు గురువారం హైదరాబాద్ అశోక్‌నగర్ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో మరోసారి ధర్నాకు దిగారు. అశోక్‌నగర్ చౌరస్తా వద్ద భారీగా పోలీసులు మోహరించడంతో గాంధీనగర్‌లోని పార్కులో అభ్యర్థులు శాంతియుత నిరసన చేపట్టారు. జీవో 29ను సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ధర్నా ప్రదేశానికి చేరుకున్న పోలీసులు.. అభ్యర్థులను అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రూప్-1 అభ్యర్థులు పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ విషయంలో జీవో 29ను తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓపెన్ కేటగిరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మెరిట్‌లో వచ్చినా రిజర్వ్‌డ్ కేటగిరీకి పరిమితం చేస్తున్నారన్నారు. వెంటనే గ్రూప్-1 మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

డీఎస్సీ హిందీ పండితులకు న్యాయం చేయాలి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఆర్‌యూపీపీటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ నియామక పరీక్షల్లో హిందీ పండితులకు కోర్టు ద్వారా ఊరట లభించిందని ఆర్‌యూపీపీటీఎస్ తెలిపింది. వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆర్‌యూపీపీటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్‌సీటీఈ నిబంధనలంటూ దక్షిణభారత హిందీ ప్రచార సభ మద్రాసు ధ్రువపత్రాలు చెల్లుబాటు కాదంటూ కొన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు డీఎస్సీ ఫలితాలు వచ్చాక కూడా అభ్యర్థులకు నియామకాల్లో అన్యాయం చేశారని తెలిపారు. ఈ విషయంలో కొంత మంది హిందీ పండితులు హైకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు.

అన్ని అంశాలనూ కోర్టు పరిశీలించి దక్షిణ భారత హిందీ ప్రచార సభ మద్రాసు ద్వారా చేసిన కోర్సు చెల్లుబాటు అవుతుందనీ, దానికి యూజీసీ గుర్తింపు ఉందనీ, వారికి డీఎస్సీ-2024లో అర్హులుగా పరిగణించి న్యాయం చేయాలని తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. ఈ విషయంపై విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కోర్టు తీర్పు వివరాలు అందగానే తప్పకుండా అభ్యర్థులకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సివి రమణాచార్యులు, ప్రచార కార్యదర్శి లింగం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com



నవతెలంగాణ-ముషీరాబాద్

సాయిబాబా 40వ సమాధి ఉత్సవాల కార్యక్రమం తాళ్ల బస్తీ, కవాడిగూడ కార్యక్రమంలో పాల్గొని బీఆర్ఎస్ నాయకుడు నాగేష్ ముదిరాజ్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాకులు మహేష్ గౌడ్, శ్రీ సాయి ఫ్రెండ్స్ అసోసియేషన్స్ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా కుమద పంచాయతీ పరిధిలో పండిస్తున్న గంజాయిని, నగరంలో అవసరమైన వారికి విక్రయించేందుకు తీసు కొని వచ్చి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ఎస్ఆర్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6 కిలోల 300 గ్రాములు గంజాయి, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బల్కంపేట సమీపంలోని నేచర్క్యూర్ రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి వ్యాపారం కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ ఇతర సిబ్బంది ఆకస్మికంగా దాడి చేశారు. మాధవర రావు(20), మల్లుల రాకేష్(21)లు ఓ ద్విచక్ర వాహనంతో పట్టుపడ్డారు. నిందితు లను విచారించగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి వ్యాపారంలోకి దిగినట్లు వెల్లడించారు. ఈ సంఘటనలో పరారీలో ఉన్న అలెక్స్, గంజాయి పండిస్తున్న కేశవరావుల కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన నిందితులు మాధవరావు, రాకేష్లను అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇలంబర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి ఇలంబర్తి గురు వారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి నియమించిన విషయం తెలిసిందే. బల్దియాకు కొత్త కమిషనర్‌ను నియమించే వరకు ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. డీవోపీటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం) ఆదేశాలతో ఆమ్రపాలి కాటా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు సర్కారు తాత్కాలిక ఏర్పాటు చేసింది. ఇలంబర్తి గతంలో కొంతకాలం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా పనిచేశారు. బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఇలంబర్తిని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సీసీపీ శ్రీనివాస్, సీసీపీ పీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, రవికిరణ్, వెంకన్న, ఓ.ఎస్.డి వేణుగోపాల్, ఆయా విభాగాల సీనియర్ అధికారులు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

లంబాడీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్



నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 9నెలు గడిచిన గాని ఇంతవరకు మా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం సరికాదని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో మా లంబాడీలు కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర మొత్తంలో 12శాతం మంది గిరిజనులు ఉన్నారని ఇంతవరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించకపోవడం బాధాకరం, త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విస్తరించే క్యాబినెట్‌లో తప్పకుండా మా లంబాడీలకు వెంటనే మంత్రి పదవి ప్రకటించాలని లేని యెడల మా లంబాడీలంతా కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకీ గుణపాఠం చెప్తామన్నారు. మా హక్కుల కొరకు రాష్ట్ర వ్యాప్తంగా తప్పకుండా పోరాటం చేస్తామని తెలిపారు.

మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా సూర్య ధనుంజయ్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జీ వైస్ చాన్సలర్ (వీసీ)గా ప్రొఫెసర్ ధనావత్ సూర్య ధనుంజయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు ఆమెకు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి

- నాలాను పరిశీలించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వరద నీరు సాఫీగా వెళ్లేందు కు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జీహెచ్ఎంసీ అధికా రులను ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, డీసీ మారుతీ దివాకర్, సీపీఎల్ అడిషనల్ డీసీపీ వెంకట్రావ్, ఏసీపీ మురళీధర్‌తో పాటు పలువురు అధికారులతో కలిసి అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తా నుంచి ప్రేమ్ నగర్ గ్రీన్ ల్యాండ్ వరకు గల వరద నీటి కాలువను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నాలాలో వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. పటేల్ నగర్ దేవస్థానం వెనుక ఉన్న వరద కాలువ కు రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు నాలా పూడికతీత పనులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ రూ. కోట్లాది వ్యయం తో అంబర్‌పేట నియోజకవర్గంలోని నాలాలను ఆధునీకరించామన్నారు. దీంతో ఇటీవల అంబర్‌పేటలో రికార్డు స్థాయిలో వర్షం పాతం నమోదైన ఎలాంటి ముంపు సమస్య ఏర్పడలేదన్నారు. ముందస్తు ప్రణాళికతో చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, పి.బ్రహ్మచారి, సంతోషచారి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన కార్మిక సంఘం నేత నిరంజన్ పూలే

నవతెలంగాణ-అంబర్‌పేట



నగరంలో ట్రాఫిక్ సమస్యలపై హైడ్రా దృష్టి



- హైడ్రా, ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో కార్యాచరణ
- ప్రత్యేకంగా సమావేశమైన రెండు విభాగాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ట్రాఫిక్ విభాగంతో కలసి పనిచేయాలని హైడ్రా కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో గురువారం నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ పీ.విశ్వప్రసాద్ సంయుక్తంగా సమీక్షర్వహించారు. ఈ సమావేశానికి హైడ్రా అధికారులు, ట్రాఫిక్ విభాగానికి చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు. హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని ఈ సమీక్షలో చర్చించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు లేని సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులతో కలసి హైడ్రా డీఆర్ఎఫ్ బృందం కలిసి పని చేసేలా పలు దిశానిర్దేశాలు చేశారు. రెండు విభాగాలు కలసి పనిచేయడం, ముఖ్యమైన సమయాల్లో హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా రంగంలోకి దించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్షం పడిన సమయంలో వరద నీరు (వాటర్ లాగింగ్) చేరే ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి నీటిని తొలగించేందుకు డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి ట్రాఫిక్ పోలీసులు కలిసి పనిచేస్తారు. ఇరు శాఖలు గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలవకుండా వెంటనే చర్యలు తీసుకోనున్నారు. వాటర్‌లాగింగ్‌ల వద్ద వెంటనే నీరు తొలిగించేలా హార్స్ పవర్ ఎక్కువ ఉన్న మోటర్ల వినియోగించాలని నిర్ణయించారు. వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, కొత్త లైన్లను వేసి వరదకు శాశ్వత పరిష్కారం చూపేవిధంగా చర్యలు తీసుకోవాలని చర్చించారు. నగరంలో 144 వాటర్ లాగింగ్ పాయింట్లుంటే 65 హైదరాబాద్ పరిధిలోనే ఉన్నాయి, ప్రాధాన్య క్రమంలో ఈ సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరించాలని చర్చించారు. ప్రధాన రహదారులతో పాటు, కాల నీల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి శాశ్వత దుకా ణాలను ఏర్పాటు చేసుకున్నవారిని గుర్తించాలని, వాటిని తొలగించాలని నిర్ణయించారు. ఫుట్‌పాత్‌ల మీద ప్రభుత్వ విభాగాలకు చెందిన (ట్రాన్స్ ఫార్మర్లు, టెలిఫోన్ డక్‌లు, జీహెచ్ ఎంసీ చెత్త డబ్బాలు) లేకుండా ఆయా విభాగాలతో వాటిని తొలగించనున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను, కొమ్మలను గుర్తించి వాటిని తొలగిస్తున్నా రని, ప్రజల భాగస్వామ్యంతో ట్రాఫిక్ ఫ్రీ నగరం తీర్చిదిద్దేంకు కసరత్తు చేస్తున్నారు. నెలకోసారి హైడ్రా - ట్రాఫిక్ విభాగాలు సమావేశమై చేపట్టిన, చేయాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



- ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

వైద్య విద్యను అభ్యసించాలని దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా వైద్య కళాశాలలో చేరిన వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ, చదువుపై దృష్టిని కేంద్రీకరించాలని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి సూచించారు. గురువారం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాలలో 2024-25 బ్యాచ్ నూతన వైద్య విద్యార్థులకు ర్యాగింగ్ పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్రకుమార్, ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య, సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారిలతో కలిసి వైద్య కళాశాల విద్యార్థులతో ర్యాగింగ్ కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఈస్ట్‌జోన్ డిసిపి బాలస్వామి మాట్లాడుతూ.. దేశంలోని పేరు ప్రఖ్యాతలు కలిగిన అత్యుత్తమమైన ఉస్మానియా వైద్య కళాశాలలో చేరిన వైద్య విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉత్తమశ్రేణిలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సీనియర్లమని జూనియర్లను ర్యాగింగ్ చేసినా, తమ దృష్టికి వచ్చినా, ర్యాగింగ్ చేసినట్లు ఎవరైనా ఫిర్యాదు చేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఉస్మానియా వైద్య కళాశాల దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కళాశాల అని, ఈ కళాశాలలో సీటు సాధించిన వైద్య విద్యార్థులు అందరికీ గర్వకారణమన్నారు. కళాశాలలో విద్యతో పాటు మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు, యోగా వంటివి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి ఐదేళ్ల వరకు వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టి పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించి పర్యా వరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ శంకర్, డాక్టర్ నర్సింహ్మాచారి, డాక్టర్ శ్రీధర్ చారి, అన్ని విభాగాధిపతులు, ఎంపీహెచ్‌ఐవో నిరంజన్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాట్ ఉత్తర్వులు యథాతథంగా అమలు చేయాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను, పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను యథాతథంగా అమలు చేయడంతో పాటు క్యాట్ ఆర్డర్ ప్రకారం సర్వీస్ క్రమబద్ధీకరించాలని తపాలాశాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు యర్రంశెట్టి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. విశ్రాంత తపాలా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విశ్రాంత తపాలా ఉద్యోగులు, రిజర్వ్ ట్రెన్డ్ పూల్ స్కీమ్ ఉద్యోగులు గురువారం అబిడ్స్‌లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న నెహ్రూ విగ్రహం వద్ద మండుటెండలో రెండవ రోజు మానవ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాల శాఖ విశ్రాంత ఉద్యోగులు, ఆర్టీపీ ఉద్యోగుల డిమాండ్లు సాధించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. పూల్ స్కీమ్ కింద ఉద్యోగ నియామకాలు చేపట్టారని, నియామకాల అనంతరం అప్పటి తపాలా అధికారులు గంటకు రెండు రూపాయల జీతంతో విధుల్లోకి తీసుకుని 15 రోజుల పాటు శిక్షణనిచ్చి, ఆర్టీపీల నెపంతో అధికార యంత్రాంగం మరో 3 నెలల శిక్షణ ఇచ్చి నియామకాలు చేశారని గుర్తు చేశారు. ఈ క్రమంలో



1986లో నియామకాలు క్రమబద్ధీకరణ చేసి, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు, ఇతర అలవెన్సులు ఇవ్వాలని ఆర్టీపీలు తపాలా అధికారులను కోరుతూ వచ్చినట్లు తెలిపారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఆర్టీపీ ఉద్యోగులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ అధికార యంత్రాంగం అమలు చేయకుండా కాల యాపన చేసి, క్యాట్, కోర్టుల తీర్పులను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. తమ డిమాండ్ల సాధన కోసం మౌన పోరాటం, రిలే నిరాహారదీక్షలు చేపట్టినట్లు యర్రం శెట్టి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ దీక్ష కార్యక్రమంలో జేఏసి ప్రతినిధులు కె.మనోహర్, కెవికె మోహన్, రవి, కృష్ణ, సబ్బు యాదగిరి, శ్రావణ్ కుమార్, ఎలిజబెత్ క్రిస్ట్, శ్రీలక్ష్మి, నళిని, సుబ్బల క్ష్మి, పి. ఉషాలతో పాటు విశ్రాంత తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తాం

- సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ వ్యవస్థాపక అధ్యక్షులు పురుషోత్తం

నవతెలంగాణ-ముషీరాబాద్

నవ సమాజ నిర్మాణ స్థాపనకై బహుజనులకు రాజ్యాధికారం దిశగా అడుగులు ముందుకు వేస్తామని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ వ్యవస్థాపక అధ్యక్షులు పురుషోత్తం అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో నాయకులు ఇంద్రాల శేఖర్ కుమార్ అధ్యక్షతన సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ మొదటి వార్షికోత్సవం సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభలో వ్యవస్థాపక అధ్యక్షులు పురుషోత్తం హాజరై మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణ స్థాపనకై బహుజనులకు రాజాధికారం దిశగా ముందుకు అడుగులేస్తున్న ఏకైక పార్టీ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ అన్నారు. వరకట్నం బాల్యవివాహలలో అత్యాచారాలు అసంఘిక దురాచార్యులకు వ్యతిరేకంగా పోరాటం మహిళల కల్పించబడిన చట్టపర రాజ్యాంగపరమైన హక్కులను అమలు చేయుటకు సామాన్య పేద ప్రజలకు సామాజిక ఆర్థిక రాజకీయ సామాన్యం జరగాలని



కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తారని మా పోరాటంలో ఎనుకకు తిరిగే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ సమావేశంలో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఝాన్సీ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంధం లక్ష్మీ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను ప్రసాద్, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షులు బి.సుజాత రంగారెడ్డి జిల్లా మహిళా సంఘం అధ్యక్షులు వి.నాగేంద్రమ్మ, బాలాపూర్ మండల కార్యదర్శి బి.నవీన్‌కుమార్, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఘనసాల జానకిరామ్, తెలంగాణ రాష్ట్ర ఆఫీస్ బేరర్ పి.జ్యోతి, సూర్యాపేట జిల్లా కార్యదర్శి పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారం కోసం కృషి

వైద్య శాఖలోని వివిధ శాఖల అధికారులను కలిసిన కే.శ్రీనివాసులు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇటీవల జరిగిన ఎన్నికలలో నూతన అధ్యక్షులుగా కే.శ్రీనివాసులు, కార్యదర్శిగా సునీల్ రాజ్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఏ చంద్ర ప్రకాష్, కోశాధికారిగా నామాల శ్రీనివాసులు ను ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, కార్యదర్శి జి.సత్యనారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెడికల్ హెల్త్‌లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మర్యాదపూర్వకంగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వి కర్ణన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, తెలంగాణ వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ వాణిలను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలోని గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారం కోసం అధ్యక్షులు కే. శ్రీనివాసులు నిరంతరం కృషి చేస్తారని అందుకు అధికారులు మానవతా దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్యామ్, వైస్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు, రంగారెడ్డి జిల్లా అధ్య క్షులు రామారావు, వైద్య ఆరోగ్యశాఖలో వివిధ హెూదా లలో పనిచేస్తున్న గజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

'18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్'

అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ అధ్యక్షులు డాక్టర్ కత్తుల సతీష్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలో క్యాన్సర్ వ్యాప్తిని, గుండె పోటు వ్యాధులను తగ్గించే లక్ష్యంతో ఈ నెల 18, 19, 20వ తేదీల్లో న్యూ ఢిల్లీలోని లీ మెరీడియన్ హెూట ల్‌లో '18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ అధ్యక్షులు డాక్టర్ కత్తుల సతీష్ తెలిపారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ హెల్త్ సమ్మిట్ కు ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాలను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ వైద్య విభాగాల్లో నిష్ణాతులైన భారతీయ వైద్య నిపుణులు, వైద్య పరిశోధకులు, వందలాది మంది వైద్య విద్యార్థులు హాజరవుతున్నార న్నారు. ఈ సమ్మిట్‌లో ప్రధానంగా అనేక మంది పరిశోధకులు దేశంలో క్యాన్సర్, గుండె పోటు జబ్బులపై జన్యుపరమైన అంశాలు, వాతావరణ పరిస్థితులు ఎలాంటి ప్రభావాన్ని చూపుతున్నాయన్నా విషయమై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తున్నారన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజల జీవనశైలికి అనుగుణంగా ప్రభుత్వాలు విధాన నిర్ణయాలను తీసుకోవడం, కార్య క్రమాలను అమలు చేయడంతో వ్యాధి నిరోధక చర్యలు సత్ఫలితాలను సాధిస్తాయన్నారు. ఈ సమ్మిట్ ద్వారా అనేక సంస్థల భాగస్వామ్యంతో కమ్యూనిటీ పరంగా సరైన ఆరోగ్య చైతన్యాన్ని తీసుకువచ్చేలా కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

జీఓ 29 రద్దుచేసి గ్రూప్ 1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలి

- దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొ. గాలి వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణలో 7 శాతం జనాభా లేని అగ్రవర్ణాలకు 50 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తూ 93 శాతం జనాభా కలిగిన బహుజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్న జీఓ 29 వెంటనే రద్దు చేసి జీఓ 55 ప్రకారం రిజర్వేషన్స్ రీ షెడ్యూల్ చేసి గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా గురువారం గ్రూప్ 1 నిరుద్యోగులు నిర్వహించిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. 30 లక్షల నిరుద్యోగుల సహకారంతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీఓ 29 తెచ్చి బహుజన నిరుద్యోగులను మోసం చేసిందని, 14 కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా గత ప్రభుత్వం లో జరిగిన అన్ని పరీక్షలు రద్దు చేసి కేవలం గ్రూప్ 1 నోటిఫికేషన్ 63 పోస్టులు కలిపి రీ షెడ్యూల్ చేసి జీఓ 29 తెచ్చి బీసీ ఎస్సీ ఎస్టీ నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనపరిషత్ నాయకుడు విజయరాజ్, గ్రూప్ 1 అభ్యర్థులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మికత ముసుగులో చిన్నారులపై లైంగిక వేధింపులు'

- ఇషా ఫౌండేషన్, ఎడ్యుకేషన్ పేరుతో దారుణాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి
- మాజీ అధ్యాపకురాలు యామిని రాగిణి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఇషా ఫౌండేషన్ ఆధ్యాత్మికత ముసుగులో చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడే వారి పెంపకానికి కేంద్రంగా నిలుస్తోందని మాజీ అధ్యాపకురాలు యామిని రాగిణి, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రాంతీయ కమిటీ సభ్యులు సత్య సరేందర్ ఆరోపించారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఇషా ఆశ్రమ నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇషా ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, ఇషా విద్య, సంస్కృతి, హెూమ్ స్కూల్ పేర్లతో 8,000 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. బాలికలపై జరిగే నేరాలకు ఇషా ఫౌండేషన్, ఇషా ఎడ్యుకేషన్ మేనేజ్మెంట్, ట్రస్టీలు, ముఖ్యంగా వ్యవస్థాపకులు జగ్గీ వాసుదేవ్ (సద్గురు) బాధ్యత వహిస్తారా అని వారు ప్రశ్నించారు. ఇషా సెంటర్‌లో విద్య కార్యక్రమాల పేరుతో ఇషా సంస్కృతికి చెందిన బాలికలను అర్ధనగ్నంగా ఆధ్యాత్మిక దీక్షలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో 8 ఏండ్ల బాలికపై పలుమార్లు అత్యాచారం జరిగిన ఆ విషయం బయటకు రాకుండా మౌనం వహించారని విమర్శించారు. 13 ఏండ్ల బాలుడిని 3 ఏండ్ల పాటు వేధించారన్నారు. ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకులైన జగ్గీ వాసుదేవ్ (సద్గురు) తాను సాక్షాత్కరమైన ఆత్మ అని, కరుణతో నిండుంటారని, కానీ ఇషా సంస్కృతి, హెూమ్ స్కూల్ విద్యార్థులపై జరుగుతున్న అకృత్యాలపై ఎన్నడూ ఆయన నోరు విప్పడం లేదని ఆరోపించారు. 12వ తరగతి చదువుతున్న 16 ఏండ్ల బాలుడి మరణం (జూన్ 21, 2024, అంతర్జాతీయ యోగా దినోత్సవం) నాడు యజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర విద్యా బోర్డులు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించకుండా మానవ సంక్షేమం ముసుగులో ఇషా ఫౌండేషన్, ఎడ్యుకేషన్ చేస్తున్న ఈ దురాగతాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ-మలక్‌పేట్

అంగన్ వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే బలాల అన్నారు.చంచల్ గూడ లోని పిల్లిగుడిసెలులో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులకు అందించే పోషక ఆహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. మలక్ పేట్ నియోజక వర్గ పరిధిలో, జీహెచ్ఎంసీ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగతగతిగా పూర్తి చేయాలని ఆదేశించారు.అభివద్ధి చేయవలసిన రహదారులను గుర్తించి వాటికి అంచనాలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్, అధికారులు కాలని వాసులు పాల్గొన్నారు.



బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ లో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి ఉద్యోగ నగర్ కాలనీ, అన్నపూర్ణ నగర్ కాలనీలో ఐమాక్స్ లైట్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్లు కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బడంగ్‌పేట్



ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు
- మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే.. దాని పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు తెలిపారు. వచ్చేనెల 5న ఇందిరా పార్కు వద్ద ఆటో సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరగనున్న మహా ధర్నా పోస్టర్‌ను గురువారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జేఏసీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ఒత్తిడి చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్, టీఏడీఎస్ ప్రధాన కార్యదర్శి ఏ. సత్తిరెడ్డి, ఉపాధ్యక్షులు శాతం రమేష్, హైమద్, రామకృష్ణ, పరుశరాములు పెద్దిరాజు ప్రదీప్, శ్రీనివాసు బషీర్, ప్రశాంత్ బాబు, శ్రీరామ్ కిషన్, ఆటో యూనియన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పరిశీలిన



నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్. బి. నగర్ నుండి మల్కాపూర్ వరకు జరుగుతున్న జాతీయ రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డిలు హయత్ నగర్ పుల్ల రెడ్డి స్వీట్ హౌస్, టేస్టీ బేకరి వద్ద ట్రాఫిక్ పోలీస్ డీసీపీ శ్రీనివాసులు సంబంధిత పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి గురువారం హయత్ నగర్ జాతీయ రహదారిని పరిశీలించారు. రోడ్ విస్తరణ పనుల్లో హయత్ నగర్ పోలీస్ స్టేషన్ నుంచి ఆటో నగర్ వరకు ఉన్న యూ టర్న్ లు అన్ని మూసి వేయడంతో ప్రజల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాకుండా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా హయత్ నగర్ లోని ఆర్టీసీ కాలనీ పలు చోట్లో బై పాస్ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించి నిలిపివేయడంతో, అటు యూ టర్న్ లు కూడా సమీపంలో లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు వివరించారు.కావున సంబంధిత జాతీయ రోడ్డు విస్తరణ అధికారులతో సమీక్షించి వీలైనంత త్వరగా ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ లు గట్టు మల్లు,శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్ సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బండ్లగుడ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నవతెలంగాణ-చంపాపేట్

చాంద్రయాన్ గుట్ట డివిజన్ పరిధిలో బండ్ల గుడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీ సష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ లక్ష్మణ్, సిఐ శ్రీను నాయక్, ఎస్సై రాంబాబు, అక్బర్ షరీఫ్ ఆదేశం అనుసారంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆర్ ఎస్ ఐ యస్. రాఘవేందర్ హెచ్చరించారు. ఈ డ్రైవ్ లో 40 ఫోర్ వీలర్ వాహ నాలు, 30 ద్విచక్ర వాహనాలు,40 ఆటోల పై చలా ను విధించినట్లు తెలిపారు. రోడ్డుపైనే ఇరువైపుల వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సష్టిస్తున్నారని, అదే విధంగా పండ్ల బండ్లు వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. దీనిపై కూడ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్సు, హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్ ప్రతి సంవత్సరం విధిగా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. మద్యం సేవించి సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ ఎట్టి పరిస్థితులు చేయకూడదని అన్నారు.ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్లయితే వాహన యజమాని పై మోటార్ వెహికల్ యాక్ట్ 129 (2) రూ. 2 వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. ఒకవేళ బాలురకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులతో పాటు వారికి వాహనాలు ఇచ్చిన యజమానులను కౌన్సిలింగ్ హాజరు కావాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఆ తర్వాత న్యాయస్థానం ముందు హాజరై జరిమానా కూడా చెల్లించాలన్నారు. దాడులు కొనసాగిస్తామని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సులు ఇతర పత్రాలు లేని పలువురు వాహనాలపై కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ పోలీస్ మల్లయ్య, శివకుమార్, సురేందర్, లింగారెడ్డి, రమేష్, వెంకటయ్య, రాజా వర్ధన్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరం



నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

- కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యా విజయేందర్ రెడ్డి

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఎంతో మది పేదలకు ఉపయోగకరమని కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యా విజయేందర్ రెడ్డి అన్నారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో నీ సాయి నగర్ కాలనీకి చెందిన కుక్కునూరు కష్టారెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన రూ. 18,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలి



- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఇన్‌స్పెక్టర్ సుధాకర్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సమాజంలో ప్రజలందరూ కలసి మెలసి జీవించాలని, కొందరు రౌడీ షిటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో జీవించాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ హెచ్చరించారు. గురువారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ కౌన్సలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ కలిసి మెలసి జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూగర్బ డ్రయినేజీ పైప్ లైన్ పనులకు నిధులు ఇవ్వండి

- కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యన్.రెడ్డి డివిజన్ పరిధిలోని శివారు కాలనీ ప్రాంతాల్లో ఉన్న అన్ని కాలనీలలో నూతన భూగర్బ డ్రయి నేజీ పైప్ లైన్ కోసం నిధులు మంజూరు చేయాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కలిసి వినతపత్రం ఇచ్చారు. ఈ సంధ్బంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శివారు కాలనీలలో ప్రజలు భూగర్బ డ్రయినేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి నెలా సెప్టిక్ ట్యాంకుల పరిశుభ్రం కోసం 3000 నుంచి 4000 రూపాయల వరకు ఖర్చు వస్తున్నదని, సామాన్య ప్రజలు శుభ్రం చేయించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నార న్నారు. కాలనీలోనీ ప్రజలు ఇండ్లు నిర్మించుకునే సమయం లో పర్మిషన్ల కోసం, టాక్స్‌ల రూపంలో లక్షల రూపాయలు కడుతున్నారని, కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అందులో భాగంగా భూగర్బ డ్రయినేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కోరారు.

హెూమియోపతి హాస్పిటల్‌ను శుభ్రం చేయించిన కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ హెూమియోపతి హాస్పిటల్‌లో చెత్తా చెదారాలు, చెట్ల కొమ్మలు ఎక్కడికక్కడ పేరుకుపోయి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డికి ఆస్పత్రి డాక్టర్ నర్మద సమాచారం ఇచ్చారు. స్పందించిన కార్పొరేటర్ హెూమియోపతి హాస్పటల్‌ను సందర్శించి వెంటనే సంబంధిత సిబ్బందితో శుభ్రం చేయించారు. తర చూ శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి పవన్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ యదయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి, ఫార్మాసిస్ట్ రమేష్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో విద్యార్థులకు పతకాలు



నవతెలంగాణ-మలక్‌పేట్

జిల్లా స్థాయిలో జరుగుతున్న పాఠశాల పరిధిలోని అండర్ 17 విభాగంలో జిమ్నాస్టిక్ పోటీల్లో హనుమాన్ వ్యాయామశాల పాఠశాల కు చెందిన విద్యార్థులు కావలి పూజిత బంగారు పతకం, కావలి రణదీప్ వెండి పతకం సాధించినట్టు హైదరాబాద్ జిల్లా స్థాయి పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్ గురువారం తెలిపారు.పాఠశాల స్థాయి లో సోదరి,సోదరుడు ఇద్దరు కలసి ప్రతిభ చూపుతుండటం విశేషమని శిక్షకుడు చంద్రకాంత్ పేర్కొన్నారు. ఎంతో ఉత్కంఠ పోరులో పతకాలు సాధించటం అభినందనీయం అని చెప్పారు

ఘనంగా దసరా మిలన్ ఉత్సవాలు



నవతెలంగాణ-వనస్థలిపురం

ఆర్కే పురం వాసవి కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో వాసవి కాలనీ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో దసరా మిలన్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను సీనియర్ సిటిజన్స్ మహిళలు, పురుషులు అనే బేధం లేకుండా ఎంతో ఉత్సవ బరితంగా నిర్వహించుకున్నారు. ఆట, పాటలతో ఎంతో ఆనందంగా తమ వయసులను మరచిపోయి కేరింతలు వేసుకుంటూ గడిపారు. వివిధ రకాలైన తంబోలా, దాండియా మొదలగు ఆటలను ఆడుకున్నారు. వివిధ ఆటలలో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. ప్రతి ఒక్కరూ దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బి దామోదర్, కార్యదర్శి రామకష్ణ, అష్టలక్ష్మి కోశాధికారి అంజయ్య, రామస్వామి, పోలిశెట్టి రమేష్, ఆనందం, కిష్టయ్య, సుధాకర్, హేమలత ధనుంజ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

'అనధికార ఆటో స్టాండ్‌ను తొలగించండి'



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని సుష్మా థియేటర్ చౌరస్తా వద్ద అనధికార ఆటో స్టాండ్ ను తొలగించాలని క్రాంతి హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనస్థలిపురం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లుకి గురువారం వినతి పత్రం అందజేశారు. "క్రాంతి హిల్స్ కాలనీకి విజయవాడ నేషనల్ హైవే నుంచి రెండు ప్రధాన రోడ్లు ఉన్నవి. ఒకటి సుష్మ థియేటర్ నుండి, డి మార్ట్ పక్క నుండి మరొక రహదారి ఉన్నవి. సుష్మా థియేటర్ గేటు ముందు అనధికారికంగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకొని ఆటోలను నింపుతున్నారు. డి మార్ట్ పక్క సందులో వాహనాలను పార్కు చేస్తున్నారు. వీటి వలన క్రాంతి హిల్స్ కాలనీకి పోవాలంటే వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అనధికారికంగా పార్కు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలి" అని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బద్దం రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే సత్తిరెడ్డి, కోశాధికారి మనోహర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ-నాగోల్.

అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని ఆకలితో అలమటించే అనార్థులకు అన్నం పెట్టేందుకు ముందుకు రావాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్, ఆర్యవైశ్య సంఘం ఆడిక్‌మెట్ బౌద్ధనగర్ సంయుక్త ఆధ్వర్యంలో బాపూజీ నగర్ ,పద్మారావు నగర్ సికింద్రాబాద్‌లలో ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడు బేల్దే రవి కుమార్ గుప్త ఆధ్వర్యంలో జరిగిన పౌర్ణమి అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐవీఎఫ్ సికింద్రబాద్ జోన్ ప్రధాన కార్యదర్శి తిరువిది ప్రభాకర్ గుప్త, కోశాధికారీ గుండా శ్రీనివాస్ గుప్త ప్రధాన కార్యదర్శి బూశెట్టి శ్రీనివాస్ గుప్త , ఏవీఎస్ ఆడిట్మెంట్ బోర్డ్ నగర్ కునిశెట్టి వెంకటేశ్వర రావు బాబు, ప్రాజెక్ట్ చైర్మన్ ఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



నవతెలంగాణ-పెద్ద అంబర్పేట్

పెద్ద అంబర్‌పేట్ పురపాలక సంఘ కార్యాలయము నందు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు చైర్ పర్సన్ పండుగల జయశ్రీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. రవీందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు పసుల రాజేందర్ , తొండపు రోహిణి రెడ్డి , మండల కొటేశ్వర్ రావు, అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న ప్రవాస నర్తకి విశిష్ట భరతనాట్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ యువ నృత్య కళాకారిణి విశిష్ఠ డింగరి భరతనాట్య ప్రదర్శనతో నృత్యార్పణం చేయనున్నారు. ముంబయికి చెందిన నృత్యోదయ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 19న సాయంత్రం 5 గంటలకు గచ్చిబౌలి లోని బ్రహ్మ కుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో విశిష్ఠ నృత్య ప్రదర్శన జరుగుతుందని ముంబయి నుంచి విచ్చేసిన ప్రఖ్యాత భరత నాట్య గురు డా. జయశ్రీ రాజగోపాలన్ గురువారం తెలిపారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ జీయరు స్వామి, ప్రముఖ నాట్య గురువు పద్మ విభూషణ్ డా. పద్మా సుబ్రహ్మ ణ్యం (చెన్నై), సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణ, కళారత్న అశోక్ గుర్జాలే తదితరులు పాల్గొంటారు. విశిష్ఠ డింగరి అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసి కాలిఫోర్నియాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరో వైపు గత 15 ఏండ్లుగా భరతనాట్యం, కూచిపూడి నృత్యం నేర్చుకుంటూ ప్రదర్శనలు ఇస్తూ మంచి నర్తకిగా గుర్తింపు పొందారు. నాట్య గురు డాక్టర్ జయశ్రీ రాజగోపాల్ శిష్యరికంలో భరత నాట్యంలో నృత్య విశారద పూర్తి చేసి ప్రస్తుతం నృత్త కరణాల ప్రధానమైన నృత్య శాలి కోర్సులో ఉన్నారు. ఆమె మంచి ఆల్ రౌండర్. డా. ఉమా రామారావు దగ్గర కూచిపూడి నాట్యం నేర్చుకున్నారు. చెన్నై శాస్త్ర యూనివర్సిటీ నుంచి డా.పద్మా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భరతనాట్యం ఫైనార్ట్స్ పూర్తి చేశారు. హైదరాబాద్ లో బి. టెక్ పూర్తయ్యాక అమెరికా బోస్టన్ యూనివర్సిటీ నుంచి కమ్యూనికేషన్ అండ్ అడ్వర్టైజింగ్ లో ఎం. ఎస్. చేశారు. ఆమె అంతర్జాతీయ స్విమ్మర్. అరేబియా మహా సముద్రంలో అనేక సార్లు ఈత పోటీల్లో పాల్గొని మెడల్స్ కైవసం చేసుకుని ఛాంపియన్ గా నిలిచారు. జాతీయ స్థాయి పోలో క్రీడాకారిణిగా మన్ననలందుకున్నారు. మరోవైపు కరాటేలో కొరియా నుంచి నాలుగు సార్లు బ్లాక్ బెల్ట్ సాధించి రికార్డు సృష్టించారు. భవిష్యత్ లో భారతీయ జ్ఞాన పరంపరను కొనసాగిస్తూ ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు విశిష్ఠ డింగరి తెలిపారు.

రూ. కోట్లాది విలువ చేసే పార్కు స్థలాలు కబ్జా



- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- బీజేపీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ పార్కు స్థలాలను, ఓపెన్ ల్యాండ్స్ ఆక్రమణకు గురవుతున్నా మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ప్రతినిధులు, అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆరోపించారు.గురువారం నాదర్ గుల్ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలో ప్రభుత్వ పార్కులను, ఓపెన్ స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమించుకొని కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దోచుకోవటం జరుగుతున్నదని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్, సీడీఎంఏ,మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్,స్థానిక మేయర్ పారిజాత నర్సింహారెడ్డికి పిర్యాదు చేసినా కనీసం విచారణ జరిపించడం లేదనిమండి పడ్డారు.ముఖ్యంగా మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 31వ డివిజన్ పరిధిలో ఉన్న పార్కులను,ఓపెన్ స్థలాలను అన్యాక్రాంతం అవుతున్నా రక్షించవలసిన మేయర్,కమిషనర్ భూ కబ్జాదారులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబర్ 731,748,749 లో పార్కు స్థలాలను,ఓపెన్ ల్యాండ్స్ ను అక్రమంగా ఆక్రమించుకొని చంపాపేట్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గత రెండు నెలలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవటం జరిగిందన్నారు. 4ప్లాట్లను రిసెల్ చేయటం జరిగిందని,అదే విధంగా గత నెలలో రాజీవ్ కుమార్ గుప్తా పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ డ్యాకుమెంట్లను రాజు హౌజింగ్ కార్పొరేషన్ సొసైటీలో కుదువ పెట్టి డబ్బులు తీసుకోవటం జరిగిందని ఆరోపించారు. దీనికి పూర్తిగా షాడో మేయర్ కనుసన్నల్లోనే ఈ వ్యవహారం అంతా నడుస్తున్నట్టు ఆరోపించారు. మేయర్,కమిషనర్,ప్రజా ప్రతినిధులు,స్థానిక కాలనీల అధ్యక్షులు కలసి అక్రమ ప్లేట్లను సెటిల్ మెంట్ చేయటం జరిగిందన్నారు.గతంలో మున్సిపల్ అధికారులు ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన బోర్డులను సైతం కొందరు తొలగించి కబ్జాకు పాలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మేయర్ స్పందించి విచారణ జరిపించాలని లేని పక్షంలో రానున్న కాలంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించటం జరిగిందని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపీటీసీలు ఏనుగు రాంరెడ్డి, తరై మల్లేష్, సీనియర్ నాయకులు కళ్లెం లక్ష్మారెడ్డి, నాయకులు మోతిలాల్ నాయక్,శివరాంరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవా ఊరేగింపులో అందెల శ్రీరాములు..



నవతెలంగాణ-బడంగ్ పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ లోని సాయిరాం నగర్ కాలనీ ఫేస్ 1లో గురువారం కాలనీ అధ్యక్షులు రాకేష్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారి సేవా ఊరేగింపులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జీ అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ ఇటీవల సికింద్రాబాద్ లో ముత్యాలమ్మ అమ్మవారి విగ్ర హాన్ని ధ్వంసం చేసిన సంఘటన యావత్ హిందూ సమా జాన్ని కలిచివేసిందని, ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం ఒక వర్గానికి కొమ్ము కాస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.హిందువులంతా సంఘటితం కావలసిన సమయం ఆసన్నమైందని, అమ్మవారికి శాంతి జరిగేలా ఈ శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా అమ్మవారి ఆలయా లలో ఆడపడుచులు, అన్నదమ్ములు హిందూ బంధువులు అందరూ కలిసి మహా శాంతి హారతి నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, ప్రధాన పూజారి నరసింహ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

హర్యానాల ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు,బాలాపూర్ సహకార సంఘం బ్యాంకు మాజీ చైర్మెన్ కొలన్ శంకర్ రెడ్డి గురువారం హర్యానాలో వారిని మర్యాద పూర్వకంగా కలసి పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి బొకేను అందచేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



ఆకట్టుకున్న జిల్లా స్థాయి కళా ఉత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా స్థాయి కళా ఉత్సవం ఎదులాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఫైన్ ఆర్ట్స్ ఆవరణలో గురువారం విజయవంతంగా జరిగింది. జిల్లాలోని మండలాల నుంచి వచ్చిన డాన్స్, వోకల్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, థియేటర్ డ్రామా, విజువల్ ఆర్ట్స్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ అంశాలలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థులలో కళల పట్ల ఆసక్తి చాలా అద్భుతంగా ఉన్నదని, వాళ్ల ప్రదర్శన చాలా బాగున్నదని, విద్యార్థులకు ఈ కళల పట్ల శిక్షణ అనేది ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు చొరవ తీసుకొని నేర్పిస్తే వారి భావి జీవితం అద్భుతంగా ఉంటుందని తెలిపారు. అనంతరం విజేతలకు మొమెంటును, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రవీందర్ రాజు, మండల విద్యాధికారి శ్రీధర్, మండల నోడల్ అధికారి పాపిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాములు, రాధా, పద్మజ, హేమలత, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మధులత, వైస్ ప్రిన్సిపాల్ రాములు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్రో పోలీస్ హొటల్ సీజ్



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్‌లో గుడిలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన ప్రధాన నిందితుడు సలీం సహా మరో 140 మంది బసచేసిన మెట్రో పోలీస్ హొటల్‌ను గోపాలపురం పోలీసులు, సికింద్రాబాద్ రెవెన్యూ అధికారులు ఖాళీ చేయించారు. పోలీసుల సహకారంతో సికింద్రాబాద్ మండల తాసిల్దార్ పాండు నాయక్ తన సిబ్బందితో హొటల్లో అన్ని గదులను తనిఖీలు చేసి హొటల్‌కు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా పాండు నాయక్ మాట్లాడుతూ హొటల్ లో స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్మెంట్ పేరుతో వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లుగా మోటివేషనల్ స్పీకర్ మునవర్ జమ హొటల్లో 49 గదులు బుక్ చేసుకుని వివిధ రాష్ట్రాలకు చెందిన 140 మందికి తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మోటివేషనల్ స్పీకర్ ఉన్నవారు జమా రెచ్చగొట్టే ప్రసంగాల వల్ల ఆలయంలో సలీం దాడికి పాల్పడి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడని పోలీసులు గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. దాడికి పాల్పడిన సలీం ఈ హొటల్ లోనే జరుగుతున్న సమావేశానికి హాజరయ్యాడని పెద్ద ఎత్తున సమావేశం జరిగిన కనీసం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వలేదని, ముందస్తు అనుమతి కూడా తీసుకోలేదని దీంతో హొటల్ ను సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. హొటల్లో మొత్తం 125 గదులు ఉండగా అందులో మునవర్ జమా 49 గదులు అద్దెకు తీసుకున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. హొటల్ కు నాలుగు వైపులా ఉన్న ద్వారాలను లాక్ చేసి సీజ్ చేసి సీలు వేసినట్లు దీనికి సంబంధించిన పూర్తి నివేదికను పోలీసు ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

మునవర్ జమా కోసం పోలీసుల గాలింపు..

పర్సనాలిటీ డెవలప్మెంట్ పేరుతో వర్క్ షాప్ నిర్వహిస్తూ ఒక వర్గానికి చెందిన వారిని తన ప్రసంగాలతో రెచ్చగొట్టి దాడుల ఉసిగొలుపుతున్న ఇంగ్లీష్ అకాడమీ నిర్వాహకుడు జమ అరెస్టు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన జరిగిన రోజే విషయం తెలుసుకున్న నిర్వాహకుల తోపాటు వర్క్ షాప్ హాజరైన వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 140 మంది హొటల్ ఖాళీ చేసి పరారయ్యారు. హొటల్లో బసచేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన 140 మంది వివరాలను సేకరిస్తు న్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా ఎలాంటి అనుమతులు తీసుకో కుండా మతపరమైన వర్క్ షాపులకు హొటల్ గదులను కేటాయిం చిన మెట్రో పోలీస్ హొటల్ యజమాని అబ్దుల్ రషీద్, హొటల్ మేనేజర్ రెహమాన్‌ల పై కేసు నమోదు చేసినట్లు గోపాలపురం పోలీసులు వెల్లడిం చారు. కోర్టు అనుమతితో వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మాంసం వ్యర్థాలను ఇష్టానుసారంగా పడవేయవద్దు



- జూబ్లీహిల్స్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి
- చికెన్ -మాంసం వ్యాపారస్తులతో ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మాంసం వ్యర్థాలను ఇష్టానుసారంగా, ఎక్కడ పడితే అక్కడ పడేయ వద్దని, బాధ్యతగా పెద్ద కవర్లలో వేసుకుని కృష్ణకాంత్ పార్క్ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో వేసి రావాలని, లేదా చెత్త ఆటోలకు స్వయంగా ఇవ్వాలని సూచిస్తూ గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాంసం, చికెన్ వ్యాపారస్తులతో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వ్యాపారస్తులకు కొన్ని ముఖ్యమైన సూచనలు తెలియపరిచారు. మీరు మీ దుకాణంలోని మాంసం వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తే, కుక్కలు, లేదా పిల్లులు వాటిని తీసుకొని వెళ్లి.. మసీదులలో లేదా హిందూ మంది రాలలో క్రైస్తవ మందిరాలలో వేసే అవకాశం ఉంటుందని, దానివలన హిందూ, ముస్లిం ఘర్షణలకు దారితీస్తుందన్నారు. తర్వాత మేము సీసీ కెమెరాలు పరిశీలిస్తే కుక్కలు- పిల్లులు మందిరాలలో వేసిన ట్లు రుజువు అవుతుందని, గొడవలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు మాంసం వ్యర్థాలను బాధ్యతగా చెత్త ఆటోలకు అప్పచెప్పాలన్నారు. లేదా మీరే స్వయంగా డంపింగ్ యార్డ్ వరకు వెళ్లి వేసి రావాలని వ్యాపారస్తులను హెచ్చరించారు. ఇటీవల సిటీలో జరిగిన గొడవలు దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామని వ్యాపారస్తులను తెలియజేశారు. అదే విధంగా షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశానికి మాంసం, చికెన్ విక్రయదారులు అందరూ హాజరైనందుకు వారిని అభినందించారు తప్పకుండా పోలీస్ వారి సూచనలు పాటిస్తామని వ్యాపారస్తులు పోలీస్ అధికారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, అడ్మిన్ సబ్ ఇన్‌స్పెక్టర్ హరీశ్వర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, విజయవాడ
I.A.No. 737 OF 2023 IN A.S.No OF 2024

Between:
M/S. లీల ట్రైర్స్ తరఫున మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి లలితా మురళీధరన్ మరియు ఇతరులు ...వాదులు
AND
అడుసుమిల్లి శేషగిరి రావు మరియు ఇతరులు ...ప్రతివాదులు
1. అడుసుమిల్లి శేషగిరి రావు, తండ్రి సత్యనారాయణ, వయసు: 80 సం॥లు, చిరునామా: 21-ఎ.డబ్ల్యు.హెచ్.ఓ. సెక్టార్ బి, గౌతమ్ ఎన్క్లేవ్, Sick గ్రామం, సికింద్రాబాద్-9. (ప్రతి వాది నెం.1)
2. అడుసుమిల్లి త్రిపుర సుందరి దేవి, భర్త: శేషగిరి రావు, వయసు: 73 సం॥లు 21-ఎ.డబ్ల్యు.హెచ్.ఓ. సెక్టార్ బి, గౌతమ్ ఎన్క్లేవ్, Sick గ్రామం, సికింద్రాబాద్-9. (ప్రతి వాది నెం.2)

మీరు పై పిటిషన్‌లో ప్రతివాదుల అయి ఉన్నారు పై దావా మీ హాజరు కొరకై 28-10-2024వ తేదీన వాయిదా అయి ఉన్నది. ది. 28-10-2024 న మీరు స్వయముగా కానీ లేదా న్యాయవాది గారి ద్వారా కానీ ఉదయం 10. గంటల 30 నిమిషములకు మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, విజయవాడ నందు హాజరు కావలయును లేని యెడల, పై పిటిషనకు మీ పరోక్షములో తీర్మానం చేయబడును. ఈ నోటీసు మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి, విజయవాడ వారి ఉత్తరుల ప్రకారం జారీ చేయటమైనది.
వాయిదా తేది. 28-10-2024
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
సుంకర రాజేంద్ర ప్రసాద్
న్యాయవాది
ఫోన్: 9848127375
విజయవాడ
17-10-2024

పేద విద్యార్థులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉప్పల్

ఉన్నత చదువు చదివే పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిల్కానగర్ డివి జన్ మల్లికార్జున్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న యాదమ్మ ఈదయ్యలకు మార్తె వీ.నందిని నీట్ ఎంట్రెన్స్‌లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందారు. నందినికి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత విషయాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం వారు నందిని ఇంటికి వెళ్లి ఎంబీబీఎస్ పూర్త య్యేవరకు ఐదేండ్ల వరకు ప్రతి ఏడాది ఫీజు రూ.29 వేల చొప్పున ప్రతి ఏడాది తానే అందజేస్తానని హామీ ఇచ్చారు. మొదటి ఏడాదికి అయ్యే ఫీజు రూ.29 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, నాయకులు మల్లికార్జున్, నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులున్నారు.

అభివృద్ధి పనులను మొదలు పెట్టాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని పాత శాంక్షన్‌లు, కొత్త శాంక్షన్స్‌ను రెండు సంవత్సరాల క్రితం నిధులు కేటాయించిన నెహ్రూనగర్, మారుతీ నగర్, షఫీ నగర్, షాదుల్లా నగర్, పలు కాలనీలలో సీసీ రోడ్ల పనులు మొదలు పెట్టాలని గురువారం జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ, డీఈ, ఈఈలను జీహెచ్ఎంసీ కార్యాలయంలో కలిసి కార్పొరేటర్ సునీత శేఖర్‌యాదవ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ షాదుల్లా నగర్‌లో సీసీ రోడ్డు మొదలు పెట్టాలని ఏఈ మధిరిమను లేఖ ద్వారా కోరామని తెలిపారు. మూడు నెలల క్రితం విగ్నేశ్వర కాలనీ, ద్వారకామాయి కాలనీ, గాయత్రి నగర్, ఆర్ కే హెచ్ కాలనీలలో జోనల్ కమిషనర్ రవి కిరణ్ సాంక్షన్ ఇచ్చిన, పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించామని చెప్పారు.

పటేల్ కుంట చెరువు పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

నాచారంలోని పటేల్ కుంట వద్ద రూ.కోటి 80 లక్షల వ్యయంతో నిర్మించిన సివరేజ్ డైవర్షన్ పెపులైన్ పనులు పూర్తి కావడంతో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన శేఖర్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణతో కలిసి పటేల్ కుంట చెరువును గురువారం పరిశీలించారు. తక్షణమే సివరేజ్ డైవర్షన్ పైప్ లైన్‌ను వాడుకలోకి తేవాలని ఆదేశించారు. అలాగే చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించేందుకు ఎఫ్‌టీసీ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎరుకల బస్తీలో చెరువుకు ఆనుకొని నిర్మించుకున్న ఇండ్ల ప్రజలు హైడ్రా వల్ల తమ ఇండ్లు పోతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తే వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, నాయకులు సాయి జన్ శేఖర్, ఇరిగేషన్ అధికారులు డీఈ నరేందర్, ఏఈఈ సుధీర్, తదితరులున్నారు.

కాప్రా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



- జర్నలిజం విలువలకు కట్టుబడి ఉండాలి
- మోతె వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు క్లబ్‌లో ఉన్న మెజారిటీ సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో ఎన్నికల అధికారి మోతె వెంకట్‌రెడ్డి కమిటీ సభ్యులను ప్రకటించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వల్లోజు శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బి. విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వేముల శంకర్, ఉపాధ్యక్షులుగా ఆదిమూలం శ్రీనివాస్, ఎండీ అక్బర్, ఏ. నటరాజ్, జి.గోపాల్ గౌడ్ కోశాధికారిగా రుద్రగోని నర్సింగ్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా బసంత్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, సురేష్, ప్రశాంత్, కార్యనిర్వహక కార్యదర్శులుగా వెంకట్, చుక్కా రమేష్, కార్యవర్గ సభ్యులుగా రవి కిరణ్, దిలీప్, విజయ్, ప్రధాన సలహాదారుడిగా మోతె వెంకటరెడ్డి, సలహాదారులుగా మెరుగు చంద్రమోహన్, టి.మల్కయ్య జి. చంద్రమౌళి, జ్యోతిర్మయి చారి, సహదేవ చారి, కేసీ మోహన్, శ్రీనివాసరావు, కడియాల రమేష్ సత్యనారాయణ, శనిగరం అశోక్, సీర శ్రీనివాస్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జర్నలిస్ట్ మిత్రులందరూ జర్నలిజం విలువలకు కట్టుబడి పనిచేయాలని మోతె వెంకట్ రెడ్డి సూచించారు. అందరూ ఏకతాటిపై ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందన్నారు.

మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఈగ శ్వేతా రాజు ముదిరాజ్



- నియామక పత్రం అందజేసిన తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ - జవహర్‌నగర్

మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, వేణుగోపాల్ నియామకం అయ్యారు. వారికి కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ గురువారం నియమాక పత్రాలను అందజేశారు. మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీకి నూతనంగా నియమితులైన చైర్మెన్ బొమ్మలపల్లి నరసింహ యాదవ్ ప్రమాణ స్వీకారానికి ముఖ్యతిథిగా హాజరైన వజ్రేష్ యాదవ్ డైరెక్టర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు రామారావు, కౌన్సిలర్ గోగుల సరిత వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణ కృషి అభినందనీయం

- నాగారం సెరినిటి పాఠశాల కరెస్పాండెంట్ జంగిరెడ్డి



నవతెలంగాణ-కీసర

లైబ్రరీలు స్థాపిస్తు సామాన్యులకు విజ్ఞానాన్ని దగ్గర చేస్తున్న ఆకర్షణ అక్షర సేవకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కినందుకు ఆనందంగా ఉందని నాగారం సెరినిటి పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. గురువారం నాగారం సెరినిటి ఉన్నత పాఠశాలలో ఆకర్షణ 17వ లైబ్రరీని ప్రారంభించారు. దాదాపుగా 525 పుస్తకాలు సేకరించి పాఠశాలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులోనే పెద్ద సంకల్పంతో ముందుకు వెళుతున్న ఆకర్షణ జీవితం ఆదర్శనీయమని అన్నారు. పుస్తక పఠనంలో ఎంతో ఆసక్తి ఉన్న ఆకర్షణ సతీష్ తనలాంటి ఎంతో మంది చిన్నారులకు పుస్తకాలు అందిస్తూ వారి విజ్ఞానాన్ని పెంపొందించేందుకు తోడ్పడాలన్నారు. ఈ 12 సంవత్సరాల చిన్నారి కృషి గురించి తెలుసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారి గురించి మన్ కీ బాత్‌లో చెప్పారని తెలిపారు. ప్రత్యేకంగా ఆకర్షణను ఢిల్లీకి ఆహ్వానించి కలిశారని తెలిపారు. 2024 ఆగస్టు15వ తేదీన ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారని చెప్పారు. కాగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ ఈ అమ్మాయికి ఆకర్షణ అని నామకరణం చేయటం ఒక విశేషం. అలాగే ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకర్షణను ఆహ్వానించి ప్రత్యేక అభినందించారని తెలిపారు. ప్రధాని స్వయంగా ఆకర్షణకు అందజేసిన పుస్తకాలలో ఒక పుస్తకాన్ని పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డికి అందజేశారు. తాను పెద్ద అయ్యాక స్పేస్ సైంటిస్ట్ అవ్వాలనేది తన జీవిత లక్ష్యమని ఆకర్షణ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ బాలగోకులం శాఖ అధ్యక్షులు రఘునాధ మీనన్ పాల్గొన్నారు.

సీవరేజ్ టన్నెలింగ్ ప్రాజెక్ట్‌పై ఎండీ ప్రత్యేక దృష్టి

- మార్చి నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు
- 90 రోజుల డ్రైవ్‌లో పూర్తి చేయనున్న జలమండలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీవరెజ్ ఓవర్ ఫ్లో నివారణపై జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ సక్సెస్‌గా కొనసాగుతోంది. ఇందులో భాగంగా జలమండలి ఎండీ పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. జలమండలి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి నింబోలి అడ్డా వరకు నిర్మించతలపెట్టిన సీవరేజ్ టన్నెలింగ్ ప్రాజెక్టును మార్చినాటికి పూర్తిచేయాలని అధికారులను ఎండీ ఆదేశించారు. రాజ్ భవన్, సచివాలయం మీదుగా అబిడ్స్, నారాయణగూడ, బర్కత్‌పుర, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లోని మురుగు నీటిని నాలాలో కలవకుండా అంబర్‌పేట్ ఎస్టీపీకి మళ్లించడానికి దాదాపు 5 కిలోమీటర్ల 1800 ఎంఎమ్ డయా భారీ పైప్ లైన్ వేయాలని నిర్ణయించారు. అయితే రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ పైప్ లైన్ అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ ద్వారా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఇందులోభాగంగా 2007 అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ పనులు ప్రారంభించి ఇప్పటివరకు 4.4 కిలోమీటర్ల మేరకు పైప్ లైన్ పనులను పూర్తి చేశారు. అయితే చాలా ప్రాంతాల్లో భూగర్భంలో పరుపుబండ తేలడంతో టన్నెలింగ్ పనులు ముందుకు సాగక ఆలస్యం కావడంతో ప్రాజెక్ట్ వ్యయం పెరిగి సదరు ఏజెన్సీ అలాగే వదిలేసిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా మూసీ నదికి పునరుజ్జీవం అందిస్తామన్న సీఎం ఆదేశాలతో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టిసారించారు. సీవరేజ్ టన్నెలింగ్ ప్రాజెక్టును జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పూర్తి చేయాలని ఎండీ ప్రాజెక్టు అధికారులకు ఆదేశించారు.

ఈ ప్రాజెక్టు పూర్తయితే...

ఈ ప్రాజెక్టు మిగిలిన 0.6 కిలోమీటర్లు పూర్తి చేస్తే జలమండలి ఓ అండ్ ఎం 4, 5, 6 ప్రాంతాల్లోని రాజ్ భవన్, సచివాలయం, అబిడ్స్, హిమాయత్ సాగర్, నారాయణ గూడ, బర్కత్ పుర, బాగ్‌లింగం పల్లి తదితర మురుగును నాలాకు చేరకుండా అంబర్ పేట్ ఎస్టీపీకి మళ్లించి శుద్ధి చేసే వెసులుబాటు ఉంటుంది. మురుగు పొంగి రోడ్లపైకి రాకుండా కట్టడి చెయ్యవచ్చు.

సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి కసరత్తు

సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా జలమండలి 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ స్పెషల్ డ్రైవ్‌లో హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం, భవిష్యత్తులో నీటి కరవు రాకుండా ఇంకుడు గుంతల నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటారు. ఇందులో భాగంగా గురువారం ఓ అండ్‌ఎం డివిజన్ 5 పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎండీ అశోక్ రెడ్డి పర్యటించారు. బర్కత్ పుర, బాగ్ లింగంపల్లి, కింగ్ కోఠి, కాచిగూడలో జరుగుతున్న సీవరేజ్ టన్నెలింగ్ పనులు పరిశీలించిన ఎండీ.. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. డిసెంబర్ లోపు పూర్తి చెయ్యడానికి అవసరమైతే రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టాలని ఆదేశించారు. అక్కడ సీవరేజ్ డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. ధ్వంసమైన మ్యాన్ హోళ్లను గుర్తించి, వాటి స్థానంలో వెంటనే కొత్త వాటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ రవి కుమార్, ప్రాజెక్టు సీజీఎం, జీఎంలు, డీజీఎం, మేనేజర్లు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు సరికాదు

- వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయి
- కార్పొరేషన్‌లో పనిముట్ల మాయంపై విజిలెన్స్ ద్వారా దర్యాప్తు జరపండి
- ట్రాక్టరు ట్రాలీ మాయంపై ప్రస్తుత పాలక వర్గానికి ఎలాంటి సంబంధం లేదు
- పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో శానిటేషన్ విభాగంలో ట్రాక్టరు ట్రాలీ పోయిందనే అంశంలో ప్రస్తుత పాలక వర్గానికి కానీ, కాంగ్రెస్ నాయకులకు కానీ ఎలాంటి సంబంధం లేదని పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్ అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ విభాగంలో ఉన్న ట్రాక్టరు ట్రాలీ మాయం అయ్యిందని బీఆర్ఎస్ పార్టీ నేతలు ఫిర్యాదు చేయడంతో పాటు నూతనంగా ఏర్పాటైన పాలక వర్గంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది సరైనది కాదన్నారు. గతేడాది జూన్‌లోనే పాత పాలక వర్గం ఉన్న సమయంలోనే ట్రాక్టరు ట్రాలీ మరమ్మతుల కోసం సర్వీసు సెంటర్‌కు తీసుకువెళ్లారనే విషయాన్ని మరిచి దొంగే దొంగ దొంగ అన్న చందంగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ట్రాలీ మాయమైన అంశం తమ దృష్టి రాగానే కమిషనర్‌ను దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. దానికి బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇతరుల మీద విమర్శలు చేసే ముందు తామేంటో తెలుసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. తప్పు చేసిన వారే ఇతరులపై నిరాధారమైన ఆరోపణలు చేసి నవ్వుల పాలు కావొద్దని సూచించారు.

విజిలెన్స్‌తో దర్యాప్తు చేయిస్తాం..

గత పాలక వర్గం ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు జరిగిన అన్ని అంశాలపై విజిలెన్స్ కమిషన్‌తో విచారణ జరిపిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయని, అందుకే విజిలెన్స్ కమిషన్‌కు త్వరలోనే లేఖ రాస్తామన్నారు. గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలు, కార్పొరేషన్ లావాదేవీలు లాంటి ప్రతి అంశంపై దర్యాప్తు జరిపించేలా అధికారులను కోరుతామన్నారు. శానిటేషన్ విభాగంలో ఏడాదిన్నర నుండి స్థిరమైన ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయా అనే కోణంలో దర్యాప్తు జరపాలని కార్పొరేషన్ కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు.

మరమ్మతుల కోసం ఇచ్చిన మాట వాస్తవం

- త్రిలేశ్వర్ రావు, కమిషనర్

శానిటేషన్ విభాగంలో ఉన్న ట్రాక్టరు ట్రాలీని గత ఏడాది జూన్ మాసంలో మరమ్మతుల కోసం ఇచ్చారని దర్యాప్తులో తేలిందని కమిషనర్ త్రిలేశ్వర్ రావు అన్నారు. ట్రాక్టరు ట్రాలీ మాయంపై వివరణ అడగ్గా ట్రాలీ ఎక్కడికి పోలేదని శానిటేషన్ విభాగంలో స్థిరమైన అధికారులు లేక పర్యవేక్షణ లోపం ఏర్పడిందన్నారు. అన్ని వివరాలు రిజిస్టర్‌లో ఉన్నాయని తెలిపారు.

కొత్త టీచర్లకు పీఆర్టీయూ ప్రతినిధుల స్వాగతం



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడుచింతలపల్లి, శామీర్‌పేట మండలాలకు డీఎస్సీ-2024 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు శామీర్‌పేట్ ఎంఆర్సీ వద్ద పీఆర్టీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు టి. శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్రామిరెడ్డి వారికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఎంప్లాయిస్ ఐడీ ఫామ్ ఫ్లికేషన్ అందజేశారు.

జీపీ కార్మికులకు బట్టల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర యువజన విభాగం నాయకులు నంది అవార్డు గ్రహీత రేగళ్ల సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాప్రా డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, బొంతు రామ్మోహన్, మందమల పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, బొంతు శ్రీదేవి, జెర్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, గీత ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావని రెడ్డి, జి శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య వివిధ పార్టీ నాయకులు మరి మోహన్ రెడ్డి, సాయి జన్ శేఖర్, మహేష్ నాగిళ్ల బాల్‌రెడ్డి, కాలనీ సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు తదితరులున్నారు.

చడిచప్పుడు కాకుండా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ

చైర్మెన్, సభ్యుల ప్రమాణస్వీకారం

- మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్‌లు గైర్హాజరు
- మార్కెట్ కమిటీ నియామకం పట్ల ఇటీవలే మేడ్చల్ మండల నేతల అసహనం



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మెన్, డైరెక్టర్ల పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం హడావిడిగా చడిచప్పుడు నిర్వహించారు. మార్కెట్ కమిటీ నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎలాంటి హడావుడి లేకుండా సాదాసీదాగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కాగా బుధవారం మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల సమావేశంలో మార్కెట్ కమిటీ నియామకం పట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌పై పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా ఆ మరుసటిరోజే చాడి చప్పుడు లేకుండా పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ ముఖ్య నేతలు లేకుండానే ప్రమాణ స్వీకారం

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మరో సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్‌లు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్నారు. కాగా గురువారం నిర్వహించిన మార్కెట్ కమిటీ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో వారు కనిపించకపోవడం పట్ల పార్టీలో ఏం జరుగుతోందని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ నియామకం జరిపే సమయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ మూడుచింతలపల్లి మండలానికి చెందిన నాయకుడు నర్సింలు యాదవ్ పేరును ప్రతిపాదించారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి శామీర్ పేటకు చెందిన సీనియర్ నాయకుడు వైఏస్ గౌడ్ పేరును సూచించారు. చివరకు నర్సింహులు యాదవ్‌ను మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో మేడ్చల్ నుండి పదవి ఆశించిన పలువురు సీనియర్ నాయకులు వజ్రేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి పై బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేసి సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని తేల్చిచెప్పారు.

నియోజకవర్గంలో ఏం జరుగుతుందని చర్చ..

నియోజకవర్గ ముఖ్య నాయకులు లేకుండానే మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం బాధ్యతలను చేపట్టడం పట్ల అసలు పార్టీలో ఏం జరుగుతుందని పార్టీ శ్రేణుల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. వజ్రేష్ యాదవ్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ అన్ని తానై వ్యవహరిస్తున్నారంటూ పలువురు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ, స్థానిక ముఖ్య నాయకులు హాజరుకాకుండా జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరు కావడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌కే నగర్‌ను శుభ్రంగా ఉంచాలి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పరిశుభ్రత హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని ఆర్‌కే నగర్ మాతృశ్రీ విద్యాలయం వీధులలోని రోడ్లపై జీహెచ్ఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం పేరుకుపోయిన మట్టి కుప్పలు, కన్స్‌ట్రక్షన్ డెబ్రిస్, చెత్తను ఎత్తి వేయించే కార్యక్రమంలో మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆర్.కే నగర్‌ను పరిశుభ్రతలో తీర్చిదిద్దాలన్నారు. అందుకు కాలనీ వాసుల సహకారం తీసుకోవాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఒహెచ్ డా. మంజుల, ఏ.ఈ నవీన్, సానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ వసంత, గిరి, రమేష్, రవి, జయంతి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయాలి

- నాడు పథకాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీ ..నేడు తూట్లు కొడుస్తుంది
- సీఎంకు విద్యార్థుల సమస్యలు పట్టవా?
- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్
- ఫీజు చెల్లించాలని భారీ ర్యాలీ



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయాలని, నాడు ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేసిన కాంగ్రెస్ పార్టీ..నేడు ఆ పథకానికి తూట్లు కొడుస్తుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.7700 కోట్ల ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, బీఈడీ తదితర కోర్సుల విద్యార్థుల బోధన, ఉపకార వేతన ఫీజు బకాయిలను సత్వరమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయ కూడలి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యా.. మీకు విద్యార్థుల సమస్యలు పట్టవా అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు సంయుక్తంగా మాట్లాడుతూ.. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించి అమలు చేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు ఈ పథకానికి తూట్లు పొడుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. ఉన్నత విద్యా రంగాన్ని అభివృద్ధి పరచి, మేథోసంపత్తిని పెంచాల్సిన పాలకులు విద్యను విస్మరిస్తున్నారని అన్నారు. సీఎం విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని ఇతర అంశాలపై దృష్టి సారిస్తున్నారే తప్పా.. విద్యారంగ సమస్యలపై సమీక్ష చేయకపోవడం బాధాకరమన్నారు. మూడేండ్లుగా విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. బోధన రుసుములు, ఉపకార వేతనాల కోసం రాష్ట్రంలో ఏటా 12.50 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉపకారవేతనాలు, బోధన ఫీజులు కలిపి 2021-24 విద్యాసంవత్సరం నాటికే రూ.7700 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజుల చెల్లింపులో ఆలస్యం, సంక్షేమ శాఖలు విడుదల చేసిన బిల్లులు ట్రెజరీల్లో పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం అప్పులు చేసి కళాశాలల్లో ఫీజులు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో నేతలు బోధన ఫీజుల బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని ప్రస్తుతం విస్మరిస్తున్నట్టు అనుమానం కలుగుతోందన్నారు. ఫీజు చెల్లించకపోవడంతో వందలాది ప్రయివేట్ కళాశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధ్యాపకుల జీతభత్యాలు, కళాశాల నిర్వహణ తదితర సమస్యలను పరిష్కరించి విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి బాబు, శేఖర్, కార్యవర్గ సభ్యులు మహేష్,సోహైల్, అజీమ్ పాషా, ఆర్తి, అస్మా, దేవి, సంధ్య, నీలిమ, మధురిమ, కీర్తన, నయన, స్వాతి, మంజులతలతో పాటు 400 మంది బాధిత విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని కస్తూర్బా నగర్‌లో రూ.20లక్షలతో వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్, బాబు, సత్యనారాయణ, ఉమేష్ సింగ్, బి కే శ్రీనివాస్, కిషోర్, హబీబ్, బషీర్, సుధాకర్, నారాయణ, సోమయ్య, శివకుమార్, జహీర్, శాంతాబాయి, స్వప్న రాధా, విజయ్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్..



నవతెలంగాన-సిటీబ్యూరో

గ్రూప్ -1 మెయిన్ పరీక్షల నిర్వహణపై సచివాలయం నుండి చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని జిల్లా నుంచి 17,762 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాల్లో గుర్తించబడిన 27 పరీక్షా కేంద్రాలలో నియమించబడిన ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, డిస్ట్రిక్ట్ అధికారులు, రూట్ ఆఫీసర్లందరికి ఈ నెల 15న సమావేశం ఏర్పాటు చేసి వారు నిర్వహించాల్సిన విధుల పట్ల సూచనలు, ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ విసీలో అదనపు కలెక్టరు రాధికా గుప్తా, డిఆర్ఓ హరిప్రియ పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట సీఐగా కేతూరి నరసింహ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి,బాలనగర్ జోన్, జగద్గిరిగుట్ట నూతన సీఐగా మేడ్చల్ జోన్ సీసీఎస్. విభాగంలో విధులు నిర్వహించిన కేతూరి నరసింహ జగద్గిరిగుట్ట సీఐగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ. కే.క్రాంతికుమార్ మియాపూర్ పోలీస్ స్టేషన్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సిఐ.కె.నరసింహ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. విధుల విషయంలో ఎక్కడ రాజీ పడకుండా పోలీస్ స్టేషన్ వచ్చే ప్రతి ఒక్కరికి తగిన న్యాయం జరిగేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

చెరువులను సుందరీకరణ చేస్తాం

- మురుగునీరు కలవకుండా మళ్లింపు పైప్ లైన్లు నిర్మిస్తున్నాం
- చెరువులో తామర పూవులు పెంచి కలుషితం కాకుండా చేస్తాం
- పీఏసీ చైర్మెన్ అరెకెపూడి గాంధీ





నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సంరక్షణ,అభివృద్ధి పనులలో భాగంగా రూ.2 కోట్ల 74 లక్షల నిధుల అంచనావ్యయంతో, చెరువులో మురుగు నీరు కలవకుండా చేపడుతున్న మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులను పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రయినేజీ వ్యవస్థ మళ్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రయినేజీ వ్యవస్థ మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులకు వేగం పెంచాలన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపెట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలియచేసారు. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ,చెరువు చుట్టుపక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ ద్వారా చెరువులో కలుషిత నీరు కలవకుండా సస్యశ్యామలంగా ,చక్కటి ఆహ్లాదకరంగా చెరువును పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలియచేసారు. అదేవిధంగా మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మళ్లింపు.. పైప్ లైన్ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం ,పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని తెలియచేసారు. చెరువు సంరక్షణలో భాగంగా, చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము, చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నాం అన్నారు. అదేవిధంగా చెరువులను సంరక్షణించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ఎల్లమ్మ చెరువును సుందరవనంగా, శోభితవర్ణంగా తీర్చిదిద్దుతామని, అదేవిదంగా చెరువు ల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువులను సంరక్షిస్తామని, చెరువుల యూజీడీ పైప్ లైన్ నిర్మాణం పనుల గూర్చి, అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. చెరువు అపరిశుభ్రం వలన పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన, దోమలు పెరగడం వలన స్థానికులకు ఏర్పడుతున్న ఇబ్బందులను అనారోగ్యాలకు గురవడం స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యేకి పిర్యాదు చేవారు. దీనికి గాంధీ స్పందించి, చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగింపజేశామని అన్నారు. .అదేవిధంగా ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెరువులో, తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని అన్నారు. చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ,చెరువులు కలుషితం కాకుండా మరియు కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయిలో సంరక్షిస్తామని, చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని ఆయన చెప్పారు. చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని గాంధీ తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలి



- నవయుగ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రజాప్రతినిధులు
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 125 డివిజన్‌లోని సుభాష్ చంద్రబోస్ నగర్ 'ఏ'లో స్థానికంగా దుర్వాసనతో గాలి కాలుష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నమని మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ దృష్టికి గురువారం నవయుగ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని, స్థానికులు కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీరాంనగర్ కాలని, పోచమ్మగుడి వెనుక హెచ్.యం.టి. మైదానంలో కెమికల్ కంపెనీల నుంచి వచ్చే వేస్టేజ్‌ను కాలబెడుతున్నారని... దీని కారణంగా దట్టమైన పొగలు వెలువడి గాలిలో కలిసి వ్యాపించడం వలన గాలి కలుషితం అవుతుందన్నారు. ఈ గాలిని పీల్చడం వలన విపరీతమైన జలుబు, దగ్గుతో తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని... అంతే కాకుండా ఈ వ్యాధి దీర్ఘకాలిక (శ్వాసకోశ) వ్యాధిగా మారి...హాస్పిటల్ ఖర్చుల వలన తమ ఆర్థిక స్థితిని ప్రభావితం చేస్తుందన్నారు. తమ సమస్యను అర్థం చేసుకుని పరిష్కరించాలని బస్తీ వాసుల కోరారు. ఫ్యాక్టరీల నుంచి తెచ్చే వ్యర్థాలను తగలబెటుతున్న పోచమ్మగుడి ప్రక్కనుండి ఉన్న మార్గాన్ని మూసి వేయాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి పై స్పందించిన కూన శ్రీశైలం గౌడ్ సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తానని హామీని ఇచ్చారు. నవ యుగ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మెన్ జహంగీర్ హుసైన్, ప్రెసిడెంట్ బల్ రామ్, రాజు, సలీం పాల్గొన్నారు.

హజరత్ అలీ మృతి బాధాకరం





నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ ప్రధాన కార్యదర్శి బీఆర్ఎస్ నేత సయ్యద్ హజరత్ అలీ అకాల మృతి బాధాకరమని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో పాటు పార్టీ శ్రేణులతో కలిసి డివిజన్ పరిధి మగ్దుమ్ నగర్‌లోని ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబానికి భరోసా ఇచ్చా రు. పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేసే వారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, యువజన నాయకులు కొలుకుల జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి సయ్యద్ హజరత్ అలీ..

ప్రజల మనిషి సయ్యద్ హజరత్ అలీ అకాల మరణం తీరనిలోటని ఐ.ఎన్.టి.యు.సి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య గౌడ్ విచారం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా హజరత్ అలీ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, మగ్దూం నగర్ భగత్ సింగ్ మార్గ్ లో గల ఆయన నివాసంలో మృతి చెందారు. ఈ మేరకు భౌతిక ఖాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్దూం నగర్ స్థాపించినప్పటి నుండి నివసిస్తూ పేద ప్రజల అవసరాలను తీర్చుతూ అండగా నిలిచారన్నారు.ఈ ప్రాంత అభివృద్ధిలో గత తెలుగుదేశం పార్టీ లో దేవేందర్ గౌడ్ మంత్రిగా ఉన్నప్పుడు మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రషీద్‌తో కలిసి ప్రజా సమస్యల పరిష్కరించడంలో ముందు ఉండేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐ. ఎన్.టి.యు.సి నియోజకవర్గ నాయకులు మునిపల్లి జనార్ధన్, స్థానిక నాయకులు యాదగిరి,శేఖర్ టైలర్,బస్తీ నాయకులు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి..

- రాజకీయ ఖైదీలను విడుదల చెయ్యాలి
- సీపీఐ కుత్బుల్లాపూర్ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఉపా చట్టాన్ని రద్దు చేసి, రాజకీయ ఖైదీలను విడుదల చెయ్యాలని కోరుతూ.. గురువారం సీపీఐ హైదరాబాద్ సమితి ఆధ్వర్యంలో.. ఇందిరా పార్క్‌లో నిర్వహించిన నిరసన దీక్షలో సీపీఐ కుత్బుల్లాపూర్ కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఒక దోషికి శిక్ష పడకున్న నిర్దోషికి మాత్రం శిక్ష పడకూడదు అని రాజ్యాంగం చెబితే నేటి పాలకుల, న్యాయవాదుల చర్యల వల్ల ఊపా చట్టం వల్ల ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబాకు నేరం చేయకున్నా 10 సంవత్సరాలు జైళ్లు శిక్ష వెశారన్నారు. మనిషికి బతికి ఉండే సహజమైన హక్కును కూడా నిరకరించిందని అన్నారు. కన్నా తల్లి చనిపోతే చివరి చూపును కూడా నిరకరించడం అనగరికమైన చర్య అని పేర్కొన్నారు. అదే రేపిస్టు డేరా బాబాకు నేరం రుజువై శిక్ష పొందుతున్న వాడికి ఎన్నికల సమయంలో రాజకీయాలతో సంబంధం లేకున్నా 4 సార్లు పేరోల్ ఇచ్చి బయటకు పంపడం చూస్తుంటే.. బీజేపీ ప్రభుత్వం, చట్టం ఎవరికి చుట్టమో తెలుస్తుందని ఎద్దేవ చేశారు. అలాగే 90 శాతం వైకల్యం ఉన్న వ్యక్తిని అండా సెల్‌లో వేసి, కరోనా వచ్చినా కనీసం హాస్పిటల్‌కు కూడా పంపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం, న్యాయం ప్రజల కోసం ఉద్యమించేవారికి, రాజకీయం, డబ్బు ఉన్నవాడికి ఒకలా పనిచేస్తుందని తెలిపారు. ఇలాంటి క్రూరమైన చట్టాలను వెంటనే రద్దు చెయ్యాలని, రాజకీయ ఖైదీలను విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు హరినాథ్,శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు రవి, సామెల్, రాములు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలను వ్యతిరేకించండి

- సీపీఐ (ఎం) మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కమిటీ

నవతెలంగాన-సిటీబ్యూరో

కేంద్ర పభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకి నిరసనగా, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికలను తిరస్కరించాలని నిరుద్యోగం అధిక ధరలను అదుపు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని, అంతర్జాతీయ మార్కెట్లో సమురు ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీసీఐ(ఎం) మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు సాయంత్రం కమలనగర్‌లోని జిల్లా ఆఫీస్‌లో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ ఎస్).వీరయ్య, జిల్లా కార్యదర్శి సత్యం హాజరుకానున్నారు.

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



నవతెలంగాన-సిటీబ్యూరో

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్ లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమములో పి.రాజేశ్వర్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, ఎం.డి. యాసిన్ అలీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, హనుమంత్, వాల్మీకి సంఘం, అధ్యక్షులు, రాజు, ఉపాధ్యక్షులు, రాములు, జనరల్ సెక్రటరీ, వాల్మీకి సంఘం నాయకులు వెంకటరమణ, లక్ష్మన్, నర్సిములు, మద్దిలేటి, అయ్యన్న, సుదాకర్, నరసింహం, రవి, వెంకటయ్య, వన్నురప్ప, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికునికి వేతనం ఇప్పించిన రవిసింగ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పటాన్ చెరువు "రాజ్ కమల్ ట్రాన్స్ పోర్ట్" గణేష్ గడ్డ రుద్రారం పటాన్ చెరువు నియోజకవర్గం, ఇండస్ట్రీ ఏరియాలో ఎస్.కె ఇబ్రహీం అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేయడం జరిగింది. ఏదో రకంగా ఇబ్బంది పెడుతూ డ్యూటీ నుంచి తీసివేశారు. ఇబ్రహీం అనే కార్మికుడికి రావలసిన గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ రెండు నెలల వేతనం రూ .60 వేల ఇవ్వకుండా.. ఇబ్బంది పెడుతూ నిర్లక్ష్యం చేస్తూ కార్మికుడు ఇబ్రహీంనీ ఏదోరకంగా మభ్యపెడుతూ పంపించే వారు. కార్మికునికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని రవిసింగ్ ఆఫీస్ వద్దకు వెళ్లి కార్మికునికి జరిగిన అన్యాయం చెప్పుకున్నారు. ఆ తర్వాత వెంటనే స్పందించిన, రవిసింగ్ హుటాహుటిన, రాజ్ కమల్ ట్రాన్స్ పోర్ట్, కంపెనీ దగ్గరికి వెళ్లి యజమాన్యంతో పలుమార్లు మాట్లాడి కార్మికునికి రావలసిన రెండు నెలల జీతం కార్మికునికి ఇప్పించడం జరిగింది. తనకు న్యాయం చేసిన రవిసింగ్‌కు కృతజ్ఞతలు తెలియజేశాడు.

మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కార్యాలయం గురువారం దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్ సుంకరి కృష్ణవేణి కృష్ణ అధ్యక్షతన.. మున్సిపల్ ఆఫీస్ నందు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ క్రిష్ణవేణి క్రిష్ణ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ వైస్ చైర్మెన్ తుడుము పద్మారావు, మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణరావు, మేనేజర్ ఎస్.సునంద, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు..

కేపీహెచ్‌బీ : రామాయణం ఇతిహాసాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా రచించిన వాల్మీకి తన పేరును చరిత్రలో లిఖించు కున్నారని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం కేపీహెచ్‌బీ కాలనీలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు రంగ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్ర పటానికి రమేష్ పాల్గొని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ రామాయణాన్ని జనహృద్యంగా రచించిన వాల్మీకి చరితా ర్థుడన్నారు. అనంతరం వాల్మీకి సోదరులను ఆయన అభినంచారు. ఈ కార్యక్రమంలో సతీష్ రెడ్డి, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, పొడుగు అప్పారావు, నలినీకాంత్, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌తో ముద్దాపురం మదన్ గౌడ్ సమావేశం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సబూరి ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు రామ్, లక్ష్మణ్ చనిపో యిన విషాద ఘటన తెలిసిందే. ఆ చనిపోయిన బాధిత కుటుంబాలకి నష్టపరిహారంతో సహా, పెన్షన్ వచ్చే విధంగా.. పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుతో కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్ షాపు నగర్‌లోని తన కార్యాలయంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పిఎఫ్ ఇన్‌స్పెక్టర్‌కి అన్ని డీటెయిల్స్ ఇవ్వడం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులకు, పిల్లలకు పెన్షన్ వచ్చే విధంగా అన్ని విధాల ప్రయత్నం చేయవలసిందిగా మదన్ గౌడ్ పిఎఫ్ కమిషనర్‌కి, పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకి విన్నవిం చుకున్నారు.

ఈ సందర్భంగా ముద్దాపురం మదన్ గౌడ్ మాట్లాడుతూ... చాలా కంపెనీలలో పిఎఫ్ లేకుండా కంపెనీలు నడిపిస్తున్నారన్నారు. ఎక్కడైనా పిఎఫ్ లేకుండా కంపెనీని నడిపినట్లు అయితే తన దృష్టికి తీసుకువచ్చినట్టయితే.. కంపెనీ మీద తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిఎఫ్ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్మికులందరూ భయపడకుండా పీఎఫ్ కట్టే విధంగా అన్ని ప్రయత్నాలు చేయాలన్నారు.పిఎఫ్ వల్ల కార్మికులకు ఎన్నో బెనిఫిట్స్ ఉన్నాయన్నారు. కాబట్టి కార్మికులు ప్రతి ఒక్కరు కంపెనీలో పిఎఫ్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలైన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కంపెనీలపైన చర్యలు తీసుకొని, కార్మికులకు పిఎఫ్ వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తన ఆఫీస్‌కు వచ్చిన పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకి ధన్యవాదాలు తెలియజేశారు. కార్మికు లకు న్యాయం చేయాలని, కార్మికులందరూ తమకు రుణపడి ఉంటారని కోరుకున్నారు.

ఆలయ వార్షికోత్సవ పూజలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ భవానీ నగర్ శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం, 25 వ వార్షికోత్సవం సందర్భంగా.. భవానీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు.. అమ్మవారిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్‌తో పాటు దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి.. వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గౌసుద్దీన్, రాజు, వేణు, యాదగిరి, రాము, విష్ణు, అరుణ్, జైరాజ్, వినోద్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని.. ఆల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మ బండ దత్తాత్రేయ కాలనీలో గల శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, స్థల సేకరణలో భాగంగా రూ.50,000 వేలు విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ జన్మదిన్నాన్ని పురస్కరించు కొని, ఆలయ అభివృద్ధి కోసం ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఉంటూ.. ఇంకా ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నట్టు జిల్లా గణేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, అరుణ్, నాయకులు పి.మహేష్, వెంకటకృష్ణ, సుధాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన రెపన్ గిరిబాబు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ జంట సర్కిల్స్ కుత్బుల్లాపూర్, గాజుల రామారం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గా రేపన్ గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా.. చైర్మెన్‌గా ముత్యాలు, సలహాదారులు జి.గణేష్, వేముల సురేష్, విజయసాగర్ రెడ్డి కార్యనిర్వాహక అధ్యక్షులుగా వీర్ల సాయిబాబు, ఉపాధ్యక్షులు పి.నరేష్ కుమార్, కె.నర్సింహ్మ ప్రధాన కార్యదర్శి ఎన్ ప్రసాద్ నాయక్, జాయింట్ సెక్రెటరీ మల్లేష్ కోశాధికారి టి.వెంకటేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.దేవరాజు ఎన్నికయ్యారు. గురువారం జంట సర్కిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని తన క్యాంప్ కార్యాల యంలో కలిశారు. ఎమ్మెల్యే కేపీ.వివేకానంద నూతన కార్యవర్గాన్ని అభినందించి, శాలువలతో సత్కరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐక్యమత్యంతో కలిసి ఉండాలన్నారు. అసోసియేషన్ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

12
నవతెలంగాణ
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com

జలమండలిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, ఉన్నతాధికారులు హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ రెవిన్యూ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, సీజీఎం ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం నేటి యువతకు ఆదర్శం



- జన్యవులా రామకృష్ణ

నవతెలంగాణ-కంటోన్మెంట్

మహర్షీ వాల్మీకి జీవితం నేటి యువతకు ఆదర్శమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జన్యవులా రామకష్ణ అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా 5 వార్డులోని వాల్మీకి నగర్‌లో ఉన్న వాల్మీకి ఆలయంలో ఆయన పూజలు చేశారు సమాజ్ నాయకులు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి నివాళులు అర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలను అర్పించారు అనంతరం మాట్లాడుతూ వాల్మీకికి ఎంతో చరిత్ర ఉందని, దుర్మార్గం నుండి సన్మార్గానికి వచ్చి ఇతిహాసాలను రచించి మహాత్ముడు అయ్యాడని చెప్పారు యువత వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో సతీష్, రణవీర్, సుశీల్, లడ్డు, వినోద్, ప్రదీప్, అమర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య సాయానికి నిత్యం సిద్ధం

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

నవతెలంగాణ-ఓయూ

నిరుపేదలకు వైద్య సాయాన్ని అందించేందుకు తాము నిరంతరం సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం లోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన స్టాలిన్, వారాసిగుడా కు చెందిన బీ పాషా లు అనారోగ్యం బారిన పడి వైద్య సాయానికి సితాఫలమండీ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించారు. వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకొని వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.రెండు లక్షల చొప్పున మొత్తం రూ.నాలుగు లక్షల మేరకు ఎల్.ఓ.సీ. పత్రాలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సమకూర్చి గురువారం తన కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సితాఫలమండీలోని తమ కార్యాలయం బాసటగా నిలుస్తుందని తెలిపారు. గత పదేండ్ల కాలంలో రికార్డు సంఖ్యలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పేదలకు అందించామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) కదిరవన్ పలని ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మానవ విలువలను ప్రపంచానికి అందించిన మహనీయుడు వాల్మీకి అని, మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి ఒక్కరూ చదివి స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి ఆశన్న, సీపీవో డాక్టర్ సురేందర్, జీఎం డీఐసీ పవన్ కుమార్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీరామ్, డీపీఆర్వో అబ్దుల్ కలీం, ఈడీఎస్సీ కార్పొరేషన్ రమేష్, ఏటీసీడీవోలు నరసింహులు, కృష్ణమాచారి, సంజీవులు, నీరజారెడ్డి, హెచ్ డబ్ల్యుఎస్‌లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహర్షి వాల్మీకి రచనలు, సాహిత్య సృష్టికి, భారతీయులందరికీ గొప్ప ఆధ్యాత్మిక ప్రేరణగా నిలిచాయని జీహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రామాయణ మహా కావ్య రచయిత మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని, జీహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి భారతీయ సాహిత్యానికి ఒక అద్భుతమైన సంపదను అందించారని పేర్కొన్నారు. వాల్మీకి రచనలో వ్యక్తమైన ధర్మ బోధలు, ఆధ్యాత్మికత, న్యాయ, నైతిక విలువలు అందరికీ ప్రేరణగా నిలుస్తాయన్నారు. వాల్మీకి ఆశయాలను గౌరవించి ప్రతి వ్యక్తి ధర్మం, సత్యం, న్యాయం మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సి.ఎన్.రఘు ప్రసాద్, నళిని పద్మావతి, సిపిఆర్ఓ ముర్తుజా అలీ, ఏఎంసీలు రమణ, శారద, జీహెచ్ఎంసీ, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్రోంబాల్‌తో ఆల్టోస్సా గ్రూప్ ఇటాలియన్ ఫర్నిచర్ భాగస్వామ్యం

నవతెలంగాణ-బంజారాహిల్స్

విలాసవంతమైన గ్లోబల్ ఇటాలియన్ ఫర్నిచర్ బ్రాండ్‌లను సరఫరా చేయడంలో మార్కెట్ లీడర్‌గా నిల్చామని ఆల్టోస్సా గ్రూప్ తెలిపింది. భారతదేశ అత్యున్నత బ్రోంబాల్‌తో భాగస్వామ్య సంబంధాలనూ బంజారాహిల్స్‌లోని హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒప్పందం చేసుకున్నట్టు ఇండియన్ పార్ట్నర్ మురళి, ఆల్టోస్సా ప్రతినిధి సునీల్‌లు గురువారం ప్రకటించారు. ఈ భాగస్వామ్యం ద్వారా మెరుగైన వ్యాపార విస్తరణ నాణ్యమైన క్రయవిక్రయాలను కొనసాగించే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.



విజన్ వికసిత్ భారత్ అవార్డ్స్

నవతెలంగాణ-ఓయూ

భారతీయ శిక్షణ మండల్ తెలంగాణ ప్రాంత ఆధ్వర్యంలో విజన్ ఫర్ వికసిత భారత్ (వివిభ) 2024 నిర్వహించిన పరిశోధన పత్రాల పోటీలో ఎంపికైన వారికి అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జేఎన్టీయూ హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్రీయ స్వయంసేవక్ ప్రాంత కార్యవాహ కాచం.రమేష్ హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. సిత భారత్ 2047 ముఖ్య ఉద్దేశం వివరించారు. 2047 నాటికి భారతదేశం ఆర్థికంగా అభివద్ధి చెందిన దేశంగా ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని తెలిపారు. ప్రపంచ దేశాల అభివృద్ధిలో చిన్న దేశాలు అయినటువంటి ఇజ్రాయిల్, జపాన్ దేశాలను ఉదహరించారు. ఇందులో భాగంగా పరిశోధన పత్రాల పోటీని ప్రశంసించారు. రాబోయే రోజులలో విద్యకు సంబంధించిన అంశాలను నిర్వహించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎం తెలంగాణ అధ్యక్షులు ప్రో. శివరాజ్ మాట్లాడుతూ. బీఎస్ఎం ఆవిర్భావం, దాని ముఖ్య ఉద్దేశాన్ని సవివరంగా వివరించారు.బీఎస్ఎం యువ ఆయాం తెలంగాణా ప్రాంత ప్రముక్ డా. పూర్ణ చందర్ తెలంగాణలో నిర్వచించిన పోటీతో పాటు జాతీయ స్థాయిలో నవంబర్ 15 నుండి 17 వరకు నిర్వహించబోయే పోటీ వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పరిశోధకులు వారి పరిశోధన పత్రాలను ప్రదర్శించారు. అనంతరం పరిశోధన పాత్రలను మూల్యాంకనం చేసిన వివిధ విశ్వవిద్యాలయ అధ్యాపకులను బీఎస్ఎం ప్రతినిధులు సన్మానం చేశారు. చివర్లో ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం బీఎస్ఎం అనుసందాన్ ప్రముక్ డా. సతీష్ రాయికింది రచించిన "తెలంగాణా రాష్ట్రంలో వివిధ నీటిపారుదల వనరుల ద్వారా వరి ఉత్పత్తి" అనే పరిశోదన గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బీఎస్ఎం ప్రతినిధులు డా. జై సింగ్, డా. ఉమ, డా. కష్టయ్య, డా. రాఘవేంద్ర, మనీష్ ఆనంద్,డా. నరహరి, డా. కుమార స్వామి, గోవర్ధన్ రెడ్డి, డా. మహేందర్ రెడ్డి,డా. హేమంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వం తీరు బాధాకరం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్...

బాధిత కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మోండా మార్కెట్ లోని ఓల్డ్ జైల్ ఖానా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలర్ షాపులు కూలిపోయి నష్టపోయిన 4 కుటుంబాలకు మేరు సంఘం ఆధ్వర్యంలో కుటు మిషన్‌లు, మరో ఇద్దరు బాధితులకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల నుంచి టైలరింగ్ వత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాల షాపులు కూలిపోవడంతో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. జీవనాధారం కోల్పోయి నిరాశ్రయులుగా మారిన బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో తాను వ్యక్తిగతంగా ఒక్కో కుటుంబానికి రూ. 20 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. సంఘటన జరిగి నెల రోజులు కావస్తున్నా బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం అందలేదన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లినా లేఖ రాసినా ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. మేరు సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్ లను పంపిణీ చేయడం ద్వారా బాధితులకు అండగా నిలవడం పట్ల వారిని ఆయన అభినందించారు. షాపులు కూలిపోవడం వల్ల జీవనోపాధిని కోల్పోయిన వారి కోసం అదేస్థానంలో త్వరలోనే ఒక తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మోండా డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కై లాబ్ యాదవ్, నాగులు, రాములు, మహేష్ యాదవ్, మహేందర్, మేరు సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నరేష్, రాజ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఓదెల సత్యనారాయణ, రాజ్ గోపాల్, సంగేవార్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో అధికారులతో ఎమ్మెల్యే విస్తృత పర్యటన



నవతెలంగాణ-ఓయూ

రూ. కోటి 80 లక్షల రూపాయల వ్యయంతో పటేల్ కుంట చెరువు వద్ద నిర్మించిన సివరేజ్ డైవర్షన్ పైప్‌లైన్ పనులు పూర్తయినా ఉపయోగంలోకి తీసుకురాక పోవడంతో గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన శేఖర్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణతో కలిసి పటేల్ కుంట చెరువును పర్యవేక్షించారు. తక్షణమే సివరేజ్ డైవర్షన్ పైప్ లైన్‌ను వాడుకలోకి తేవాలని ఆదేశించారు. చెరువు చుట్టూ బండు నిర్మించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించేందుకు ఎఫ్‌టీసీ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎరుకల బస్తీలో చెరువుకు ఆనుకొని నిర్మించుకున్న ఇండ్లలోని వారు హైడ్రా వల్ల తమ ఇండ్లు ఏమైనా పోతాయేమోనని భయపడుతుండటంతో వారికి భరోసా ఇచ్చి వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత తనది అంటూ ఎమ్మెల్యే ధైర్యాన్ని ఇస్తూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేకర్, ఇరిగేషన్ అధికారులు డీఈ నరేందర్, ఏఈఈ సుధీర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలలో స్థానిక ప్రజా ప్రతినిధులకు అవకాశం ఇవ్వండి



- రాష్ట్ర ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు గడీల కుమార్ గౌడ్

నవతెలంగాణ - బంజారా హిల్స్

గ్రామ, మున్సిపల్, పట్టణ ప్రాంతాలలో ప్రజల చేత నేరుగా ఎన్నికైన ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలను ఇందిరమ్మ కమిటీలలో భాగస్వామ్యం చేయకుండా గ్రామంలో కొందరిని మాత్రమే భాగం చేయడం స్థానిక ప్రజాప్రతినిధులను అవమానపరచడమేనని రాష్ట్ర ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు గడీల కుమార్ గౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలకు ఎంపీటీసీలు కేవలం ఎన్నికల కోసం వాడుకుని వదిలేసే వారి లాగానే కనపడుతున్నట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల నాడి తెలిసిన నాయకులుగా ఉన్న తమను ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ పథకంలో విధిగా భాగం చేయాలని, అలాగే ఇందిరమ్మ కమిటీలలో ప్రధాన పాత్ర పోషించే విధంగా తమకు భాగస్వామ్యం ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక అధికారి అవసరమే లేదని ఉన్న ప్రజల చేత ఎన్నుకైన తమను కూడా గుర్తించి అవకాశం కల్పించాల్సిందేనని, రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తామనిప్రజా పాలన ప్రభుత్వం చెప్పి రాజీవ్ గాంధీ ఏర్పాటుచేసిన ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కన్వీనర్ అశోక్, తెలంగాణ ఎంపీటీసీ ఉపాధ్యక్షులు సంగన్నమన్నె రాజు,మోహన్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్
- ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రం

నవతెలంగాణ-ఓయూ

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలన్నింటిని విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన అధ్వర్యంలో టీజేఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాలు, ట్యూషన్ ఫీజులు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరేండ్లుగా పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. సంవత్సరానికి 14లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు చేసుకుం టున్నారని తెలిపారు .ఫీజుల బకాయిలను ప్రభుత్వం చెల్లించక పోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాలేజీ యజమాన్యాలు కోర్సు పూర్తయినా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దాంతో వారికి ఉన్నత కోర్సుల్లో సీట్లు వచ్చినా.. చదవలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలపై మొదటి ప్రాధాన్యతగా బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏంటీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్, రవీందర్, నరేష్, ప్రియ, సునీత, దివ్య, జ్యోతి,మమత,నాగలక్ష్మి పాల్గొన్నారు.



చార్మినార్ శ్రీ భాగ్య లక్ష్మి దేవస్థానంలో రానున్న దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సందర్భంగా నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిని భాగ్యలక్ష్మి మందిర్ కమిటీ సభ్యులు కుమారి శశికళ, చంద్ర ప్రకాష్, సంతోష్‌లు గురువారం ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు.
నవతెలంగాణ-ఓయూ



కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ గురువారం సమస్యలను పరిశీలించేందుకు పీవీ ఎన్‌క్లేవ్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీవీ ఎన్‌క్లేవ్ కమిటీ హాల్‌లో ఓపెన్ జిమ్, ఇంకా పాత భవనాన్ని మరమ్మతులు చేయాలని హెచ్ఎంసీఏఈ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నారాయణ రావు, వేణుగోపాల్, సుధాకర్, విజయ్ కుమార్, మల్లేష్ యాదవ్, చందు యాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు



సైకిళ్లు పంపిణీ చేసిన కార్పొరేటర్ చేతన హరీష్

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్‌ను శుభ్రంగా, పచ్చగా ఉంచడానికి శానిటేషన్ సిబ్బందికి మూడు చక్రాల సైకిళ్లను హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. మనల్ని మనం ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రోడ్లపై లేదా ఏదైనా డంపింగ్ పాయింట్ దగ్గర చెత్త వేయవద్దని, డివిజన్‌లోని పౌరులందరినీ అభ్యర్థిస్తున్నానన్నారు. మలేరియా డెంగ్యూ, కుక్క కాటు లేదా అనేక బహుళ సంబంధిత సమస్యలకు ఇది ప్రధాన కారణం కాబట్టి మన డివిజన్, నగరం, రాష్ట్రాన్ని ఇండోర్ లాగా శుభ్రంగా, పచ్చగా ఉంచుకుందాం అన్నారు. హైదరాబాద్ నగరం దక్షిణ భారతదేశంలో ఒక ఉదాహరణగా ఉండాలన్నారు. అలాగే బయట చెత్త వేసినందుకు జరిమానా విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంజయ్ పటేల్, సుమన్ రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ విభజన ప్రతిపాదనను స్వాగతించిన డా.కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్...

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇటీవల ఒక ప్రకటనలో జీహెచ్ఎంసీని నాలుగు భాగాలుగా విభజించే ప్రతిపాదనను ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ స్పందిస్తూ, జి.హెచ్.ఎం.సి పరిధిలో పాలనను మెరుగు పరచడంలో వికేంద్రీకరణ కీలక పాత్రను నొక్కి చెప్పారు. " జి.హెచ్.ఎం.సి ప్రాంతంలో పాలనను మెరుగుపరచడానికి వికేంద్రీకరణ చాలా అవసరం." అన్నారు. ఈ ఆలోచన గొప్ప వాగ్దానాన్ని కలిగి ఉన్నప్పటికీ, ప్రత్యేకంగా కొత్తగా ఏర్పడిన సంస్థలలో ఆదాయ భాగస్వామ్యానికి సంబంధించి ఖచ్చితమైన ప్రణాళిక అవసర మని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతీ భాగం సమర్థవంతంగా పనిచేయడానికి, దాని నివాసితుల డిమాండ్లను తీర్చడానికి అవసరమైన వనరులను కలిగి ఉందని నిర్ధారించడానికి ఈ ప్రణాళిక దోహద పడుతుందన్నారు. ఈ వికేంద్రీకరణ విధానం నగర నివాసుల జీవన పరిస్థితులలో గణనీయమైన మెరుగుదలకు దారితీస్తుందని, స్థానికీకరించిన పాలనను కలిగి ఉండటం ద్వారా, కొత్త నిర్మాణం పౌరుల ఆందోళనలకు వేగంగా, మరింత ప్రతిస్పందించే చర్యలను ప్రారంభించగలదని అన్నారు. ఈ ప్రతిస్పందన మెరుగైన ప్రజా సేవలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, నివాసితులకు మరింత నిమగ్నమైన పౌర అనుభవంగా అనువదించవచ్చునని అన్నారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-హాయత్ నగర్

యువతి అదృశ్యమైన ఘటన హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హాయత్ నగర్ లోని గ్రీన్ వుడ్ కాలనీ లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న ఉప్పాల ప్రభావతి సేల్స్ ఎగ్జిక్యూటివ్ గా పనిచేస్తున్నది.రోజు మాదిరిగా 16న కూడా విధులకు ఇంటి నుంచి బయలు దేరి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అలాగే 'అన్నా నేను వెళ్లి పోతున్నా ఇంక కనిపించను నాకోసం వెతక కండి అమ్మ,బాపు జాగ్రత్త' అని తనకు వాట్సప్ లో మెసేజ్ చేసినట్టు ఆమె అన్న ఫిర్యాదు లో పేర్కొన్నాడు. పోలీసులు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

25 నుంచి 31 వరకు మాదిగల ధర్మ యుద్ధం

- కమిటీల పేరుతో కాలయాపన చేయడం అసమర్థతకు నిదర్శనం
- పదవి కోసం సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పుతారా..?
- మంద కృష్ణ మాదిగ



నవతెలంగాణ - బంజారాహిల్స్

మాదిగ, ఉపకులాలను నమ్మించి నమ్మక ద్రోహానికి పాల్పడ్డ సీఎం రేవంత్‌రెడ్డి పై మరో పోరాటానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకష్ణ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ తొలుత దేశంలో తెలంగాణ అమలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల అమల్లో పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని తెలిపారు. రేవంత్ రెడ్డి మాటలు.. తేనే పూసిన కత్తిలా ఉంటాయన్నారు. ప్రజలను నమ్మించడంలో రేవంత్ రెడ్డి ఘనుడని.. మోసం చేయడంలో అంతకంటే ఘనుడన్నారు. దశాబ్దాల కాలం నుంచి చట్టబద్ధత కోసం ఏర్పాటు చేసిన కమిటీలు కమిషన్లు ఆర్డినెన్స్‌లు సిఫార్సులు ఎందుకు అమలు చేయడం లేదని.. మాట ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి కాపాడుకోవడం కోసం మాట తప్పుతారా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. దళితుల్లో అసమానతలు ఉన్నాయని వేసిన కమిటీలు, కమిషన్లు, ఆర్డినెన్స్‌లు తీసుకురావడం కాంగ్రెస్ పార్టీకి కొత్తేమి కాదన్నారు. సమస్య పరిష్కార కోసం కమిటీలు వేసి 48 గంటల్లో వాటిని అమలు చేసిన చరిత్ర గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధిలకు దక్కిందని గుర్తు చేశారు.

ఈ నెల 25 అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట స్ఫూర్తిని వివరిస్తూ మాదిగల ధర్మ యుద్ధ జిల్లా మహాసభలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదలై 31న నల్గొండ జిల్లాలో పూర్తవుతాయన్నారు. అలాగే మాదిగల ధర్మ యుద్ధ మహాదీక్షలు నవంబర్ 4 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో కొనసాగుతాయని తెలిపారు. నవంబర్ 16 నుంచి డిసెంబర్ 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా మాదిగల ధర్మయుద్ధ రథయాత్ర కోదాడ నుంచి ప్రారంభమై డిసెంబర్ 21న చలో హైదరాబాద్ మాదిగల ధర్మ యుద్ధ మహాప్రదర్శనతో ముగుస్తుందని వివరించారు. తమ నినాదం ఒక వర్గానికి న్యాయం చేస్తూ మరో వర్గానికి అన్యాయం చేసి వారిని అణగదొక్కాలని చూడదని చెప్పారు. తమ పోరాటం ఎప్పుడూ ఆగదని తమ లక్ష్య సాధన కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునే అవకాశాన్ని చేజేతులా కోల్పోవద్దని, తక్షణం వర్గీకరణ పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థ ప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నీర్‌తో...

పన్నీర్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఇందులో ఉండే కాల్షియం, విటమిన్ డి, ఎముకల్ని కాపాడుతుంది. బాడీలోని వివిధ రకాల ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. కండరాలు, నాడుల పనితీరును నిర్వహిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

గుండెకు ఎంతో మంచిది, రక్తంలోని షుగర్ లెవెల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ఇందులో ఉండే మెగ్నీషియం క్యాటలిస్టులా



పనిచేస్తుంది. జీవ రసాయనిక చర్యల్ని ప్రోత్సహిస్తుంది. ఇందులోని జింక్ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికీ, జీర్ణక్రియకు, షుగర్‌ని కంట్రోల్ చెయ్యడానికీ, టెన్షన్లను తట్టుకోవడానికీ ఉపయోగపడుతుంది.

పన్నీర్ ఎముకలకు బలాన్ని ఇస్తుంది. మనకు రోజూ అవసరమయ్యే కాల్షియంలో 8శాతం దీని ద్వారా లభిస్తుంది. ఇది పిల్లలు, పెద్దల్లో ఎముకలు పటిష్టంగా ఉండేలా చేస్తుంది. గర్భవతులైన మహిళలకు అత్యుత్తమైన ఆహారం ఇది.

శాఖాహారులకు ఇది మంచి ప్రొటీన్ సోర్స్. ఫాస్పరస్, ఫాస్ఫేట్‌లు జీర్ణక్రియను మెరుగుపరచి... మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసి, వాటిని వెలికి తీయడానికి సహాయపడతాయి.

ఇందులో ఉండే వే ప్రొటీన్.. ఎంతో ఆరోగ్యవంతమైనది. ప్లేయర్లు, ఎక్సర్‌సైజ్‌లు చేసేవారికి ఇది మేలు చేస్తుంది. ఇది చాలా నెమ్మదిగా జీర్ణం అవుతూ శక్తిని ఇస్తుంది. అందువల్ల అథ్లెటిక్స్, బాడీ బిల్డర్‌లు, స్ప్రింటర్‌లు, ఆటలు ఆడేవారికి ఇది ఎంతో మేలైన ప్రొటీన్.

రేచీకటిని నిరోధిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఆకలి లేకపోవడాన్ని నిరోధిస్తుంది. అలాగే ప్రొస్టేట్ రుగ్మతలను పోగొట్టి, వివిధ రకాల అంటువ్యాధులకు విరుద్ధంగా పోరాడుతుంది. సెలీనియం ఎక్కువగా ఉండే పన్నీర్‌ను వంటల్లో వేసుకొని తినడం వల్ల... మన శరీరంలోకి విష వ్యర్థాలు రాకుండా ఉంటాయి. అలాగే రకరకాల వ్యాధుల నుంచీ తప్పించుకోవచ్చు.

పన్నీర్‌లో పొటాషియం కూడా ఉంటుంది. ఇది బాడీలో ద్రవ నియంత్రణ పదార్థంగా పని చేస్తుంది. కండరాలు, బ్రెయిన్‌లో ముఖ్యమైన పదార్థం. రెగ్యులర్‌గా దీనిని తింటే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

ఒక నటిగా గుర్తింపు పొందాలంటే ఆటుపోట్లను ఎదుర్కోవల్సిందే. ఎంత గొప్ప నేపథ్యం ఉన్నా ఈ రంగంలో రాణించడమంటే కత్తి మీద సామే. అనేక సమస్యలు, అవమానాలు, అవహేళనలు భరించాలి. ఇలాంటివి ఎన్నో భరించి తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న గొప్ప నటి జ్యోతిక. చారడేసి కండ్లతో ఎటువంటి హావాభావలనైన ప్రదర్శించగల నటి. వారాయ్... లక లక లక అంటూ చంద్రముఖి పాత్రలో ఎప్పటికీ చెరిగిపోని ముద్ర వేసుకున్నారు. సామాజిక నేపథ్యంలో ఎన్నో చిత్రాల్లో నటిస్తూ, నిర్మిస్తూ స్వయంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆమె పుట్టినరోజు ఈరోజు. ఈ సందర్భంగా మానవిలో ఆమె పరిచయం...

'ఆ గౌరవమే ఆకర్షించింది'



జ్యోతిక 1978 అక్టోబర్ 18న ముంబయిలో పుట్టారు. తండ్రి చందర్ సదన, తల్లి సీమ సదన. వీరిది మతాంతర వివాహం. జ్యోతిక తండ్రి హిందువు, తల్లి ముస్లిం. తండ్రి సినీ నిర్మాత. జ్యోతిక ముంబయిలోని లెర్నర్స్ అకాడమీలో పదవతరగతి పూర్తి చేశారు. ఆ తర్వాత మీటీభాయ్ కాలేజ్‌లో సైకాలజీ డిగ్రీ చేశారు. ప్రముఖ నటి నగ్మ, రోషిణి, జ్యోతిక అక్క చెల్లెళ్లు.

సినీ రంగ ప్రవేశం

ప్రియదర్శన్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'డోలి సజాకె రఖ్న' అనే సినిమాతో జ్యోతిక సినీ రంగ ప్రవేశం చేశారు. అయితే ఈ సినిమా అనుకున్నంత విజయం సాధించలేదు. దాంతో ఆమె ఇతర భాషల్లో ప్రయత్నించారు. ముఖ్యంగా తమిళ చిత్రాల ద్వారా తన టాలెంట్ నిరూపించుకోవాలనుకున్నారు. 1999లో వాలి చిత్రంతో తమిళ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో ఇక వెనుతిరిగి చూడలేదు. జ్యోతికను అందరూ 'తమిళ పొన్ను' అని ముద్దుగా పిలుచుకునేవారు. ఈ చిత్రంలో తన నటనకు గాను బెస్ట్ ఫిమేల్ డెబ్యూ కేటగిరిలో ఫిలిమ్ ఫేర్ అవార్డు సైతం అందుకున్నారు. ఇక అవకాశాలు వెల్లువలా వచ్చి పడ్డాయి. తర్వాత రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్, అజిత్, సూర్య, శింబు వంటి హీరోలకు జంటగా నటించి పాపులర్ హీరోయిన్‌గా రాణించారు. ఇక 2003లో చిరంజీవి సరసన ఠాగూర్ సినిమాలో నటించి తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తర్వాత షాక్, మాస్ సినిమాల్లో నటించారు. ఇలా తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో నటించి బహుభాషా నటిగా గుర్తింపు పొందారు. తమిళ సినీ పరిశ్రమలో అత్యధిక పారితోషకం పొందిన నటీమణుల్లో ఒకరుగా పరిగణించబడ్డారు. 'ది హిందూ' ఆమెను భారతీయ సినిమాలోని సూపర్ స్టార్ మహిళల్లో ఒకరుగా పేర్కొంది.

మరువలేని చంద్రముఖి పాత్ర

జ్యోతిక బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సినిమా 'చంద్రముఖి'. ఈ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు జ్యోతిక ప్రధాన పాత్ర పోషించారు. ఈ చిత్రంలో చంద్రముఖి పాత్రతో తన సినీ కెరీర్‌లో చిరస్థాయిగా నిలిచిపోయారు. తన హావభావాలతో ప్రేక్షకులను కట్టిపడేశారు. ప్రేక్షకుల గుండెల్లో చంద్రముఖిగా తన పేరును ముద్రించుకున్నారు. ఈ చిత్రంలో ఆమె మానసిక వ్యాధితో బాధపడుతున్న మహిళగా నటించారు. రాధా మోహన్ దర్శకత్వం వహించిన మోజీలో కూడా చెవిటి మంచీశీఅవగాగ అమ్మాయిగా కనిపించి తన నటనతో ప్రేక్షకులను మెప్పించి బోరా అనిపించింది.



సూర్యతో వివాహం

కెరియర్ మంచి పీక్ స్టేజ్‌లో ఉండగా ఆమె సూర్యను ప్రేమించి పెళ్లాడారు. అతన్ని పెండ్లి చేసుకోవడానికి కారణం అతను మహిళలకు ఇచ్చే గౌరవం అని, ఆ గౌరవం తనను ఎక్కువగా ఆకర్షించేలా చేసిందని ఆమె అనేక సందర్భాల్లో చెప్పారు. అందుకే సూర్య పెండ్లి ప్రస్తావన తేవడంతో పెద్దల అంగీకారంతో 2006లో వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత నటనకు కాస్త విరామం ఇచ్చారు. అది కూడా కుటుంబం కోసమే. ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తర్వాత మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చారు. ఇటీవల బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చి సైతాన్ చిత్రంతో సక్సెస్ సాధించారు. దీంతో హిందీలో మరిన్ని అవకాశాలు ఈమె తలుపు తడుతున్నాయి. జ్యోతిక ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'ఉడెన్ పిరప్పే'. ఇందులో శశి కుమార్ సముద్రఖని ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని సూర్య, జ్యోతిక తమ 2డి ఎంటర్టైన్మెంట్ పతాకంపై నిర్మించారు. ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. ఇది జ్యోతికకు చాలా నచ్చిన చిత్రం కావడం విశేషం.

నిర్మాతగా

జ్యోతిక నిర్మాతగా కూడా పలు మంచి సినిమాలు నిర్మించారు. 36 వయసులో, ముగువలు మాత్రమే, పొన్నగల్ వందాళ్, ఆకాశం నీ హద్దురా, జై భీమ్, ఓ మై డాగ్ వంటి సినిమాలను నిర్మించి ప్రొడ్యూసర్‌గా కూడా ఇండస్ట్రీలో ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. జ్యోతిక నిర్మించిన 'ఆకాశం నీ హద్దురా' చిత్రం ఏకంగా ఐదు జాతీయ అవార్డులు గెలుచుకోవడం విశేషం.

సామాజిక సేవ

జ్యోతిక, సూర్య కలిసి అగనం ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తమిళనాడులోని నిరుపేద విద్యార్థులనే ఈ ఫౌండేషన్ ద్వారా చదివిస్తున్నారు. అంతేకాకుండా పేద పిల్లలకు పలు రకాల వైద్య సౌకర్యాలు అందిస్తున్నారు. శ్రీలంకలోని తమిళ శరణార్థులకు కూడా సూర్య, జ్యోతిక సహాయం అందిస్తున్నారు. తంజావూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్థిక సహాయంతో పాటు వైద్య పరికరాలు, పడకలను కూడా విరాళంగా అందించారు. తమిళనాడు గిరిజన సంఘం సంక్షేమానికి కోటి రూపాయలు విరాళంగా ఇచ్చారు.



- పాలపర్తి సంధ్యారాణి

పురస్కారాలు

జ్యోతిక తమిళంలో నటించిన మొదటి సినిమా వాలికి తన మొదటి ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. అలాగే మూడు సార్లు జాతీయ ఉత్తమ అవార్డులు, సౌత్ ఫిలింఫేర్ అవార్డ్స్‌లో ఉత్తమ తమిళ నటిగా 16 నామినేషన్లతో గరిష్ట సంఖ్యలో నామినేషన్లను కలిగియున్న రికార్డు ఆమె సొంతం.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

(మొదటిపేజీ తరువాయి)

కూడా సొంత భవనాల నిర్మాణాలు చేపట్టలేదని తెలిపారు. మరోవైపు ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీలు కూడా విద్యార్థులకు కనీసస్థాయి ఆహారానికి సరిపోవడం లేదని తెలిపారు. ఆరేండ్ల నాటి మెనూనే కొనసాగిస్తున్నందున ప్రభుత్వ మెనూకూ, సరుకుల ధరలకూ పొంతన లేదని పేర్కొన్నారు. దీంతో హాస్టళ్లలో కుళ్లిపోయిన కూరగాయలు, నాసిరకమైన సరుకుల ద్వారా ఫుడ్ పాయిజన్ అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా మెస్ చార్జీలు పెంచాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి రాకపోవడం శోచణీయమని తెలిపారు. గురుకులాల్లో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులే చదువుతున్నందున, వారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అద్దెలు చెల్లించి భవనాలకు వేసిన తాళాలను తీయించాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే సరుకులను గురుకులాలకు సరఫరా చేయాలని కోరారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో చదువులకు ఇలాంటి ఆటంకం కలగకుండా సొంత భవనాల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

హర్యానా సీఎంగా సైనీ ప్రమాణస్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

బండారు దత్తాత్రేయ ఆయనతో ప్రమాణం చేయించారు. దీనికి ముందు ఆయన వాల్మీకి ఆలయంలో పూజలు చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం వేగంగా ముందుకు వెళ్తుందని చెప్పారు. పంచకులలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్డీయే కూటమి నేతలు హాజరయ్యారు. ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. బుధవారం జరిగిన బీజేపీ శాసనసభా పక్ష భేటీలో నాయబ్‌సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, సీనియర్ నేత అనిల్ విజ్ ఆయన పేరును ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

అగర్తలా - లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

తమ సహాయక బృందాలు అక్కడికి చేరుకున్నాయని పేర్కొన్నారు. ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. అయితే ఈ ఘటనతో లుమ్‌డింగ్-బాదర్‌పూర్ సింగిల్-లైన్ హిల్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్టు వెల్లడించారు.

ప్రయాణికులకు ఇండియన్ రైల్వే షాక్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రయాణికులకు ఇండియన్ రైల్వే షాక్ ఇచ్చింది. రైల్వే అడ్వాన్స్ రిజర్వేషన్ల వ్యవధిని 120 రోజుల నుంచి 60 రోజులకు తగ్గిస్తూ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నూతన అడ్వాన్ రిజర్వేషన్ పీరియడ్(ఏఆర్పీ) నిబంధన నవంబర్ 1 నుంచి అమలులోకి రానున్నట్టు వెల్లడించింది. అయితే పగటి పూట నడిచే తాజ్ ఎక్స్‌ప్రెస్, గోమతి ఎక్స్‌ప్రెస్, విదేశీయులకు 365 రోజుల ఏఆర్పీ పరిమితిలో మార్పు ఉండదని స్పష్టం చేసింది. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు రైల్వే శాఖ గురువారమొక ప్రకటనలో పేర్కొంది. 61 నుంచి 120 రోజుల వ్యవధిలో చేసిన రిజర్వేషన్లలో దాదాపు 21 శాతం రద్దు చేయబడుతున్నాయని తెలిపింది. మరో 5 శాతం మంది ప్రయాణం చేయలేకపోయినా తమ టికెట్లను రద్దు చేసుకోవడం లేదని తెలిపింది. ప్రధానంగా ముందస్తు రిజర్వేషన్ల కారణంగా నో షో ట్రెండ్ కొనసాగుతోందని, దీన్ని తగ్గించడం కోసం ఈ కొత్త పాలసీని తీసుకువస్తున్నట్టు వెల్లడించింది. అవసరమైన ప్రయాణికులకు టిక్కెట్ల లభ్యతను మెరుగుపరచడం, రిజర్వ్ బెర్త్‌ల ఖాళీని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపింది. ఈ తాజా నిర్ణయంతో పండుగలు, పీక్ సీజన్లలో ప్రత్యేక రైళ్లు వేసేందుకు దోహదపడుతుందని వివరించింది. 2015 ఏప్రిల్ 1 నుంచి ఉన్న 120 రోజుల అడ్వాన్స్ రిజర్వేషన్ల వ్యవధిని 2024 నవంబర్ 1 నుంచి 60 రోజులకు కుదించింది.

పకడ్బందీగా గ్రూప్-1 మెయిన్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏ విధమైన పొరపాట్లకు తావు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి స్పష్టం చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి చైర్మెన్ మహేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొనగా, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని చెప్పారు. దీనికోసం 46 పరీక్షా కేంద్రాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏర్పాటు చేశామని వివరించారు. ఈ పరీక్షలు నిర్వహించే అన్ని కేంద్రాల వద్ద ఏ విధమైన అవకతవకలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు, విస్తృత స్థాయిలో సీనియర్ అధికారులతో పర్యవేక్షణను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్లు నేరుగా ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారనీ, సంబంధిత పోలీస్ కమిషనర్లు కూడా తగు బందోబస్తు ఏర్పాట్లను చేపడతారని వివరించారు. అన్ని శాఖల అధికారులు ఏవిధమైన స్వల్ప సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా ఈ పరీక్షల నిర్వహణ విధులను నిర్వహించాలని ఆమె ఆదేశించారు.

టీజీపీఎస్సీ చైర్మెన్ ఎం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 2011 సంవత్సరం తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. కొన్నేండ్ల అనంతరం జరిగే ఈ పరీక్షల నిర్వహణలో ప్రతీ అంశంలోనూ అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాల్‌తో కూడుకుంటున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో ఏ విధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి చెప్పారు. గ్రూప్-1 మెయిన్స్ జరిగే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విస్తృతమైన బందోబస్తుతోపాటు పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేందుకు అన్ని చర్యలూ చేపట్టామని డీజీపీ జితేందర్ అన్నారు.

టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎనిమిది, రంగారెడ్డిలో 11, మేడ్చల్ మల్కాజిగిరిలో 27 కలిపి మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేశామని చెప్పారు. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా ఈ పరీక్షలను పర్యవేక్షిస్తామని అన్నారు. పరీక్షల నిర్వహణలో ప్రతి అంశంలోనూ కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలను అందజేశామని వివరించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని చెప్పారు. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 85 శాతం మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు.

వికలాంగులకు ప్రత్యేకంగా ఒక గంటను అదనంగా కేటాయిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైతే పరీక్ష రాయడానికి సహాయకులు (స్క్రైబ్) అవసరమో, ఆ అభ్యర్థుల హాల్‌టికెట్లపై ప్రత్యేకంగా పేర్కొన్నామనీ, వారి సహాయంతో పరీక్షలు రాసేందుకు ప్రత్యేకంగా నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. 46 పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్ చెప్పారు. పరీక్షలు జరిగే సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు చేపట్టామనీ, ఇందు కోసం ముగ్గురు సీఈలు పర్యవేక్షిస్తారని ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు. పరీక్షలు నిర్వహించే రోజుల్లో అన్ని కేంద్రాలకూ ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 14 నుంచి గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 21 వరకు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశమున్నది.

వివాహ వ్యవస్థే దెబ్బతింటుంది

(మొదటిపేజీ తరువాయి)

బలవంతంగా లైంగికదాడికి పాల్పడితే అతన్ని విచారించవచ్చా అన్న అంశంపై సుప్రీంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం వీటిపై విచారణ చేపట్టింది. వివాహ బంధంలో ఉన్న వారిపై చర్యలు తీసుకుంటే, అప్పుడు వివాహ వ్యవస్థ దెబ్బతినే అవకాశాలు ఉన్నట్టు కోర్టు అభిప్రాయపడింది.

సీనియర్ న్యాయవాది కరుణా నందీ ఓ పిటిషనర్ తరఫున వాదించారు. వైవాహిక జీవితంలో భర్త లైంగికదాడిపై ఐపీసీ, బీఎన్ఎస్‌లో ఉన్న చట్టాలను ఆమె కోర్టుకు వివరించారు. ఇది రాజ్యాంగబద్ధమైన ప్రశ్న అని, తమ కన్నా ముందు రెండుసార్లు ఈ అంశంపై కోర్టు తీర్పులు వెలువరించిందని, శిక్షకు సంబంధించిన కీలకమైన అంశంపై మరోసారి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సీజే చంద్రచూడ్ తెలిపారు.

రాజ్యాంగ వ్యతిరేకమైన ఓ నియమాన్ని కొట్టిపారేయాలని కరుణా నందీ కోరారు. ఆ సమయంలో కోర్టు స్పందిస్తూ 18 ఏండ్లు దాటిన భార్యతో లైంగిక చర్యకు పాల్పడడాన్ని లైంగికదాడిగా భావించలేమని పేర్కొన్నది. ఐపీసీలోని సెక్షన్ 375 నుంచి మినహాయింపు ఉన్న విషయాన్ని కోర్టు గుర్తు చేసింది.ఆ సెక్షన్ ప్రకారం మైనర్ కాని భార్యపై లైంగికదాడికి పాల్పడటం నేరం కాదు. కొత్తగా ప్రవేశపెట్టిన బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం కూడా మినహాయింపు ఉన్నట్టు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఆ సెక్షన్ ప్రకారం కూడా ఇది తప్పు కాదని తెలిపింది. అయితే దంపతుల మధ్య అనుమతి లేని సంసార జీవితాన్ని నేరంగా భావిస్తే, అది సామాజిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని తమ పిటిషన్‌లో కేంద్రం వాదించింది. సహజీవనం చేస్తున్న మహిళపై అనుమతి లేకుండా లైంగికదాడికి పాల్పడితే మాత్రం అది లైంగికదాడే అవుతుందని, మరి వివాహిత మహిళపై పదేపదే క్రూరమైన చర్యకు పాల్పడితే అది లైంగికదాడి ఎందుకు కాదని న్యాయవాది కరుణ ప్రశ్నించారు. ఈ అంశంపై శుక్రవారం కూడా కోర్టులో వాదనలు జరగనున్నాయి.

పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6ఎ రాజ్యాంగబద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

వెలువరించింది. జస్టిస్ జె.బి.పార్దీవాలా మాత్రం ఈ సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమైనదని అభిప్రాయపడ్డారు. అస్సాంలో అక్రమ వలసదారులకు భారత పౌరసత్వం మంజూరు చేయడానికి సంబంధించినది ఈ సెక్షన్. అక్రమ వలసల సమస్యకు అస్సాం ఒప్పందం రాజకీయ పరిష్కారాన్ని అందించిందని చంద్రచూడ్ పేర్కొన్నారు. 1955లో తీసుకువచ్చిన పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6ఎను ప్రత్యేక నిబంధనగా పొందుపరిచారు. 1985 ఆగస్టు 15న అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం, అస్సాం ఉద్యమ నేతలతో చర్చలు జరిపి ఒప్పందాన్ని కుదుర్చుకుని సంతకాలు చేసింది. అక్రమ శరణార్థులను గుర్తించి, వారిని తరలించాలనే డిమాండ్‌తో ఆరేళ్ళపాటు అఖిల అస్సాం విద్యార్థుల యూనియన్ (అసు) ఆందోళనలు, ఉద్యమాలు జరిపింది. వలసలకు సంబధించి తలెత్తే ఆర్థిక ప్రభావాలతో వలసలకు సంబంధించిన మానవతా సాయాన్ని ఈ సెక్షన్ సమతూకం చేస్తుందని చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. మానవతా కోణానికి సంబంధించిన ఆందోళనలను ఈ సెక్షన్ పరిష్కరిస్తోందన్నారు. పైగా కటాఫ్ తేదీ 1971 మార్చి 25 కూడా సహేతుకమైనదేనన్నారు. సెక్షన్ 6ఎ అనేది తక్కువగా ప్రజలను కలుపుకోలేదు, అలా అని ఎక్కువగా కూడా కలుపుకోవడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ జాతుల గ్రూపులు వుండడం వల్ల సాంస్కృతిక హక్కులు ఉల్లంఘించబడడం లేదన్నారు. విదేశీయులను గుర్తించడమనేది చాలా విస్తారమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. "ఒక వ్యక్తి విదేశీయుడు అని అనుమానం వస్తే, ఆ వ్యక్తి 1966-1971 మధ్య వచ్చి వుంటే తాను దేశ పౌరుడినే అని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆ వ్యక్తి మీదే వుంటుందని జస్టిస్ పార్దీవాలా పేర్కొన్నారు.

చీకటి ప్రపంచంలో ఎమోజీలు !

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడే వారు సైతం ఎమోజీలనే అడ్డం పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా మన ఫోన్‌కో, వాట్సప్‌లో, ఫేస్‌బుక్‌లో ఓ లింక్ పంపుతారు. అది ఎంతో స్నేహపూర్వకంగా, చిరునవ్వు చిందించే ఎమోజీతో కూడి ఉంటుంది. మనం దానిపై క్లిక్ చేస్తే అంతే సంగతులు...మన వ్యక్తిగత సమాచారం మొత్తం వారి చేతిలోకి వెళుతుంది.

డిస్‌గొమోజీ మాల్‌వేర్‌తో...

'డిస్‌గొమోజీ' అనే మాల్‌వేర్ ఒకటుంది. సమాచార మార్పిడి కోసం అది ఎమోజీలను ఉపయోగిస్తుంది. అమెరికా సైబర్ సెక్యూరిటీ సంస్థ ఒలెక్సిటీ చెప్పిన దాని ప్రకారం డిస్‌గొమోజీని పాకిస్తాన్ నుండి కొందరు నిర్వహిస్తున్నారు. మన ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకునేందుకు ఈ మాల్‌వేర్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. అది లైనెక్స్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తోంది. సైబర్ సెక్యూరిటీ దాడికి పాల్పడే ఈ-మెయిల్స్ ద్వారా డిస్‌గొమోజీ మాల్‌వేర్ వ్యాపిస్తుంది. ఇది మాల్‌వేర్ డాక్యుమెంటును తెరిచి చూసేలా మనలను ప్రోత్సహిస్తుంది. మాల్‌వేర్‌లో డిస్కార్డ్ అనే ఛాటింగ్ వేదిక కన్పిస్తుంది. దాని ద్వారా ఆపరేటర్లతో మాట్లాడాలని సూచిస్తుంది. ఎమోజీల ద్వారా ఆదేశాలు పంపుతుంది. ఈ చిన్న చిన్న ఎమోజీలు స్క్రీన్‌షాట్లు తీయాలని, ఫైల్స్‌ను అప్‌లోడ్ చేయాలని, కీలక సమాచారాన్ని దొంగిలించాలని మాల్‌వేర్‌కు సందేశాన్ని ఇస్తాయి. అంతే...మన సమాచారమంతా దాని చేతిలో ఉంటుంది.

ఈ సీఎం..ఇండ్లను కూల్చే గుంపు మేస్త్రీ

(మొదటిపేజీ తరువాయి)

లోపభూయిష్ట విధానాల వల్ల ఆ పరీక్ష రద్దయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల విషయంలోనూ రేవంత్ సర్కార్ యువతను మోసపుచ్చుతోందని దుయ్యబట్టారు.

గురుకులాల భవనాలకు అద్దెలు చెల్లించేందుకు కాంగ్రెస్ సర్కారు వద్ద డబ్బుల్లేవుగానీ, మూసీలో పారబోసేందుకు రూ.లక్షన్నర కోట్లున్నాయంటూ కేటీఆర్ ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని కూడా తీసేయటం శోచనీయమన్నారు. అధిష్టానానికి డబ్బుల మూటలు అందించేందుకు 25 సార్లు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేసిన సీఎం...కేంద్రం నుంచి 25 పైసలు కూడా తీసుకు రాలేకపోయారని ఎద్దేవా చేశారు. తాము గెలుస్తామని అనుకోలేదనీ, అందువల్లే అడ్డగోలు హామీలనిచ్చామంటూ ఓ మంత్రి ఇటీవల తనతో చెప్పారని అన్నారు. రేవంత్ సర్కారు పరిస్థితి ఆ విధంగా ఉంది, అక్కడ ఎవరి దుకాణం వారిదేనని వ్యాఖ్యానించారు. మరోవైపు బీజేపీ... మతాన్ని అడ్డంపెట్టుకుని ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు అనేక పథకాలను మంజూరు చేస్తున్న కేంద్రం, తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీనిగానీ, నవోదయ పాఠశాలను గానీ ఇవ్వలేదని విమర్శించారు.

21న డీసెట్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

30న సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు ఈనెల 21న ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ డైట్ కాలేజీల్లో ఈనెల 21న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. గతంలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈనెల 23 నుంచి 26 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. ఈనెల 30న సీట్లు కేటాయిస్తామని వివరించారు. 30 నుంచి వచ్చేనెల మూడో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో ఫీజు చెల్లించి అడ్మిషన్ లెటర్‌ను పొందాలని సూచించారు. వచ్చేనెల నాలుగో తేదీన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఇతర వివరాలకు https://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

46 ఆలౌట్

- చిన్నస్వామిలో కుప్పకూలిన భారత్
- నిప్పులు చెరిగిన కివీస్ పేసర్లు
- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 180/3

భారత్, న్యూజిలాండ్ తొలి టెస్టు రెండో రోజు

టీమ్ ఇండియాకు చిన్నస్వామిలో పీడకల మిగిల్చింది!. తొలి రోజు వర్షార్పణం కాగా.. రెండో రోజు కివీస్ పేసర్లు భారత బ్యాటింగ్ లైనప్‌పై మూకుమ్మడి దాడి చేశారు. పిచ్‌పై తేమ, మేఘావృత వాతావరణ పరిస్థితులను అద్భుతంగా వినియోగించుకున్న న్యూజిలాండ్ పేసర్లు.. భారత్‌ను 46 పరుగుల అత్యల్ప స్కోరుకు కుప్పకూల్చారు. సొంతగడ్డపై భారత్‌కు టెస్టుల్లో ఇదే అత్యల్ప స్కోరు. బంతితో కోలుకోలేని దెబ్బకొట్టిన న్యూజిలాండ్.. బ్యాట్‌తోనూ మెప్పించింది. డెవాన్ కాన్వే (91) మెరుపులతో తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగుల ముందంజలో కొనసాగుతుంది. భారత్ స్పిన్ మాయ మొదలెట్టినా.. న్యూజిలాండ్ పరుగుల వేటలో ముందుకెళ్లింది. బంతితో, బ్యాట్‌తో మెరిసిన కివీస్ తొలి టెస్టు రెండో రోజు ఏకపక్ష ప్రదర్శన చేసింది.

నవతెలంగాణ-బెంగళూర్



సొంతగడ్డపై వరుసగా ఆరు టెస్టుల్లో అప్రతిహత విజయాలు సాధించిన టీమ్ ఇండియాకు.. చిన్నస్వామి స్టేడియంలో న్యూజిలాండ్ ఝలక్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది!. పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 31.2 ఓవర్లలో 46 పరుగులకే కుప్పకూలింది. రిషబ్ పంత్ (20, 49 బంతుల్లో 2 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (13, 63 బంతుల్లో 1 ఫోర్) మాత్రమే రెండెంకల స్కోరు అందుకున్నారు. విరాట్ కోహ్లి (0), సర్ఫరాజ్ ఖాన్ (0), కెఎల్ రాహుల్ (0), రవీంద్ర జడేజా (0), రవిచంద్రన్ అశ్విన్ (0) సున్నా పరుగులకే అవుటవగా.. రోహిత్ శర్మ (2), కుల్దీప్ యాదవ్ (2), జశ్‌ప్రీత్ బుమ్రా (1) ఖాతా తెరిచారు. న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ (5/15) ఐదు వికెట్లు పడగొట్టగా.. విలియం ఓరౌర్క్ (4/22) నాలుగు వికెట్లతో చెలరేగాడు. ఓపెనర్ డెవాన్ కాన్వే (91, 105 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సులు) ధనాధన్ మెరుపులతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లలో 180/3 పరుగులు చేసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగుల ముందంజలో కొనసాగుతుంది.

పేస్‌కు దాసోహం

టాస్ నెగ్గిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. రోహిత్ శర్మ తీసుకున్న నిర్ణయం చారిత్రక తప్పిదమని తెలుసుకునేందుకు పెద్దగా సమయం పట్టలేదు. పిచ్‌పై తేమ, మేఘావృత పరిస్థితుల్లో తొలి బంతి నుంచే నిప్పులు చెరిగిన న్యూజిలాండ్ ఓపెనర్లను ఇరకాటంలో పడేసింది. ఇన్నింగ్స్ ఏడో ఓవర్లో రోహిత్ (2)ను క్లీన్‌బౌల్డ్ చేసిన సౌథీ వికెట్ల పతనాన్ని షురూ చేయగా.. ఆ తర్వాత కథ మాట్ హెన్రీ, విలియం ఓరౌర్క్ చూసుకున్నారు. పదునైన పేస్, సీమ్‌తో రెచ్చిపోయిన హెన్రీ, ఓరౌర్క్ టపటపా వికెట్లను పడగొట్టారు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన విరాట్ కోహ్లి (0), యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ (0) డకౌట్‌గా నిష్క్రమించారు. రిషబ్ పంత్ (20), యశస్వి జైస్వాల్ (13) వికెట్ల పతనాన్ని కాసేపు నిలువరించారు. డ్రింక్స్ విరామం అనంతరం జైస్వాల్ అవుటగా.. కెఎల్ రాహుల్ (0), రవీంద్ర జడేజా (0), రవిచంద్రన్ అశ్విన్ (0)లు సున్నా పరుగులకే పెవిలియన్‌కు చేరారు. రెండు ఫోర్లతో మెరిసిన రిషబ్ పంత్ జట్టును కనీసం 50 పరుగుల మార్క్‌కు సైతం చేర్చలేకపోయాడు. టెయిలెండర్లు కుల్దీప్ (2), బుమ్రా (1) సైతం తేలిపోయారు. సిరాజ్ (4 నాటౌట్) అజేయంగా నిలిచాడు. కొత్త పేసర్ విలియం ఓరౌర్క్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. మాట్ హెన్రీ ఐదు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. 31.2 ఓవర్లలోనే భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. సొంతగడ్డపై ఇది టీమ్ ఇండియా అత్యల్ప స్కోరు కావటం గమనార్హం.

కాన్వే దూకుడు

ఓపెనర్ డెవాన్ కాన్వే (91) దూకుడుతో న్యూజిలాండ్ వేగంగా పరుగులు పిండుకుంది. స్పిన్‌పై ఎదురుదాడి చేసిన కివీస్ ఓపెనర్లు దంచికొట్టారు. స్వీప్ షాట్లతో దూకుడు చూపించిన కాన్వే 11 ఫోర్లు, 3 సిక్సర్లతో ధనాధన్ మోత మోగించాడు. టామ్ లేథమ్ (15)ను కుల్దీప్ అవుట్ చేసినా.. విల్ యంగ్ (33, 73 బంతుల్లో 5 ఫోర్లు)తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించాడు. సెంచరీ ముంగిట కాన్వే అవుటైనా.. రచిన్ రవీంద్ర (22 నాటౌట్, 34 బంతుల్లో 2 ఫోర్లు), డార్లీ మిచెల్ (14 నాటౌట్, 39 బంతుల్లో 1 ఫోర్) జోరు కొనసాగించారు. 50 ఓవర్లలో 3.60 రన్‌రేట్‌తో న్యూజిలాండ్ 180 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగుల ముందంజలో నిలిచింది. భారత స్పిన్నర్లు కుల్దీప్, అశ్విన్, జడేజా తలా ఓ వికెట్ పడగొట్టారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) అజాజ్ (బి) ఓరౌర్క్ 13, రోహిత్ శర్మ (బి) సౌథీ 2, విరాట్ కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) ఓరౌర్క్ 0, సర్ఫరాజ్ ఖాన్ (సి) కాన్వే (బి) హెన్రీ 0, రిషబ్ పంత్ (సి) లేథమ్ (బి) హెన్రీ 20, కెఎల్ రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఓరౌర్క్ 0, రవీంద్ర జడేజా (సి) అజాజ్ (బి) హెన్రీ 0, రవిచంద్రన్ అశ్విన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0, కుల్దీప్ యాదవ్ (సి) బ్రాస్‌వెల్ (బి) హెన్రీ 2, బుమ్రా (సి) హెన్రీ (బి) ఓరౌర్క్ 1, మహ్మద్ సిరాజ్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం :** (31.2 ఓవర్లలో ఆలౌట్) 46.

వికెట్ల పతనం : 1-9, 2-9, 3-10, 4-31, 5-33, 6-34, 7-34, 8-39, 9-40, 10-46.

బౌలింగ్ : టిమ్ సౌథీ 6-4-8-1, మాట్ హెన్రీ 13.2-3-15-5, విలియమ్ ఓరౌర్క్ 12-6-22-4.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : టామ్ లేథమ్ (ఎల్బీ) కుల్దీప్ యాదవ్ 15, డెవాన్ కాన్వే (బి) అశ్విన్ 91, విల్ యంగ్ (సి) కుల్దీప్ యాదవ్ (బి) రవీంద్ర జడేజా 33, రచిన్ రవీంద్ర నాటౌట్ 22, డార్లీ మిచెల్ నాటౌట్ 14, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం :** (50 ఓవర్లలో 3 వికెట్లకు) 183.

వికెట్ల పతనం : 1-67, 2-142, 3-154.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 10-4-23-0, మహ్మద్ సిరాజ్ 7-1-21-0, రవిచంద్రన్ అశ్విన్ 11-1-46-1, కుల్దీప్ యాదవ్ 12-1-57-1, రవీంద్ర జడేజా 10-0-28-1.

పిచ్‌ను అర్థం చేసుకోలే : రోహిత్

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో టీమ్ ఇండియా 46 పరుగులకు ఆలౌట్ కావటంపై కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకోవటం చెత్త నిర్ణయమని, పిచ్‌ను అర్థం చేసుకోలేకపోయానని పూర్తి బాధ్యత తీసుకున్నాడు. 'పిచ్‌ను చూస్తాం, అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తాం, ఓ నిర్ణయం తీసుకుంటాం. కొన్నిసార్లు సరైనది, మరికొన్ని సార్లు సరైనది కాదు. ఈ రోజు నేను సరైన నిర్ణయం తీసుకోలేదు. ఈ స్కోరు నన్ను మరింత బాధించింది. జట్టుగా మేము దీన్ని ఓ సవాల్‌గా తీసుకున్నాం. ఈసారి ప్రత్యర్థి సవాల్‌కు మేము సరైన రీతిలో స్పందించలేదు' అని రోహిత్ శర్మ అన్నాడు.

బెంగళూర్‌లో భారీ వర్షంతో మ్యాచ్‌కు ముందు నుంచి పిచ్‌ను కవర్లలో కప్పి ఉంచారు. పది కార్పెట్లతో పిచ్‌ను కప్పి.. ఆపై కవర్లను ఉంచారు. తొలి రోజు సైతం వర్షంతో పిచ్‌పై కవర్లను తొలగించలేదు. వాతావరణ పరిస్థితులను భారత్ లెక్కలోకి తీసుకోలేదు. పిచ్ స్వభావం దృష్ట్యా ముగ్గురు స్పిన్నర్లను ఎంచుకుంది. న్యూజిలాండ్ సైతం తొలుత బ్యాటింగ్ చేయాలని అనుకున్నా.. జట్టులోకి ముగ్గురు సీమర్లను తీసుకుంది. సాధారణంగా వర్షం ప్రభావిత మ్యాచుల్లో తొలుత బౌలింగ్ చేయటం పరిపాటి. కానీ రోహిత్‌శర్మ, గౌతం గంభీర్ తొలుత బ్యాటింగ్ ఎంచుకోవాలని భావించారు. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు సన్నాహకంగా బెంగళూర్‌లో టీమ్ ఇండియా ఓ ప్రయోగం చేసిందని సైతం అనుకోవచ్చు. కానీ విదేశీ టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం స్వదేశీ టెస్టును పణంగా పెట్టడంపై విమర్శలు వస్తున్నాయి.

క్వార్టర్స్‌లో సింధు

డెన్మార్క్ ఓపెన్ 2024



న్యూఢిల్లీ : భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి సింధు డెన్మార్క్ ఓపెన్ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో వరల్డ్ నం.7, నాల్గో సీడ్ చైనా షట్లర్ హన్‌పై సింధు 18-21, 21-12, 21-16తో మూడు గేముల మ్యాచ్‌లో విజయం సాధించింది. ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌లో చైనా షట్లర్ పైచేయి సాధించగా.. ఆ తర్వాత వరుసగా రెండు గేముల్లో సింధు అదరగొట్టింది. గంటకు పైగా సాగిన మ్యాచ్‌లో తొలుత సింధు వెనుకంజ వేసినా.. గొప్పగా పుంజుకుని గెలుపొందింది. వరల్డ్ టూర్ సూపర్ 750 టోర్నమెంట్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న సింధు.. గ్రెగోరియ లేదా మియాతో తలపడనుంది.

వేలం వేదిక రియాద్!

నవంబర్ 24, 25న ఆటగాళ్ల వేలం



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 ఆటగాళ్ల వేలం కొత్త వేదికకు మారనుంది. గత ఏడాది దుబాయ్‌లో నిర్వహించగా.. ఈ సీజన్ ఈవెంట్‌ను సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నిర్వహించేందుకు బీసీసీఐ ఆలోచన చేస్తోంది. లండన్, సింగపూర్‌లను సైతం పరిశీలించినా.. ప్రసారదారు సౌలభ్యత, సారూప్య సమయ వేళలతో రియాద్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఫ్రాంచైజీలకు త్వరలోనే అధికారికంగా బీసీసీఐ నుంచి సమాచారం అందనుంది. బీసీసీఐ ఉన్నతాధికారులు, ఐపీఎల్ టీమ్, పది ఫ్రాంచైజీల ప్రతినిధులు సహా జియో, డిస్నీస్టార్ సిబ్బంది మూడు రోజుల పాటు రియాద్‌లో ఉండేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



నేటి నుంచి ప్రొ కబడ్డీ

తొలి మ్యాచ్‌లో టైటాన్స్, బుల్స్ ఢీ

హైదరాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్ (పికెఎల్) 11వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. 12 నగరాల ఫార్మాట్ నుంచి మూడు నగరాల షోకు మారిన పికెఎల్ నేటి నుంచి ఆరంభం కానుంది. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, బెంగళూర్ బుల్స్ తలపడనున్నాయి. తొలి రోజు రెండో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ, యు ముంబా పోటీపడనున్నాయి. పది సీజన్లు విజయవంతంగా ముగించుకున్న ప్రొ కబడ్డీ లీగ్.. ఈ సీజన్‌లో సరికొత్తగా అలరించేందుకు ముస్తాబైందని లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తెలిపారు. గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో 12 జట్ల కెప్టెన్లు, లీగ్ నిర్వాహకులు హాజరయ్యారు.

డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్, రన్నరప్ హర్యానా స్టీలర్స్ మరోసారి ఫైనల్స్‌పై కన్నేయగా.. తెలుగు టైటాన్స్ వరుస వైఫల్యాలకు చెక్ పెట్టాలనే ఏకైక లక్ష్యంతో బరిలోకి దిగుతోంది.

గెలుపు బాట పట్టేనా?

ఉత్తరాఖాండ్‌తో హైదరాబాద్ రంజీ పోరు

డెహ్రాడూన్ : రంజీ ట్రోఫీ ఎలైట్ రీ ఎంట్రీలో పరాజయం చవిచూసిన హైదరాబాద్.. నేడు ఉత్తరాఖాండ్‌తో మ్యాచ్‌లోనైనా గెలుపు బాట పట్టాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్ బౌలర్లు మెరిసినా.. బ్యాటర్లు అంచనాలను అందుకోలేదు. తొలి మ్యాచ్‌లో గుజరాత్‌ను స్వల్ప స్కోరుకు ఆలౌట్ చేసే అవకాశం చేజార్చుకుని ఓటమి కోరల్లో కూరుకుంది. తొలి మ్యాచ్‌లో ఉత్తరాఖాండ్ సైతం హిమాచల్ చేతిలో ఓటమి చెందింది. నేడు డెహ్రాడూన్ వేదికగా హైదరాబాద్ రంజీ ట్రోఫీలో రెండో మ్యాచ్ ఆడనుంది. రాహుల్ సింగ్, తన్మయ్ అగర్వాల్, రోహిత్ రాయుడు, తన్మయ్ అగర్వాల్, సివి మిలింద్ హైదరాబాద్‌కు కీలకం కానున్నారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



శ్రీను వైట్ల, గోపీచంద్

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబోలో రూపొందిన చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు.
దోనేపూడి చక్రపాణి సమర్పించారు. దసరా కానుకగా రిలీజైన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించిన బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్‌తో ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా మేకర్స్ దసరా బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ నిర్వహించారు.
హీరో గోపీచంద్ మాట్లాడుతూ,'ఈ సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులు థ్యాంక్స్. ఇంత మంచి సక్సెస్ ఇచ్చినందుకు మీ అందరికీ ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఈ సినిమా విషయంలో డైరెక్టర్‌ని బ్లైండ్‌గా నమ్మేశాను. చాలా మంచి రిజల్ట్ ఇచ్చారు. థియేటర్స్‌లో ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది. కామెడీ, యాక్షన్, ఎమోషన్ అన్ని సీన్స్‌ని చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇందులో చిన్న పాప అద్భుతంగా నటించింది. ఆ పాప సెంటిమెంట్ కూడా బాగా వర్క్ అవుట్ అయింది. వర్డ్ ఆఫ్ మౌత్ అని వింటా ఉన్నాను. కానీ ఈ సినిమాకి చూశాను. ప్రేక్షకులు ఓన్ చేసుకుంటే సినిమాని ఎంత దూరమైనా తీసుకెళ్తారని ఈ సినిమాతో నిరూపించారు' అని తెలిపారు.
'ఈ సినిమాతో వర్డ్ ఆఫ్ మౌత్ పవర్ ఏంటో తెలుసుకున్నాను. ఎందుకంటే ఈ సినిమా త్రీ ట్రైమ్స్ హైయ్యర్ రెవెన్యూ సెకండ్ డే చేసింది. వీక్ డేస్‌లో కూడా అదే కంటిన్యూ అవుతుంది. దీని అంతటికి కారణం వర్డ్ ఆఫ్ మౌత్. మా సినిమాకి ఇంత పెద్ద ఘన విజయం ఇచ్చిన ప్రేక్షకులకి కృతజ్ఞతలు. 100% థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. థియేటర్స్‌లో ఫ్యామిలీతో చూస్తేనే ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా విషయంలో హీరో గోపీచంద్ ఇచ్చిన ఫ్రీడమ్ మరచిపోలేనిది' అని డైరెక్టర్ శ్రీనువైట్ల చెప్పారు.

అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి



దీపికా పిల్లి, ప్రదీప్ మాచిరాజు

'30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' సినిమాతో యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఆయన తన రెండవ సినిమా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'తో అలరించబోతున్నారు.
ఈ యూనిక్ లవ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను దర్శక ద్వయం నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రదీప్ సరసన దీపికా పిల్లి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ గురువారం ఈ మూవీ టైటిల్‌ని అనౌన్స్ చేశారు. యాదృచ్ఛికంగా ఇది పవన్ కళ్యాణ్ మొదటి సినిమా టైటిల్ కావడం విశేషం. టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటుఫస్ట్ లుక్, మోషన్ వీడియోను రిలీజ్ చేశారు.
ఒక సివిల్ ఇంజనీర్ వర్క్ కోసం ఒక గ్రామంలోకి వస్తారు. అక్కడ అమ్మాయితో ప్రేమలో పడతాడు. ఇద్దరి మధ్య ఎంటర్‌టైనింగ్‌గా సాగే ప్రేమకథ, లాఫ్ లౌడ్ మూమెంట్స్, ఊహించని మలుపులు సర్‌ప్రైజింగ్‌గా ఉంటాయి. వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్, డీవోపీ: బాలరెడ్డి, ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, ప్రొడక్షన్ డిజైనర్: ఆశిస్తేజ పులాల, కథ- డైలాగ్స్: సందీప్ బొల్లా, సాహిత్యం: చంద్రబోస్, రాకేందు మౌళి, శ్రీధర్ ఆవునూరి.

నవచిత్రం

500 థియేటర్స్‌లో ఆదిపర్వం



మంచు లక్ష్మి

రావుల వెంకటేశ్వర రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్‌టైన్ మెంట్స్ కలయికలో నిర్మించిన చిత్రం 'ఆదిపర్వం'.
ఈ సినిమాలో మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మరో కీలక పాత్రను ఆదిత్య ఓం పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా ఈ చిత్రాన్ని దర్శకుడు సంజీవ్ మేగోటి తెరకెక్కించారు.
ఈ సినిమా ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది.
500కి పైగా థియేటర్స్‌లో ఈ సినిమా ప్రేక్షకులను అలరించబోతోంది. 1974-90 మధ్య కాలంలో జరిగిన యదార్థ ఘటనల సమాహారంగా ఈ సినిమాను రూపొందించారు దర్శకుడు సంజీవ్ మేగోటి. అమ్మోరు, అరుంధతి చిత్రాల తరహాలో దుష్టశక్తికి, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధాన్ని ఆసక్తికరంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాలో చూపించబోతున్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమా థియేటర్స్‌లోకి వస్తుందని మేకర్స్ చెబుతున్నారు.
ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ - ఘంటా శ్రీనివాసరావు, సహ నిర్మాతలు - గోరెంట శ్రావణి, రవి మొదలవలస, ప్రదీప్ కాటకూటి, రవి దశిక, శ్రీరామ్ వేగరాజు, రచన-దర్శకత్వం : సంజీవ్ మేగోటి.

వేట్టయాన్‌కి ప్రీక్వెల్ చేయాలని ఉంది..



టి.జె.జ్ఞానవేల్

దసరా సందర్భంగా విడుదలైన రజనీ కాంత్ యాక్షన్ థ్రిల్లర్ 'వేట్టయన్ ది హంటర్' చిత్రం బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంతో దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ మీడియాతో తన ఆనందాన్ని పంచుకుంటూ ఎన్నో చిత్ర విశేషాలను తెలిపారు.

- ఈ సినిమాకి ఇంత మంచి రెస్పాన్స్ ఇస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. సినిమాలో నేను లేవనెత్తిన అంశాల గురించి చర్చలు జరుగుతాయని భావిస్తున్నాను.
- దేశవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్ హత్యల గురించి చదివిన వార్తలే ఈ కథకి స్ఫూర్తి. ఈ ఎన్‌కౌంటర్లలో ఎంత వాస్తవం ఉంది? అసలు ఇలా చేయడం కరెక్టేనా?, దోషుల్నే శిక్షిస్తున్నామా? అనే వాటిని చూపించాను. ఎర్ర చందనం స్మగ్లర్లు అంటూ చెట్లు నరికేసే అమాయకుల్ని ఎన్‌కౌంటర్ చేసిన ఘటన నన్ను కదిలించింది. నా పరిశోధనలో పేదలు తరచూ ఇటువంటి ఎన్‌కౌంటర్ల బాధితులవుతున్నారని, సంపన్నులు న్యాయం నుండి తప్పించుకుంటారని తెలిసింది. విద్యా వ్యవస్థ లోపాలను కూడా ఈ చిత్రం స్పృశించింది.
- వినోదాన్ని కోరుకునేరజనీకాంత్ అభిమానులకు, ఆలోచింపజేసే కథనాలను మెచ్చుకునే ప్రేక్షకులకు ఇలా అందరికీ ఈ సినిమా నచ్చింది. రజనీకాంత్, అమితాబ్ పాత్రల తీరును అందరూ మెచ్చుకుంటున్నారు.
- ఈ చిత్రానికి సీక్వెల్ కన్నా నేను ప్రీక్వెల్‌ను చేయడానికి ఎక్కువ ఆసక్తితో ఉన్నాను. ఈ సినిమా అతియాన్ గురించి చెబుతుంది. అయితే అతియాన్ ఎలా ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయ్యారనే కథను చెప్పాలని అనుకుంటున్నాను. ఫహద్ ఫాసిల్ దొంగగా, పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారడం.. ఇలా చాలా అంశాలకు బ్యాక్ స్టోరీని చెప్పాలని అనుకుంటున్నాను.

అద్భుత మెలోడీగా హే తారా..



రుక్మిణి వసంత్, నిఖిల్

హీరో నిఖిల్ ప్రస్తుతం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. 'స్వామి రారా, కేశవ' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల తర్వాత సుధీర్ వర్మ, నిఖిల్ కాంబోలో రాబోతున్న సినిమా కావటంతో భారీ ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఈ చిత్రంలో కన్నడ నాయిక రుక్మిణి వసంత్ హీరోయిన్ నటించారు. మరో నాయికగా దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలో నటించగా, హర్ష చెముడు ముఖ్య పాత్రను పోషించారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు.
యోగేష్ సుధాకర్, సునీల్ షా, రాజా సుబ్రమణ్యం ఈ సినిమాకు కో ప్రొడ్యూసర్స్. బాపినీడు.బి ఈ చిత్రానికి సమర్పణ. తాజాగా ఈ చిత్రం నుంచి 'హే తార..' అంటూ సాగే ఓ మెలోడియస్ గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. కార్తీక్ స్వరపరిచిన ఈ బాణీకి కృష్ణ చైతన్య సాహిత్యాన్ని అందించారు. కార్తీక్, నిత్యశ్రీల గాత్రంలో ఈ పాట ఎంతో వినసొంపుగా ఉంది. హీరో, హీరోయిన్ మధ్య ప్రేమని, వారి కెమిస్ట్రీని తెలిపేలా ఈ పాట సాగింది. సింగర్ కార్తీక్ ఈ చిత్రానికి సంగీతాన్ని.. సన్నీ ఎం.ఆర్ బ్యాగ్రౌండ్ స్కోర్‌ను అందిస్తున్నారు. దీపావళి సందర్భంగా నవంబర్ 8న ఈ చిత్రం గ్రాండ్ రిలీజ్ అవుతుంది.

స్వచ్ఛమైన ప్రేమకథ



శ్రావణి రెడ్డి, కిరణ్ అబ్బవరం, అంజన్ రామచంద్ర

గీతాన్స్ ప్రొడక్షన్స్, సెహెరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'లవ్ రెడ్డి'. అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి హీరో, హీరోయిన్లు. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథగా నూతన దర్శకుడు స్మరన్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నిర్మాతలు సునందబి.రెడ్డి, హేమలత రెడ్డి, రవీందర్‌జీ, మదన్‌గోపాల్ రెడ్డి, నాగరాజ్ బీరప్ప, ప్రభంజన్ రెడ్డి, నవీన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.
సుమ, సుస్మిత, హరీష్, బాబు, రవి కిరణ్, జకరియా సహ నిర్మాతలు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ సినిమా నేడు (శుక్రవారం) గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది.
ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసిన హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'నేను, అంజన్ షార్ట్ ఫిల్మ్ నుంచి వచ్చాం. ఆ ఎమోషనల్ బాండింగ్ మా మధ్య ఉంది. మూడేళ్లుగా అంజన్ ఫ్యామిలీ అంతా ఈ సినిమా కోసం కష్టపడుతున్నారు. కంటెంట్ నచ్చితే ఈ సినిమాను హార్ట్‌ఫుల్‌గా సపోర్ట్ చేయండి. ఆంధ్ర, సీడెడ్, నైజాంలో ఒక్కో షో నేను స్పాన్సర్ చేస్తాను. ఈ సినిమాను నైజాంలో రిలీజ్ చేస్తున్న మైత్రీ వారికి, ఆంధ్రలో రిలీజ్ చేస్తున్న వంశీకి, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్న హోంబలే సంస్థకు థ్యాంక్స్' అని అన్నారు.
'కంటెంట్ బాగుంటే కొత్త హీరోనా స్టార్ హీరో సినిమానా అనేది ప్రేక్షకులు చూడరు. కంటెంట్ పరంగా మాది పెద్ద సినిమానే. మీ ఆదరణ ఆశిస్తున్నా' నిర్మాత మదన్‌గోపాల్ రెడ్డి చెప్పారు.

జయేద్ మసూద్ ఎవరు?



పృథ్వీరాజ్ సుకుమార్

2019లో 'లూసిఫర్' విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఎల్2 ఎంపురాన్' రాబోతోంది. లైకా ప్రొడక్షన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది.
మోహన్ లాల్, వెర్సటైల్ యాక్టర్, డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న మూడో చిత్రం కావటంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.
మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఖురేషి అబ్రమ్‌గా సూపర్‌స్టార్ లుక్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ఇప్పుడు పృథ్వీరాజ్ సుకుమార్ బర్త్ డే సందర్భంగా ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఖురేషి అబ్రమ్‌కు రైట్ హ్యాండ్‌లా జయేద్ మసూద్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమార్ కనిపించనున్నారు. తాజాగా రిలీజ్ చేసిన జయేద్ మసూద్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది.
ఎంపరర్ జనరల్ అంటూ జయేద్ మసూద్ పాత్రను పరిచయం చేశారు. ఈ చిత్రంలో టోవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ తదితరులు మరోసారి వారి పాత్రలతో మెప్పించబోతున్నారు. లడఖ్, చెన్నై, కొట్టాయం, యుఎస్, యుకెతో సహా పలు చోట్ల సినిమా చిత్రీకరణ జరిగింది. టీమ్ ప్రస్తుతం తిరువనంతపురంలో షూటింగ్ జరుపుకుంటోంది. త్వరలోనే కొత్త షెడ్యూల్ కోసం గుజరాత్, యుఎఇకి కూడా టీమ్ వెళ్లనుంది. వచ్చే ఏడాది మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో సినిమాను విడుదల చేయటానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

మెటా ఉద్యోగులపై వేటు





న్యూయార్క్ : కరోనా సమయంలో టెక్నాలజీ రంగంలో ప్రారంభమైన ఉద్వాసనలు ఇంకా కొనసాగుతున్నాయి. టెక్, సోషల్ మీడియా దిగ్గజం మెటా మరోమారు తమ ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, రియాలిటీ ల్యాబ్స్ కోసం పనిచేస్తున్న బృందాలతో సహా మెటా వర్స్ అంతటా తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించింది. అయితే ఎంత మంది ఉద్యోగులపై వేటు వేసేది వెల్లడించలేదు. కాగా.. తొలగింపుల విషయమై ఇప్పటికే సదరు ఉద్యోగులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే ఉద్వాసనకు గురైన కొందరు ఉద్యోగులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఇటీవల ఇంటెల్, సిస్కో, ఐబిఎం కంపెనీలు పెద్ద ఎత్తున సిబ్బందిని తొలగించాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికి 422 కంపెనీలు ఏకంగా 1,36,000 మందిని తొలగించాయని అంచనా.

మెటాలో ముఖ్యంగా నియామకాలు, లీగల్ ఆపరేషన్ పలు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఎక్కువగా ప్రభావం పడనుందని సమాచారం. ఇప్పటికే పలుసార్లు ఉద్యోగులను తొలిగించగా.. కరోనా నష్టాల బూచిని చూపి 2022లో ఏకంగా 11,000 మందిని రోడ్డున పడేసింది. ఇక గతేడాది రెండు విడతల్లోనూ సుమారు 10,000 మందిని తొలగించింది. తాజాగా మరోమారు ఉద్వాసనలకు సిద్ధం కావడంతో ఆ రంగం ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రాంతీయ వ్యూహాల్లో మార్పులు చేస్తున్నామని మెటా అధికారిక ప్రతినిధి తెలిపారు. అందులో భాగంగానే ఈ తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మెటా నుంచి ఉద్వాసన పలికిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ అవకాశాలు అందించేందుకు కంపెనీ ప్రయత్నం చేస్తుందన్నారు.

ధరలు పెంచిన డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్

ముంబయి : ఇంటర్నేషనల్ సరకు రవాణ సంస్థ డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ధరలను పెంచినట్లు తెలిపింది. 2025 జనవరి 1 నుంచి సర్దుబాటు ధరలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. భారత్‌లో సగటు పెరుగుదల 6.9 శాతంగా ఉండనుందని వెల్లడించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్త పరిణామాలు, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువలో మార్పులు, భద్రతా చర్యలకు సంబంధించిన వ్యయాలను పరిగణలోకి తీసుకుని ధరల్లో మార్పులు చేశామని డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ దక్షిణాసియా వైస్ ప్రెసిడెంట్ ఆర్‌ఎస్ సుబ్రమణియన్ పేర్కొన్నారు.

మనేసర్ ప్లాంట్‌లో కోటి కార్ల ఉత్పత్తి

మారుతి సుజుకి వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకి తన మనేసర్ ప్లాంట్‌లో అక్టోబర్ 17 నాటికి ఒక్క కోటి వాహనాల ఉత్పత్తి మైలురాయిని నమోదు చేసినట్లు తెలిపింది. కేవలం 18 ఏళ్లలోనే ఈ స్థాయికి చేరినట్లు పేర్కొంది. ఇక్కడి అనేక వాహనాలను ఎగుమతులు చేసినట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏడాదికి 23.5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం కలిగి ఉంది. దేశంలో మొత్తంగా ఇప్పటి వరకు 3.11 కోట్ల వాహనాలను ఉత్పత్తి చేసింది.

7న హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ షేర్ల విభజన

న్యూఢిల్లీ : ఇపిసి కాంట్రాక్ట్ వ్యాపారాల కంపెనీ హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ తన 1:10 షేర్ల విభజన తేదిని నవంబర్ 7గా నిర్ణయించినట్లు తెలిపింది. దీనికి ఆ కంపెనీ వార్షిక జనరల్ బాడీ (ఎజిఎం)లో ఆమోదం లభించినట్లు వెల్లడించింది. దీంతో రూ.10 ముఖ విలువ కలిగిన షేర్లను రూ.1గా నిర్ణయించడం ద్వారా ఒక్క షేర్ కలిగిన ఇన్వెస్టర్లు 10 షేర్లను పొందనున్నారు.

సుదర్శన్ ఫార్మా చేతికి ఈశ్వరీ హెల్త్‌కేర్

హైదరాబాద్ : ఈశ్వరీ హెల్త్‌కేర్ ప్రయివేటు లిమిటెడ్‌లో మెజారిటీ వాటాలను స్వాధీనం చేసుకున్నట్లు రసాయనాల కంపెనీ సుదర్శన్ ఫార్మా ఇండస్ట్రీస్ వెల్లడించింది. ఇందుకోసం రూ.10 చొప్పున 2,09,200 ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయడానికి తమ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. ఈ మొత్తం 51 శాతం వాటాకు సమానమని తెలిపింది. దీంతో ఈశ్వరీ హెల్త్‌కేర్ ఇకపై తమ సబ్సిడరీ కంపెనీగా ఉండనుందని సుదర్శన్ ఫార్మా స్టాక్ ఎక్స్చేంజీలకు సమాచారం ఇచ్చింది.

హిటాచీకి భారీ ఆర్డర్

న్యూఢిల్లీ : భారతదేశంలో ఎలివేటర్లు, ఎస్కలేటర్‌ల విక్రయాలు, ఇన్‌స్టాలేషన్, నిర్వహణ సంస్థ హిటాచీ లిమిటెడ్ అనుబంధ సంస్థ హిటాచీ బిల్డింగ్ సిస్టమ్స్ కోకు భారీ ఆర్డర్ దక్కినట్లు తెలిపింది. నోయిడాలోని సిఆర్‌సి కీల ప్రాజెక్ట్ కోసం సిఆర్‌సి గ్రూప్ నుండి 56 యూనిట్ల ఎలివేటర్లు, ఎస్కలేటర్‌ల కోసం ఆర్డర్‌ను పొందినట్లు పేర్కొంది. ఈ ఎలివేటర్‌లలో భూకంప సమయాలలో పనిచేసే అత్యవసర నిర్వహణ వ్యవస్థ కూడా ఉంటుందని తెలిపింది.

ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ 'దీపావళి షాపోత్సవ్'

బెంగళూరు : ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ డిజిటల్ బి2బి మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ తన సభ్యుల కోసం అక్టోబర్ 9 నుండి నవంబర్ 1వ తేదీ మధ్య దీపావళి షాపోత్సవ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది మొత్తం 26 స్టోర్‌లు, ఆన్‌లైన్ ఛానెల్‌లలో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. బంపర్ లక్కీ డ్రా ఆఫర్‌లు, ఎంపిక చేసిన బ్రాండ్‌లపై రివార్డ్‌లను గెలుచుకునే అవకాశం ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధి దినకర్ అయిలవరపు తెలిపారు. దీంతో కిరాణా సభ్యులు, ఎస్‌ఎంఇలు, ఇతర వ్యాపార యజమానులకు సొమ్ము ఆదా కానుందన్నారు.

కౌలు చట్టం ఆలస్యం?

- ఏపీలో క్యాబినెట్‌కు రాని అంశం
- బ్యాంకర్ల మీట్‌లోనూ చర్చ లేదు
- యాక్ట్‌పై కొత్త సందేహాలు
- రబీ నుంచేనన్న ప్రభుత్వం
- కొత్త కార్డుల్లేక, పాతవి ఇవ్వక వాస్తవ కౌలు రైతుల అవస్థ


ఎస్‌ఎల్‌బిసి నివేదికను విడుదల చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

అమరావతి : కౌలు రైతుల సంక్షేమం లక్ష్యంతో టిడిపి కూటమి ప్రభుత్వం తెస్తామన్న కొత్త కౌలు చట్టం ఆలస్యమయ్యేటట్లు కనిపిస్తోంది. చట్టం ముసాయిదాపై అభిప్రాయసేకరణ కోసం సర్కారు మీటింగ్‌లు నిర్వహించింది. గుంటూరులో ఇటీవల సమావేశం నిర్వహించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వచ్చే మంత్రి మండలి భేటీలో కొత్త కౌలు చట్టాన్ని ఆమోదిస్తామని, అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతామని తెలిపారు. కాగా బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో కౌలు చట్టం అంశం అజెండాలో రాలేదు. దాంతో కౌలు చట్టం రావడానికి ఆలస్యమవుతుందని వినవస్తోంది. ఇదిలా ఉండగా గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బిసి) సమావేశంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వం తీసుకు రానున్న కొత్త కౌలు చట్టం గురించి మాటమాత్రం ప్రస్తావించలేదు. కౌలు రైతులకు మానవతా దృక్పథంతో రుణాలివ్వాలని బ్యాంకులను కోరారు. ఈ పరిణామాలు చట్టంపై కౌలు రైతుల్లో కొత్త సందేహాలు రేకెత్తిస్తున్నాయి.

ఆర్డినెన్స్‌కు అవకాశం ఉన్నా..

రబీ నుంచి కౌలు రైతులకు కొత్త గుర్తింపు కార్డులిస్తామని, రెవెన్యూ శాఖ నుంచి కాకుండా వ్యవసాయశాఖ నుంచి ఇప్పిస్తామని కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంలో సెప్టెంబర్‌లో నిర్వహించిన కేబినెట్‌లో హామీ ఇచ్చింది. ఖరీఫ్ ముగిసి రబీ మొదలవుతున్న వేళ కౌలు రైతులు రుణాల కోసం వెతుకులాడుతున్నారు. వర్షాలు, వరదల వలన పంటలు నష్టపోయిన కౌలు రైతులు ప్రభుత్వ పరిహారం కోసం, బీమా కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త చట్టం రాక, పాత చట్టం ప్రకారం సిసిఆర్‌సిలు జారీ కాక కౌలు రైతులు అటు బ్యాంక్ రుణాలకు ఇటు ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి సాయాన్ని, సంక్షేమ పథకాలను కోల్పోతున్నారు. పాత సిసిఆర్‌సిల జారీని నిలిపివేసిన నేపథ్యంలో రబీలో అత్యవసరంగా కౌలు రైతులను ఆదుకోవడం కోసం అసెంబ్లీ సమావేశాల వరకు వేచి చూడకుండా ఆర్డినెన్స్ తీసుకొచ్చి, కొత్త చట్టాన్ని అమలు చేసే వీలుంది. ఆ ప్రయత్నం జరగలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కోసం ఆర్డినెన్స్ జారీ చేసిన సర్కారు, కౌలు చట్టానికి అంతే ప్రాధాన్యమిచ్చి ఆర్డినెన్స్ ఇవ్వొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి.

బ్యాంకులదే కీలక పాత్ర

ప్రభుత్వాలు చట్టాలు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తున్నా బ్యాంకులు వాటిని పట్టించుకోవట్లేదు. ఒకే భూమిపై రెండు రుణాలు, రికవరీ గ్యారంటీ వంటి కొర్రీలు వేసి కౌలు రైతులకు పంట రుణాలివ్వట్లేదు.

2011- చట్టం తీసుకొచ్చే సమయంలో బ్యాంకులతో అప్పటి ప్రభుత్వం విస్తృతంగా సంప్రదింపులు జరిపినా పెద్దగా ఉపయోగం జరగలేదు. టిడిపి సర్కారు 2015 ప్రాంతంలో సిఒసిలు ప్రవేశపెట్టినప్పుడూ బ్యాంకుల నిరాదరణ కొనసాగింది. 2019లో వైసిపి సర్కారు తెచ్చిన సిసిఆర్‌సి చట్టమూ అంతే.

కౌలు రైతులకు బ్యాంక్ పరపతే ప్రధాన సమస్య. అలాంటప్పుడు కూటమి ప్రభుత్వం తెస్తామంటున్న కొత్త చట్టంపై బ్యాంకర్లతో చర్చించారా లేదా అన్న ప్రశ్న తలెత్తింది. గురువారం జరిగిన బ్యాంకర్ల భేటీలో కొత్త చట్టంపై చర్చ జరగకపోవడంతో సందేహాలు ఇంకా పెరుగుతున్నాయి.

కౌలు రైతులకు మానవతా దృక్పథంతో లోన్లు : బ్యాంకులకు మంత్రి విజ్ఞప్తి

కౌలు రైతులకు బ్యాంకులు మానవతా దృక్పథంతో రుణాలివ్వాలని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు కోరారు. కౌలు రైతులకు 9 లక్షల సిసిఆర్‌సిలు ఇవ్వగా 2 లక్షల మందికే లోన్లు ఇచ్చారన్నారు. రానున్న ఐదేళ్లల్లో 50 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం కిందకు తీసుకొచ్చే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన ఎస్-ఎల్‌బిసి 228వ సమావేశంలో 2024-25 వార్షిక రుణ ప్రణాళికలో తొలి మూడు మాసాల రుణ వితరణపై సమీక్షించారు. రాష్ట్రంలో 65 శాతం మంది వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడ్డారని, ఆ వర్గాలకు బ్యాంకులు తగిన తోడ్పాటు అందించాలని మంత్రి కోరారు. ప్రభుత్వం ఆరు విధాన రంగాలను ప్రోత్సహిస్తోందని, వాటిలో ఎంఎస్‌ఎంఇ ప్రధానమైనదని, ఆ రంగానికి బ్యాంకులు అప్పులిచ్చి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై ప్రజల్లో సరైన అవగాహన ఉండట్లేదని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం వివిధ రంగాలకు కేటాయించిన నిధులను వేరే రంగాలకు మళ్లించి ఆయా రంగాలను నిర్వీర్యం చేసిందని, పరిస్థితులను గాడిలో పెడుతున్నామని వివరించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను యూనియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ మణిమేఖలై ప్రశంసించారు. 2024-25 క్రెడిట్ ప్లాన్ రూ.3.75 లక్షల కోట్లు కాగా తొలి త్రైమాసికంలో 1.36 లక్షల కోట్ల లోన్లిచ్చామని వివరించారు. వ్యవసాయశాఖ స్పెషల్ సిఎస్ బి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతులే 90 శాతం భూమిని సాగు చేస్తున్నారని, వారికి సక్రమంగా రుణాలందట్లేదని, సిసిఆర్‌సిలు కలిగిన వారందరికీ బ్యాంకులు రుణాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

జమిలీని ఎదుర్కొందాం

వైసీపీ రాష్ట్ర కార్యవర్గంలో అధ్యక్షులు జగన్

- టీడీపీ హామీలకు పాలనకు పొంతన లేదు




అమరావతి : శాసనసభ, పార్లమెంటుకు జమిలీ ఎన్నికలు జరుగుతాయని అంటున్నారని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో పార్టీ ఓటమి అనంతరం తొలిసారి వైసిపి రాష్ట్ర వర్క్‌షాపును తాడేపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు వ్యవస్థీకృతంగా వ్యవహరిస్తేనే సమర్థవంతంగా జమిలీ ఎన్నికలను ఎదుర్కోగలమని చెప్పారు. త్వరలోనే అన్నిస్థాయిల్లోనూ పార్టీ కమిటీలు ఏర్పాటు కావాలని అన్నారు. ఎన్నికలకు ముందు టిడిపి ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం జరుగుతున్న పాలనకు పొంతన లేదని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అతి తక్కువ సమయంలో వైఫల్యం దిశగా వెళ్తోందని అన్నారు. ఈ సమయంలో పార్టీ నాయకత్వం ఐక్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం పెద్ద సమస్య కాదని చెప్పారు. అక్రమ కేసులు పెడితే ఎదుర్కొని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. గతంలో ఏమైనా తప్పులు చేసి ఉంటే వాటిని సరిదిద్దుకునేందుకు ఇదే సరైన సమయమన్నారు. క్షేత్రస్థాయి నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. . రాష్ట్రంలో 86 శాతం సర్పంచ్‌లు, 90 శాతం పైచిలుకు ఎంపిటిసిలు వైసిపి వాళ్లే ఉన్నారని అన్నారు. నాయకత్వం ఇంట్లో కూర్చుంటే కుదరదని, చొరవ తీసుకుని అన్ని అంశాలపై స్పందించాలని తెలిపారు. అన్యాయంపై ప్రశ్నించడంతోపాటు బాధితులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. వైసిపి ఎన్నికల మ్యానిఫెస్టోను ఖచ్చితంగా అమలు చేసిందని, టిడిపి చేయలేకపోతోందని, పైగా ఎదురుదాడి చేస్తోందని, సోషల్ మీడియాను వాడుకుంటోందని తెలిపారు. పార్టీలో అన్ని కమిటీలూ సోషల్ మీడియా వింగ్‌తో మమేకం కావాలని సూచించారు. ఎన్నికలముందు అబద్ధాలు చెప్పలేకపోయామని, టిడిపి వాళ్లు అబద్ధాలు చెప్పి గెలిచారని అన్నారు. మరలా అధికారంలోకి రావాలంటే విశ్వసనీయత ఉండాలని, అది వైసిపికి ఉందనే విషయాన్ని మర్చిపోకూడదని తెలిపారు. వైసిపి పాలనపై ప్రస్తుతం ప్రజల్లో చర్చ మొదలైందని పేర్కొన్నారు. టిడిపి కూటమి పాలనలో విద్యారంగం దెబ్బతిందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా రైతులకు పెట్టుబడిసాయం ఇవ్వలేదని అన్నారు. ఇసుక టెండర్లు పిలుస్తున్నారన్న విషయం కూడా చెప్పకుండా వారే వేసుకుని, వారే పాడుకున్నారని ఇంతకంటే అప్రజాస్వామికం ఇంకొటి ఉండదని అన్నారు. ఇష్టం వచ్చినట్లుగా మద్యం అమ్మేందుకు కొత్త పాలసీలు తీసుకొచ్చారని వివరించారు.

ప్రతి నియోజకవర్గంలోనూ పది పేకాట క్లబ్బులు నడుపుతున్నారని తెలిపారు. అలాగే పనితీరు ఆధారంగా అన్ని కమిటీల్లోనూ ప్రమోషన్లు ఉంటాయని చెప్పారు.

నా అధ్యక్ష పదవి బైడెన్ ప్రెసిడెన్సీకి కొనసాగింపు కాదు

- కమలా హారిస్ వ్యాఖ్య



వాషింగ్టన్: తన అధ్యక్షపదవి బైడెన్ ప్రెసిడెన్సీకి కొనసాగింపుగా ఉండబోదని డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ పేర్కొన్నారు. మరో మూడు వారాల్లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ప్రచారాన్ని ముమ్మరం చేసిన ఆమె ఫాక్స్ న్యూస్ టెలివిజన్ చానెల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. వలసలు, లింగమార్పిడి వంటి అంశాలపై మాట్లాడారు.. అక్రమ వలసలను నియంత్రించడంలో బైడెన్ ప్రభుత్వ విధానాలను ఆమె సమర్థించారు. సరిహద్దు భద్రతా బిల్లును ఆమోదించడంలో వైఫల్యానికి రిపబ్లికన్లే కారణమని నిందించారు. ఈ ఏడాది ప్రారంభంలో ద్వైపాక్షిక ఇమిగ్రేషన్ బిల్లును తిరస్కరించాలని ట్రంప్ రిపబ్లికన్లకు చెప్పారని ఆమె అన్నారు. ట్రంప్ సమస్యను పరిష్కరించడానికి బదులు సమస్యను అమలు చేయడానికి ఇష్టపడతాడని ఆమె చెప్పారు. అమెరికాలో వలసదారుల హింసాత్మక నేరాలకు ఆజ్యం పోస్తున్నది ట్రంపేనని అన్నారు. వలసదారుల వల్లే అమెరికాలో హింస పెరిగిపోతోందని ట్రంప్ చెప్పడం సరికాదన్నారు. వలసదారుల నేరాల రేటు ఇతరులతో పోల్చితే చాలా పరిమితమని పలు అధ్యయనాలు చెబుతున్నాయని కమలా హారిస్ తెలిపారు. జులైలో రేసు నుండి వైదొలగే ముందు ట్రంప్‌తో జూన్‌లో జరిగిన వినాశకరమైన చర్చ తర్వాత బైడెన్ మానసిక దృఢత్వం గురించి ప్రశ్నలు తలెత్తడంతో ఆయన రేసు నుండి తప్పుకుని ఉపాధ్యక్షులు కమలా హారిస్‌ను డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా ముందుకు తీసుకొచ్చారు. దాదాపు అర గంటసేపు సాగిని ఆ ఇంటర్వ్యూలో ట్రంప్ ఫాసిస్టు తరహా విధానాల గురించి ఎక్కువగా ప్రస్తావించారామె. అమెరికా రాజ్యాంగాన్ని ఇప్పటికే ఒకసారి ఉల్లంఘించిన ట్రంప్ అవకాశం సిస్తే మరోసారి ఉల్లంఘిస్తాడని ఆమె అన్నారు. ప్రజల అభీష్టాన్ని, స్వేచ్ఛాయుత ఎన్నికల ఫలితాలను అంగీకరించడానికి అతను నిరాకరించాడు. ఈ ఎన్నికల తర్వాత కూడా అదే పని చేయడన్న గ్యారంటీ ఏమిటని హారిస్ అన్నారు. బక్స్ కౌంటీలో వంద మంది రిపబ్లికన్లు హారిస్‌తో చేరారు.

27న ఉరుగ్వే సార్వత్రిక ఎన్నికలు

మాంటెవీడియో : ఈ నెల 27న ఉరుగ్వే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. దేశ అధ్యక్షుడిని, పార్లమెంట్ సభ్యులను ఓటర్లు ఎన్నుకోనున్నారు. ఎన్నికల మొదటి రౌండ్‌లో స్పష్టమైన విజేతను సూచించేలా ఇప్పటికైతే రాజకీయ పార్టీల మధ్య పెద్ద తేడా కనిపించడం లేదు. అయితే, మితవాద సంకీర్ణ కూటమి, మధ్యే వామపక్ష వాద పార్టీ ఈ రెండూ ఆధిక్యంలో వుండొచ్చునని భావిస్తున్నారు. మొదటి రౌండ్‌లో అధిక సంఖ్యలో ఓట్లు వచ్చిన అధ్యక్ష అభ్యర్థికి మద్దతునిచ్చేందుకు అంగీకరించిన పలు మితవాద పార్టీల కూటమి కూడా బరిలో వుంది. ఈ కూటమిలోని పార్టీలు మొదటి రౌండ్‌లో వేర్వేరుగానే పోటీ చేస్తున్నప్పటికీ రెండో రౌండ్‌లో కలిసి మద్దతునివ్వాలని నిర్ణయించారు. ఎన్నికల నిర్వహణా సంస్థ ఫాక్టమ్ వెల్లడించిన వివరాల ప్రకారం, మితవాద అభ్యర్థికి 48 శాతం వరకు ఓట్లు వచ్చే అవకాశం వుందని, అదేసమయంలో మధ్యేమార్గ వామపక్షవాద పార్టీకి 44 శాతం ఓట్లు వస్తాయని తెలిపింది. మితవాద పార్టీనే మెజారిటీ సీట్లు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయని పేర్కొంది.

హమాస్ అధినేత యాహ్యా సిన్వార్ మృతి !

- ఇజ్రాయిల్ ధ్రువీకరణ


జేరూసలేం: ఇజ్రాయెల్‌తో జరుగుతున్న పోరులో హమాస్ అధినేత యహ్యా సిన్వార్ మృతి చెందినట్టు ఇజ్రాయిల్ ధ్రువీకరిం చింది. డీఎన్‌ఏ ఆధారంగా విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. ఐడీఎఫ్ దళాల చేతిలో సిన్వార్‌ను మట్టు బెట్టినట్టు ఆయన వెల్లడించారు.

గాజాలో పాఠశాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడి : 15మంది మృతి

గాజాపై ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఉత్తర గాజాలో వైమానిక దాడికి దిగింది. తాత్కాలిక శిబిరంగా ఉన్న ఓ పాఠశాలపై జరిపిన వైమానిక దాడిలో 15 మంది మృతి చెందినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. చనిపోయిన వారిలో ఐదుగురు చిన్నారులు ఉన్నట్టు తెలిపింది. జబలియాలోని అబు హుస్సేని స్కూల్ వద్ద జరిపిన ఈ దాడిలో డజన్ల మంది గాయపడ్డారని ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.

'మా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించారు'

- భారత్‌పై ట్రూడో ఆరోపణ



ఒట్టావా: కెనడా ప్రధాని మంత్రి జస్టిస్ ట్రూడో బుధవారం మాట్లాడుతూ, కెనడా సార్వభౌమత్వాన్ని భారత్ ఉల్లంఘించినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని అన్నారు. కెనడా గడ్డపై సిక్కు వేర్పాటువాది హత్యపై భారత్, కెనడా మధ్య చెలరేగిన వివాదం ఇరు దేశాల దౌత్య వేత్తల పరస్పర బహిష్కరణతో మరింత ముది రింది.కెనడా సార్వభౌమత్వాన్ని భారత్ ఉల్లంఘించిందని మాకు స్పష్టమైన ఆధారాలున్నాయని ట్రూడో చెప్పగా, వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసమే ట్రూడో ఈ ఆరోపణలు చేస్తున్నారని భారత ప్రభుత్వం పేర్కొంది. హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యతో భారత ప్రభుత్వంలోని అమిత్‌షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విష్ణోయి గ్యాంగ్ పాత్ర గురించి కెనడా పదే పదే ఆరోపణలు చేస్తోంది.

భారత ప్రభుత్వం ఈ విషయంలో ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలని, భారత దేశ ప్రతిష్టకు సంబంధించిన ఈ వ్యవహారంలో పారదర్శకంగా వ్యవహరించాలని రాజకీయ పార్టీల నాయకులు, నిపుణులు కోరుతున్నారు. నిజ్జార్ 1997లో కెనడానికు వలస వెళ్లిఅరు. 2015లో పౌరసత్వం పొందిన ఆయన 2023 జూన్‌లో వాంకోవర్‌లోని సిక్కు దేవాలయం వద్ద పార్కింగ్ స్థలంలో హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించి నలుగురు భారతీయ పౌరులను కెనడా అధికారులు అరెస్టు చేశారు.

పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్

సిఎం చంద్రబాబు ట్వీట్



అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని సిఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులను స్వాగతించేందుకు రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ట్వీట్ చేశారు. రాష్ట్రంలో వ్యాపార అనుకూల ప్రభుత్వం ఉందని, ప్రతిభావంతులైన యువకులు బలమైన మౌలిక సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్ పరిశ్రమ అనుభవజ్ఞులతో సమగ్ర సంప్రదింపుల ఆధారంగా రూపొందిచామన్నారు. పాలసీ ఫ్రేమ్‌వర్క్ రాష్ట్రంలో వ్యాపారాలను, వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యావరణ వ్యవస్థను నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తాను పెట్టుబడులు పెట్టేవారికి హామీ ఇవ్వాలనుకుంటున్నానని, దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యంగా మన రాష్ట్రంలో ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి ప్రయాణంలో సహకరించాలని పెట్టుదారులకు విజ్ఞప్తి చేశారు. మీ వ్యాపార పరిధులు, రాష్ట్ర సామర్థ్యం రెండింటినీ విస్తరించవచ్చని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారి కోసం ఎదురుచూస్తున్నట్లు సిఎం తెలిపారు.

వాయనాడ్ ఉప ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా మోకెరి

తిరువనంతపురం : కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలకు పాలక ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా సిపిఐ నేత సత్యన్ మోకెరిని పార్టీ బరిలోకి దింపింది. మోకెరి అభ్యర్థిత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం ప్రకటించారు. శాసనసభలో మోకెరికి గల అనుభవం, రైతు సంఘాలకు నాయకత్వం వహించడం వంటి లక్షణాలు వయనాడ్ ఓటర్లలో ఆయన స్థానాన్ని బలపరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 1987 నుండి 2001 వరకు మూడు సార్లు నాదపురం నియోజకవర్గానికి మోకెరి ప్రాతినిధ్యం వహించారు. అఖిల భారత కిసాన్ సభ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి సీటును అట్టిపెట్టుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్ణయించడంతో వయనాడ్‌లో ఉప ఎన్నికలు అవసరమయ్యాయి. కాగా కాంగ్రెస్ తరపున ప్రస్తుతం ప్రియాంక గాంధీ పోటీ చేస్తున్నారు. ఇంతకుముందు జరిగిన ఎన్నికల్లో రాహుల్ గాంధీపై పోటీ చేసి సిపిఐ అభ్యర్థి అనీ రాజా ఓడిపోయారు.

మిలిటరీ దంపతుల ఆత్మహత్య

- భర్త ఆగ్రాలో.. భార్య ఢిల్లీలో



న్యూఢిల్లీ : భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఓ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఐఎఎఫ్, ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వహిస్తున్న వారిద్దరూ.. వేర్వేరు నగరాల్లో ఒకేరోజు ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దీన్ దయాళ్ దీప్ (32) ఆగ్రాలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఐఎఎఫ్ ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్నారు. అదే నగరంలోని సైనిక ఆస్పత్రిలో అతడి భార్య రేణు తన్వర్ ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే.. ఇటీవల తన్వర్ తన తల్లి, సోదరుడితో కలిసి వైద్య చికిత్స కోసం ఢిల్లీకి వెళ్లారు. ఇంతలో ఏమైందో తెలియదు.. ఒకేరోజు ఈ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన దీప్ మరుసటి రోజు బయటకు రాకపోవడంతో సహోద్యోగులు తలుపు పగలగొట్టి చూడగా, ఉరికి వేలాడుతూ కనిపించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.భోజన సమయంలో దీప్ తమతో సరదాగానే మాట్లాడారని.. అప్పుడు అతడి ముఖంలో ఎలాంటి ఆందోళన కనిపించలేదని సహోద్యోగుల్లో ఒకరు వెల్లడించారు. ఉదయం ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో అనుమానంతో తలుపులు పగలగొట్టి చూసేసరికి దీప్ విగతజీవిగా కనిపించారని పోలీసులకు తెలిపారు. మరోవైపు.. అదేరోజు తన్వర్ కూడా ఢిల్లీ కంటోన్మెంట్‌లోని అధికారుల మెస్ హాల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఆయనతో పాటే నాకూ దహన సంస్కారాలు చేయండి

అక్కడున్న సిబ్బంది సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఆమె మృతదేహం పక్కన సూసైడ్ నోటును స్వాధీనం చేసుకున్నారు. తన భర్త మృతదేహంతో కలిపి తనకూ దహన సంస్కారాలు నిర్వహించాలని ఆమె కోరారు. తన్వర్ ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె తల్లి, సోదరుడు ఆస్పత్రిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. దీప్ వద్ద ఎలాంటి సూసైడ్ నోటు లభ్యం కాలేదు. దీంతో అతడి మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బీహార్‌లో కల్తీ కాటు

- మద్యానికి 32 మంది బలి



పాట్నా : కల్తీ మద్యంతో బీహార్‌లో సివాన్, సరన్ జిల్లాలకు చెందిన మరో 18 మంది మరణించారు. దీంతో గురువారం నాటికి గడిచిన 24 గంటల్లో కల్తీ మద్యం కారణంగా చనిపోయినవారి సంఖ్య 32కు చేరింది. ఇంకా అనేక మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, మృతుల సంఖ్య పెరిగే వీలుందని సంబంధిత అధికారులు తెలిపారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితంగానే సామాన్యులు కల్తీ మద్యానికి బలైపోతున్నారని ఆర్జేడీ విమర్శించింది. సివాన్ జిల్లాలోని మఘర్, అవురియా పంచాయితీల్లో ఇప్పటి వరకు సుమారు కల్తీ మద్యంతో 20 మంది మరణించారని సరాన్ రేంజ్ డీఐజీ నీలేష్ కుమార్ గురువారం తెలిపారు. సరన్ జిల్లాలోని ఇబ్రహీంపురా ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కూడా మరణించారని అన్నారు. ఈ నెల 15న కల్తీ మద్యం తాగడంతో సివాన్, సరన్ జిల్లాలకు చెందిన పలువురు అనారోగ్యానికి గురయ్యారు. వీరిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇప్పటి వరకు 32 మంది మరణించారని అన్నారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

బిష్ణోయి ముఠా సభ్యులను అప్పగించాలన్న కెనడా

- ఆధారాలు చూపలేదన్న భారత్

న్యూఢిల్లీ: కెనడా చేసిన ఆరోపణలను భారత్ గురువారం తోసిపుచ్చింది. ఏ కేసులోనూ ఒక్క సాక్ష్యం కూడా పంచుకోలేదని చెప్పింది. నేరస్తుల అరెస్టు, అప్పగింతకు సంబంధించి భారత్ చేసిన 26కిపైగా అభ్యర్థనలను కెనడా పెండింగ్‌లో పెట్టిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. భారత్ కోరినవారిలో గుర్జిత్ సింగ్, గురు ప్రీత్ సింగ్, గుర్జీందర్ సింగ్ తదితరులు ఉన్నారని జైస్వాల్ చెప్పారు. వీరు లారెన్స్ బిష్ణోయి గ్యాంగ్ లేదా ఇతర ముఠాల సభ్యులు. మేము ఇప్పటికే సమాచారాన్ని పంచుకున్నాము. చర్య తీసుకోవాలని వారిని అభ్యర్థించాము. అయినా కెనడా వైపు నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదని జైస్వాల్ అన్నారు. భారత్ రప్పించాలని కోరినవారే ఇప్పుడు కెనడాలో నేర కార్యకలాపాలకు పాల్పడినట్లు కెనడియన్లు నిందించడం వింతగా ఉందని జైస్వాల్ అన్నారు. భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలిపింది. 2023 సెప్టెంబరు నుంచి కెనడా ప్రభుత్వం ఒక చిన్న సాక్ష్యాన్ని కూడా మాతో పంచుకోలేదని, ఈ విషయంలో కెనడా చేసిన ఆరోపణలను తిరస్కరిస్తున్నామని ఆయన అన్నారు.

పర్యాటక ప్రాంతంగా జోడేఘాట్

- అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు
- కుమురంభీమ్ 84వ వర్ధంతిలో మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆసిఫాబాద్/కెరమెరి

ఆదివాసీ పోరాట యోధుడు కుమురంభీమ్ వీర మరణం చెందిన జోడేఘాట్ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, అందుకు రూ.ఆరు కోట్లు విడుదల చేస్తున్నట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించిన కుమురం భీమ్ 84వ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, హరీశ్‌బాబు, వేడ్మ బొజ్జు, ప్రేమ్ సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి జెండాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడే ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆదివాసీ తొమ్మిది తెగల సంస్కృతి ఉట్టిపడేలా ప్రదర్శించిన ప్రత్యేక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జోడేఘాట్ పర్యాటక కేంద్రంగా రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పోరు గ్రామాలైన 12 గ్రామాల్లో ప్రతి ఆదివాసీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పారు. వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రావాల్సి ఉన్నప్పటికీ ఢిల్లీ పర్యటన వల్ల తాను వచ్చానని, త్వరలోనే ముఖ్యమంత్రి జోడేఘాట్ వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి వేల సంఖ్యలో ఆదివాసులు తరలిరాగా.. హట్టి నుంచి జోడేఘాట్ వరకు వారిని తీసుకెళ్లడానికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

ఎంపీడీవో కార్యాలయానికి తాళం

- 26 నెలల అద్దె బకాయితో ఆగ్రహించిన యజమాని



నవతెలంగాణ-వర్ని(చందూర్)

నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం అద్దెను 26 నెలల నుంచి చెల్లించకపోవడంతో ఇంటి యజమాని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం కార్యాలయంలోని అధికారులను, సిబ్బందిని బయటకు పంపించి తాళం వేశారు. దాంతో అధికారులు, సిబ్బంది గంటల తరబడి ఆరుబయటే కూర్చున్నారు. 2019 మార్చి 7వ తేదీన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. వర్ని మండలం నుంచి చందూర్‌ను విడదీసి నూతన మండలంగా ఏర్పాటు చేసింది. ఎంపీడీఓ కార్యాలయానికి ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మండల అభివృద్ధి కార్యాలయాన్ని అందులో కొనసాగిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం ఈ కార్యాలయ అద్దె చెల్లించలేదు. 26 నెలలు అద్దెను చెల్లించకపోవటంతో ఇంటి యజమాని అద్దె చెల్లించిన తర్వాతనే కార్యాలయాన్ని నడుపుకోవాలని తాళం వేశారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం చందూర్ మండలంలో ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

- ముగ్గురు యువకులు మృతి
- వికారాబాద్ జిల్లా పూడూర్ స్టేజీ వద్ద ఘటన
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి
- మేడికొండ గ్రామంలో విషాదఛాయలు
- హైదరాబాద్-బీజాపూర్ హైవేపై తరచూ ప్రమాదాలు



నవతెలంగాణ-పూడూర్

రెప్పపాటులో ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రం స్టేజీ సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. చంగోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూర్ మండలం మేడికొండ గ్రామానికి చెందిన చిలుకమరి నవీన్‌కుమార్ (21) వికారాబాద్ పట్టణంలో ఎస్ఏపీ కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ పొందేవాడు. అదే గ్రామానికి చెందిన బుడ్డమల్ల హర్ష(16) వికారాబాద్ పట్టణంలోని అనంతగిరిపల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గుంగుపల్లి గ్రామానికి చెందిన మిట్ట కంకంటి ప్రవీణ్(20) అమ్మమ్మ ఊరు మేడికొండ వచ్చాడు. ఈ ముగ్గురు కలిసి బైక్‌పై గురువారం మన్నెగూడ వెళ్తున్నారు. హైదరాబాద్ డిపో-1కు చెందిన ఆర్టీసీ బస్సు సేడం వెళ్తోంది. పూడూర్ స్టేజీ సమీపంలో ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ పి.కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న మేడికొండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హైదరాబాద్-బీజాపూర్ హైవేపై తరచూ ప్రమాదాలు

హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. వారంలో రెండు, మూడు రోడ్డు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. పూడూరు స్టేజీ సమీపంలోనే గతంలో ఇద్దరు, ఇప్పుడు ముగ్గురు మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పూడూరు మండల కేంద్రం స్టేజీ సమీపం, సోమన్గుర్తి, రాకంచెర్ల, చిలాపూర్, చిన్న బండ తండా సమీపంలో డివైడర్ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా, హైదరాబాద్-బీజాపూర్ హైవే రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఎన్ఈపీని అమలు చేయాల్సిందే

- వర్సిటీలు నిధుల కోసం సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులనుప్రవేశపెట్టాలి
- కాంట్రాక్టు అధ్యాపకుల్లో అంకితభావం ఉండదు
- ప్రపంచంతోపోటీపడేలావిద్యార్థులను తీర్చిదిద్దుతాం : ఉన్నతవిద్యామండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డి
- బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ నూతన విద్యావిధానం (ఎన్ఈపీ) 2020ని అమలు చేయాల్సిందేనని తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) చైర్మెన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎన్ఈపీ అమలు చేయడం తప్పనిసరి అని చెప్పారు. విద్యారంగం ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధానాలు, చట్టాలే అంతిమంగా అమలవుతాయని వివరించారు. గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా బాలకిష్టారెడ్డితోపాటు వైస్ చైర్మెన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం కూడా బాధ్యతలను స్వీకరించారు. వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి అభినందనలు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ తనకు చైర్మెన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పారు. తమపై పెద్ద బాధ్యతను పెట్టిందన్నారు. ఎన్ఈపీని కొన్ని రాష్ట్రాలు అమలు చేయడం లేదని చెప్పారు. రాష్ట్రంలో దాన్ని అమలు చేయాల్సిందేనని అన్నారు. ప్రపంచంలో విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీని తయారు చేసిందన్నారు. అందులో ఉండే మంచిని తీసుకోవాలనీ, విద్యార్థులకు ఏది మంచిదో ఆలోచించి అమలు చేయాలని వివరించారు. విద్యావ్యవస్థ సంక్షోభంలో ఉందన్నారు. ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ యుగంలో ఉన్నామని చెప్పారు. సమాజంలో విద్యావ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నదని వివరించారు. దీంతో అనేక సవాళ్లు ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్‌తో కాకుండా ప్రపంచంతో పోటీపడేలా సిలబస్‌ను రూపొందించాలనీ, విద్యార్థులను తీర్చిదిద్దాలని చెప్పారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలని సూచించారు. విజ్ఞానం ఉన్నోళ్లే ప్రపంచాన్ని ఏలుతున్నారని అన్నారు. 21వ శతాబ్దం ఆసియాదేనని వివరించారు. భారత్, చైనా సాంకేతిక పరిజ్ఞానంలో ముందుకెళ్తున్నాయని చెప్పారు. నల్సార్‌తో తాను రిజిస్ట్రార్‌గా, వీసీగా ఉన్నపుడు వినూత్నమైన కోర్సులను ప్రవేశపెట్టానని గుర్తు చేశారు. విద్యార్థుల వద్దకు వెళ్లాలని వివరించారు. తరగతుల్లో చెప్పేదే చదువు కాదనీ, సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందనీ, విద్యార్థులు అనేక విషయాలను తెలుసుకుంటున్నారని అన్నారు. రాబోయే ఐదేండ్లు, పదేండ్లలో విద్యారంగంలో తెలంగాణ ఎలా ముందుకెళ్లాలో ప్రణాళికను రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా ఎలాంటి కోర్సులను ప్రవేశపెడితే బాగుంటుందో ఆలోచించాలని చెప్పారు. విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. నిధుల కొరత, అధ్యాపకుల నియామకాల్లేకపోవడంతో అనేక సమస్యలున్నాయని వివరించారు. కాంట్రాక్టు అధ్యాపకులకు అంకితభావం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా ఆదాయం సమకూర్చుకోవడానికి సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. అయితే అందరికీ అందుబాటులో ఉండేలా ఫీజులుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఆర్థిక అధికారి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రికి ఘనంగా వీడ్కోలు

ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా పనిచేసిన ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్‌గా పనిచేసిన వి వెంకటరమణను చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా లింబాద్రి, వెంకట రమణ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా విధులు నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు.

తాళం వేసి ఉన్న ఇండ్లల్లో చోరీ

- బంగారు, వెండి, నగదు అపహరణ
- క్లూస్‌టీమ్‌తో పోలీసుల విచారణ

నవతెలంగాణ-వట్‌పల్లి/కంఠేశ్వర్

తాళం వేసి ఉన్న ఇండ్ల తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు అపహరించిన ఘటనలు సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో బుధవారం అర్ధరాత్రి జరిగాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన అశోక్ గౌడ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో అశోక్ గౌడ్ వద్ద పనులు చేసే మొళ్ళ యాదుల్ ప్రతిరోజు మాదిరిగానే ఇంటి పనులు చేసేందుకు గురువారం ఉదయం రాగా, ఇంటి తాళాలు పగలగొట్టి, వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దాంతో వెంటనే యాదుల్ ఇంట్లో దొంగలు పడ్డ విషయాన్ని ఇంటి యజమాని అశోక్ గౌడ్ కుమారికి ఫోన్‌లో తెలిపాడు. దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న అశోక్ గౌడ్ ఇంటికి చేరుకొని గమనించగా.. రెండు తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలను దొంగిలించినట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనం జరిగినట్టు నిర్ధారణ చేసి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించి, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఎల్లమ్మ టెంపుల్ ఆవరణలో దొంగలు సంచరించినట్టు పోలీసులు గుర్తించారు. పూర్తి విచారణ అనంతరం నిందితులను గుర్తిస్తామని తెలిపారు. దొంగతనానికి పాల్పడింది మాత్రం ఇక్కడి పరిసర ప్రాంతాలవారై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

నిజామాబాద్ నగరంలోని సీతారాం నగర్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి ముగ్గురు దొంగలు తాళం పగలగొట్టి బీరువాలోని 4 గ్రాముల బంగారం, రూ.25 వేల నగదు అపహరించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు గురువారం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని ఐదవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు

హక్కుల సాధనకు ఉద్యమాలు : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, వాటి నివారణకు, మహిళల హక్కుల సాధనకు అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీయూటీఎఫ్ భవనంలో గురువారం ఐద్వా జిల్లా 13వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సంఘం జెండాను ఆవిష్కరించారు. చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలమాలలేసి జోహార్లర్పించారు. వారి ఆశయ సాధనకు పోరాడుతామని ప్రతినబూనారు. అనంతరం మహాసభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో మణిపూర్ సంఘటన మరువలేనిదన్నారు. మహిళల హక్కుల రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పేదలు, మహిళలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, ఏడాదికేడాది నిధుల్లో కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ ధరలు పెరిగి ప్రజలు కొనలేని తినలేని పరిస్థితి ఏర్పడిందని, ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు ప్రతి మహిళకూ నెలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. పావులావడ్డీ రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నానాటికీ మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అక్కడ జరగనున్న బహిరంగ సభకు వేలాది మందిగా తరలిరావాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, నల్లగొండ జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, అధ్యక్షులు నరేష్ మాట్లాడారు. మహాసభ అధ్యక్షవర్గంగా పోలేబోయిన వరలక్ష్మి, జిట్టా సరోజ, తుమ్మల పద్మ వ్యవహరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రమౌళి, శంకర్ బృందం పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో దైదా జానకమ్మ, మండల కార్యదర్శులు ఉమా, మంజుల, పార్వతమ్మ, నాగమణి, ఇందిర, కౌసల్య అరుణ, అంజమ్మ, సాబేర, శరత్, సంధ్యా నాగమణి, భార్గవి, బొల్లోజు భారతమ్మ పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో 33 మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలడుగు ప్రభావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆఫీస్ బేరర్స్‌గా జిట్టా సరోజ, కొండ అనురాధ, చెనబోయిన నాగమణి, తుమ్మల పద్మ, భూతం అరుణకుమారి, నిమ్మల పద్మ, కారంపూడి ధనలక్ష్మి, పాదూరి గోవర్ధన, మేకల వరుణమ్మ, దామెర లక్ష్మి, ఎండి.సుల్తానా ఎన్నికయ్యారు.

మూసీ బాధితులకు అండగా ఉంటాం


- మాజీ మంత్రి కేటీఆర్ భరోసా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మూసీ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. న్యాయ సాయం చేస్తూనే...వారి తరపున పోరాటం చేస్తామన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మూసీ బాధితులతో ఆయన సమావేశమయ్యారు. అన్ని పర్మిషన్లు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు పేదలను కబ్జాదారులనటం దారుణమన్నారు. మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇండ్లు కూల్చుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పర్మిషన్లు ఇచ్చి కరెంట్ బిల్లులు, ఇంటిపన్నులు కట్టించుకున్నది కాంగ్రెస్ నేతలేనన్నారు. బాధితులు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా బాధితులందరికీ న్యాయసాయాన్ని బీఆర్ఎస్ పార్టీయే చేస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ 100 రోజుల్లో ప్రజలకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు పేద ప్రజల ఇండ్లను గుంజుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 ఏండ్లుగా మూసీ పరివాహక ప్రాంతంలో ఉంటున్న తమ ఇండ్లను కూల్చివేస్తామంటే, ఎక్కడికి పోవాలని వారు వాపోయారని తెలిపారు. బాధితులకు ఏ సమస్య వచ్చినా సరే బీఆర్ఎస్ స్థానిక నాయకులను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా మీరు గెలిపించిన ప్రజాప్రతినిధులను కూడా నిలదీయాలని ఆయన కోరారు.

చేసింది గోరంత.. చెప్పుకునేది కొండంత

- మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'చేసింది గోరంత..చెప్పుకునేది కొండంత...' అనే రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వ పదినెలల పాలన ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఈ కాలంలో మహిళలకు ఎంతో మేలు చేశామంటూ సీఎం రేవంత్, మంత్రులు చెప్పటం హాస్యాస్పదమని ట్విట్టర్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ముందు మహిళల ప్రాణాలు కాపాడండి, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడండని హితవు పలికారు.

'మూసీ' సమస్యలపై ఎస్సీ కమిషన్‌లో బీఆర్ఎస్ పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ సుందరీకరణ పేరిట హైదరాబాద్‌లోని పేద ఎస్సీ కుటుంబాలను ప్రభుత్వం అక్రమంగా తరలిస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఇదే అంశంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సీనియర్ నేత దాసోజు శ్రావణ్ తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సామాజిక ప్రభావ అంచనా ప్రకారం వారికి తగిన పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాకు సలహాలిచ్చేది మీరా..?

- హరీశ్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క కౌంటర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో మహిళలపై లక్షన్నరకు పైగా అఘాయిత్యాలు, ఇతర నేరాలు జరిగినట్టు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నివేదిక నిచ్చిందని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. ఈ క్రమంలో మహిళల భద్రత, రక్షణ గురించి మాజీ మంత్రి హరీశ్, తమ ప్రభుత్వానికి ఉచిత సలహాలివ్వటం హాస్యాస్పదమంటూ కౌంటర్ ఇచ్చారు. గత పది నెలల కాలంలో తమ ప్రజా ప్రభుత్వం... మహిళా సంక్షేమ బోర్డు, మహిళా బ్యాంకులు, జిల్లా కేంద్రాల్లో మహిళా పారిశ్రామిక వాడల ఏర్పాటు తదితర ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందని ఆమె గుర్తు చేశారు.ఇందుకు భిన్నం గా గతంలో మహిళలు దాచుకున్న రూ.550 కోట్ల పొదుపు సొమ్మును కొల్లగొట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు తమకు నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

ఢిల్లీలోని బంగా భవన్ ఎదుట రెసిడెంట్ వైద్యుల ఆందోళన

కోల్ కత్తా : ఆర్జీ పన్ను కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాజధానిలోని అన్ని ప్రధాన ఆసుపత్రుల రెసిడెంట్ వైద్యులు బుధవారం రాత్రి ఢిల్లీలో నిరసన చేపట్టారు. బంగా భవన్ ఎదుట కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. మంగళవారం రాత్రి జాయింట్ ఢిల్లీ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (RDA) నిరసన కార్యక్రమాన్ని ప్రకటించింది.

ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్, ఆర్ఎంఎల్, జీటీబీ, మౌలానా ఆజాద్, లేడీ హార్డింజ్ సహా పలు ఆసుపత్రుల వైద్యులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి

- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి
- హాస్టళ్లలోని ప్రతి విద్యార్థికి రూ.2500 కేటాయించాలి: కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

జనాభా ప్రాతిపదికన నిధుల కోసం చట్టం చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో గురువారం నిర్వహించిన కేవీపీఎస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, ప్రయివేటు రంగం విస్తరిస్తున్న క్రమంలో వారికి ఆయా రంగాల్లో రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నెలా హాస్టళ్లలోని విద్యార్థులకు రూ.2500 చెల్లించాలన్నారు. రాష్ట్రంలో 600 గురుకులాలు ప్రయివేటు భవనాల్లో నడుస్తున్నాయని, వాటికి వెంటనే సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గత ప్రభుత్వంలో దళితబంధు పేరు చెప్పి ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్స్ రుణాలు ఇవ్వలేదని.. వారు చెప్పిన దళితబంధు ఇవ్వడంలోనూ విఫలమయ్యారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రతి బ్యాంకులో దళితులు, గిరిజనులకు 15 శాతం రుణాలు తప్పనిసరిగా అందజేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 10 ఏండ్ల కాలంలో సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయకుండా పక్కదారి పట్టించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, లైంగికదాడులు, హత్యలు, అరాచకాల నివారణకు దేశవ్యాప్తంగా చర్చ జరిగి సమగ్ర చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘన, అసమానతలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలన్నారు. రాజ్యాంగాన్ని నీరుగార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీ విధానాలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరముందన్నారు. పూలే, అంబేద్కర్ ఆలోచనా విధానాలను అమలు చేసేందుకు దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, అధ్యక్షులు మల్లెల మాణిక్యం రాజు, నాయకులు లక్ష్మీదేవి, ఆదివిష్ణు, రాములు, సురేష్, హన్మంతు, ఖాధర్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలను ఐడీసీకి అప్పగించండి

- ప్రభుత్వాన్ని కోరుతూ బోర్డు సమావేశంలో తీర్మానం : ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు



నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

సాగునీటి పారుదల శాఖకు అప్పగించిన ఎత్తిపోతల పథకాలను తిరిగి ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఐడీసీ) పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతే టీజీఐడీసీ బోర్డు సమావేశం తీర్మానించింది. గురువారం ఐడీసీ బోర్డు సమావేశం ఆసంస్థ చైర్మెన్ మువ్వా విజయ్‌బాబు అధ్యక్షతన బంజారాహిల్స్‌లోని బోర్డు కార్యాలయంలో జరిగింది. సమావేశం అనంతరం చైర్మెన్ విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఐడీసీని నిర్వీర్యం చేశారని విజయ్‌బాబు అన్నారు. ఇరిగేషన్ శాఖలో ఐడీసీని విలీనం చేసేందుకు వీలులేకుండా గత ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందనీ, దీనివల్ల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 640 ఎత్తిపోతల పథకాలు ఉండగా వాటిలో 180 లిఫ్టులను మూసివేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. వాటి పునరుద్ధరణకు సుమారు రూ.400 కోట్లు అవసరం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలతో మాట్లాడి ఐడీసీకి పునర్వైభవం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తానని మువ్వా అన్నారు. చాలా ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని , వాటిని అరికట్టేందుకు లష్కర్లను నియమించనున్నట్టు తెలిపారు. సుమారు 5లక్షల మంది చిన్న సన్నకారు రైతులకు మేలు చేసేలా ఐడీసీని గాడిలో పెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఐడీసీ భవనంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన బ్లాకుకు గత పదేండ్లుగా వారు పన్నులు కట్టడంలేదన్నారు. దీనిపై ఆరాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మువ్వా విజయ్‌బాబు వివరించారు.

సెంట్రల్ బ్యాంక్ లాభాలు 51 శాతం వృద్ధి

सेन्ट्रल बैंक ऑफ़ इंडिया
Central Bank of India

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 50.91 శాతం వృద్ధితో రూ.913 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీ ఆదాయం, రద్దు చేసిన ఖాతాల రికవరీల్లో పెరుగుదల లాభాల వృద్ధికి ప్రధాన మద్దతును అందించాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.605 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8,412 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో 9,849 కోట్లకు చేరినట్లు ఆ బ్యాంక్ రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 3,410 కోట్లకు పెరిగిందని తెలిపింది. 2023-24 ఇదే క్యూ2లో రూ.3,028 కోట్ల ఎన్ఐఐ నమోదయ్యింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.59 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే కాలం నాటికి 4.62 శాతం నిరర్థక ఆస్తులు చోటు చేసుకున్నాయి.

యాక్సిస్ బ్యాంక్‌కు రూ,6,918 కోట్ల లాభాలు

ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 18 శాతం వృద్ధితో రూ.6,918 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.13.483 కోట్లుగా నమోదయ్యింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 29 బేసిస్ పాయింట్లు తగ్గి 1.44 శాతంగా చోటు చేసుకున్నాయి.

అన్విత బిల్డర్స్‌పై ఐటీ దాడులు

నవ తెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్‌లో ఒక ప్రముఖ గృహనిర్మాణ కంపెనీ అన్విత బిల్డర్స్ కార్యాలయాలు, యాజమానుల నివాసాలపై ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సోదాలు కొనసాగాయి. 40 మంది ఐటీ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. రాయదుర్గంలోని ఆరంతస్తుల భవనంలో ఉన్న కంపెనీ ప్రధాన కార్యాలయంలో సోదాలు ప్రారంభించిన అధికారులు కొంపల్లి, జూబ్లీహిల్స్‌లోని కార్యాలయాలతో పాటు ఆ కంపెనీ ఎండీ బి. అచ్యుతరావు ఆయన కుమారుడు అనూప్, కంపెనీ భాగస్వామి శ్రీనివాసరావు నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. గత ఐదేళ్లకు సంబంధించిన కంపెనీ వ్యాపారలావాదేవీలతో పాటు పన్నుల చెల్లింపులో అక్రమాలపై అధికారులు క్షుణ్ణంగా ఆరా తీసినట్టు తెలిసింది. కంపెనీ ఆదాయ వ్యయాలకు సంబంధించిన పుస్తకాలతో పాటు కంప్యూటర్ల హార్డ్ డిస్కులను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా సింగపూర్, దుబాయ్‌లో అన్విత బిల్డర్స్ నిర్వహించే ఇంటీరియర్ డెకరేషన్‌కు సంబంధించిన కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలపై కూడా ఐటీ అధికారులు ఆరా తీసారు. కంపెనీ యాజమాన్యం మనీలాండరింగ్‌కు పాల్పడిందా..? అనే కోణంలో కూడా ఐటీ అధికారులు దృష్టి సారించినట్టు తెలిసింది.